ఉపాధి హామీ భిక్ష కాదు..

పేదల హక్కు

- వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 288 | విజయవాడ, శుక్రవారం 24 మే 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 24 May 2024 | Rs



మోడీ గో బ్యాక్ అంటూ పాటియాలలో ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

మోడీకి రైతు సెగ

6 వరకు చర్యలొద్దు

పిన్నెల్లి సహా కేసులున్న అభ్యర్థులకు హైకోర్టులో ఊరట

పాల్వాయిగేటు పిఒ, ఎపిఒలు సస్పెన్షన్ : సిఇఒ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో ఇవిఎం ధ్వంసం చేసిన కేసులో వైసిపి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ జూన్ 6 వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 6కు వాయిదా వేసింది. అలాగే తాడిపత్రి, దెందులూరు, నర్సరావుపేట తదితర నియోజకవర్గాల్లో కేసులు ఎదుర్కొంటున్న వైసిపి, టిడిపి అభ్యర్థులకు, స్వతంత్ర అభ్యర్థులను కూడా అరెస్టు చేయరాదని ధర్మాసనం పేర్కొంది.

ఇవిఎం ధ్వంసం కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై 10 సెక్షన్‌లతో ఇసి కేసు నమోదు చేసి అరెస్టుకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పరారీలో వున్న పిన్నెల్లి గురువారం హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ వేశారు. దీనిపై హైకోర్టు విచారణ జరిపింది. పిన్నెల్లి తరపున న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. సంఘటన ఈ నెల 13న జరిగితే, 15న ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. ముందు ఎఫ్ఐఆర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు అని పేర్కొన్నారని, ఆ తర్వాత నారా లోకేష్ ట్విట్టర్‌లో వీడియోను పెట్టడంతో ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవడం సరైంది కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్విట్టర్‌లో వీడియో మార్ఫింగ్ చేసి ఉండొచ్చని, ఏడేళ్లలోపు శిక్షపడే సెక్షన్లు కావడంతో పిన్నెల్లికి ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరిన నిరంజన్‌రెడ్డి.. సుప్రీంకోర్టు అర్నేష్ కుమార్ కేసులో మార్గదర్శక సూత్రాల ప్రకారం ఏడేళ్లలోపు శిక్షపడే సెక్షన్లు ఉంటే 41ఎ నోటీసులు ఇవ్వాలని ఉందని పేర్కొన్నారు. ఎలాంటి నోటీసులివ్వకుండా అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించడం తగదని వాదించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో వేసిన ఈ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. ఈ నెల 5 వరకు పిన్నెల్లిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని, పిటిషనర్లు దర్యాప్తును, సాక్షులను ప్రభావితం చేయకూడదని ఆదేశిస్తూ కండీషన్ బెయిల్‌ను మంజూరు చేసింది.

చర్యలు తప్పవు : సిఇఒ ముఖేష్ కుమార్ మీనా

ఇవిఎంను ధ్వంసం చేసిన కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై చర్యలు తప్పవని సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. గురువారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడారు. పిన్నెల్లిని అరెస్టు చేసేందుకు ఎస్‌పి, డిఎస్‌పితో కూడిన 8 పోలీసు బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. పాల్వాయి గేటు ఘటన విషయంలో ఇసి సీరియస్‌గా ఉందన్నారు.

అలాగే పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఇవిఎం ధ్వంసం చేసిన ఘటనలో సరైన సమాచారం ఇవ్వనందుకు విధుల్లో ఉన్న పిఒ, అసిస్టెంట్ పిఒలను సస్పెండ్ చేయాలని ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు. మాచర్ల నియోజకవర్గంలో గాయపడిన కార్యకర్తల్ని పరామర్శించేందుకు టిడిపి నేతలు ఇప్పుడు వెళ్లటం మంచిదికాదని, పరామర్శలకు ఈ సమయంలో వెళ్లొద్దని చెప్పామన్నారు. ఇవిఎంలను ధ్వంసం చేస్తున్న దృశ్యాలు ఇసి నుంచి బయటకు వెళ్లలేదని, దర్యాప్తు సమయంలో అవి బయటకు వెళ్లి ఉంటాయని వివరించారు. ఈ నెల 25 నుంచి స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించేందుకు రాష్ట్రంలో పర్యటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముగిసిన ఇఎపిసెట్

- 93.47 శాతం హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఎపి ఇఎపిసెట్-2024) గురువారంతో ముగిసింది. ఈ నెల 16 నుంచి ప్రారంభమైన పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా 142 పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 3,62,851 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 3,39,139 (93.47 శాతం) మంది హాజరయ్యారని సెట్ కన్వీనర్ కె వెంకటరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి 2,74,213 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే 2,58,373 (94.22 శాతం) మంది హాజరయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 88,638 మంది దరఖాస్తు చేసుకోగా, 80,766 (91.12 శాతం) మంది హాజరయ్యారు.

ప్రాథమిక 'కీ' విడుదల

అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక 'కీ'ని విడుదల చేశారు. రెస్పాన్స్ షీట్స్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. 'కీ'పై అభ్యంతరాలుంటే ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటల్లోపు విద్యార్థులు అభ్యంతరాలు తెలియజేయొచ్చు. ఇంజినీరింగ్ ప్రాథమిక 'కీ'ను శుక్రవారం ఉదయం 10 గంటలకు విడుదల చేయడంతోపాటు రెస్పాన్స్ షీట్స్ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఈ 'కీ'పై 26వ తేదీ ఉదయం 10 గంటల వరకు అభ్యంతరాలు తెలపొచ్చు. ఇఎపిసెట్ పరీక్షకు ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా 25 శాతం వెయిటేజీ తీసుకుంటామని కన్వీనర్ తెలిపారు. ఎపి రెగ్యులర్ విద్యార్థులు కాకుండా ఇతర బోర్డులకు చెందిన విద్యార్థులు తమ మార్కులను ఇఎపిసెట్ వెబ్‌సైట్ ద్వారా అప్‌లోడ్ చేయాలని వివరించారు. విద్యార్థులకు సందేహాలుంటే 0884-2359599, 0884-2342499 ఫోన్ నెంబర్లలో గానీ, helpdeskapeapcet@apsche.org మెయిల్ ద్వారా గానీ సంప్రదించాలని తెలిపారు.

థానేలో ఘోరం

రసాయనాల ఫ్యాక్టరీలో పేలిన బాయిలర్

8 మంది మృతి, 60మందికి పైగా గాయాలు


ఫ్యాక్టరీలో ఎగసిపడుతున్న మంటలు

థానే : ముంబయికి సమీపంలోని థానే రసాయనాల ఫ్యాక్టరీలో గురువారం తీవ్ర పేలుళ్ళు జరిగిన ఘటనలో ఇద్దరు మహిళలతో సహా 8 మంది మరణించగా 60మంది గాయపడినట్లు థానే మున్సిపల్ కార్పొరేషన్ వర్గాలు తెలిపాయి. ఫేజ్ 2 డాంబివ్లి పారిశ్రామిక ప్రాంతంలో అముదాన్ కెమికల్ కంపెనీలో బాయిలర్ పేలడంతో ఈ ప్రమాదం సంభవించింది. ముంబయికి దాదాపు 40కిలోమీటర్ల దూరంలో మహారాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్ (ఎంఐడిసి) ఏరియాలో ఈ ఫ్యాక్టరీ వుంది. కాగా మరికొంతమంది కార్మికులు ఇంకా ఫ్యాక్టరీ లోపల చిక్కుకుపోయినట్లు భయపడుతున్నారు. వారంతా పగటి షిఫ్ట్‌లో పనిచేస్తున్నవారని భావిస్తున్నారు. వారి కోసం సహాయక సిబ్బంది డ్రోన్‌లను ఉపయోగించి గాలిస్తున్నారు. మధ్యాహ్నం 1.40గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమీపంలోని ఫ్యాక్టరీల్లో కూడా వెంటవెంటనే మూడు నుండి నాలుగు పేలుళ్లు సంభవించినట్లు తెలుస్తోంది. పేలుళ్ళ కారణంగా దట్టమైన పొగతో ఆ ప్రాంతమంతా నిండిపోయింది. సంఘటనా స్థలాన్ని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సందర్శించారు. గాయపడిన వారి చికిత్సకయ్యే వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. బాధితులకు వారం రోజుల్లోగా నష్టపరిహారం అందేలా చూస్తామని కూడా హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో 8మందిని సహాయక సిబ్బంది కాపాడారని చెప్పారు. దాదాపు 15 అగ్నిమాపక యంత్రాలు రంగంలోకి దిగాయని,. మొత్తంగా మంటలను అదుపు చేసేందుకు నాలుగు గంటలకు పైనే పట్టిందని అధికారులు తెలిపారు.

కాగా పేలుళ్ళ ధాటికి ఆ ప్రాంతంలో పెద్ద గొయ్యి పడింది. ఆ చుట్టుపక్కల ప్రాంతంలోని పలు భవనాలు కంపించాయి. సమీప ఇళ్ళలోని కిటికీల అద్దాలు కూడా పగిలిపోయాయని, కొన్ని ఇళ్ళు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. బాయిలర్ పేలుడుతో వెలువడిన వేడికి అత్యంత భారీగా వున్న ఇనుప కడ్డీలు కూడా వంగిపోయాయి. ఆ చుట్టుపక్కల గల ఫ్యాక్టరీల పైకప్పులన్నీ ఎగిరిపోయాయి. వీటివల్ల కూడా తీవ్ర విధ్వంసం చోటు చేసుకుంది. పేలుడు చాలా తీవ్రంగా వుందని, ఆ శబ్దాలు కిలోమీటరుకు పైగా దూరం కూడా వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆ ప్రాంతంలోనే గల సాయిబాబా గుడిలో ఆ సమయంలో చాలామంది భక్తులు వున్నారు, ఈ పేలుళ్ళతో భయపడిన వారు అక్కడ నుండి సురక్షితంగా తప్పించుకోవడానికి పరుగులెత్తారు. ఈ మంటలు పక్కనే గల రెండు భవనాలకు, కార్ల షోరూమ్‌కు వ్యాపించాయి. గాయపడిన వారందరికీ తక్షణమే చికిత్సనందించే ఏర్పాట్లు చేశామని మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తెలిపారు.



నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం, సిహెచ్ సీతారాములు, జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, తదితరులు

సిపిఎం సీనియర్ నేత

అనంతరామ శర్మ కన్నుమూత

- స్వగ్రామంలో ముగిసిన అంత్యక్రియలు
- సిపిఎం ఎపి కమిటీ సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు పెన్నా అనంతరామ శర్మ (90) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన స్వగ్రామం కట్టంగూర్ మండలం పిట్టంపల్లిలో గురువారం సాయంత్రం అంత్యక్రియలు ముగిశాయి. ఆయన కుమారులు పెన్నా రవికాంత్ శర్మ, యాదగిరి శర్మ, సరేశ్ శర్మ, కుమార్తె సీతమ్మ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అనంతరామ శర్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారు. కార్మిక నాయకునిగా, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులుగా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేశారు.

అంతకుముందు నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో కార్యకర్తలు, మిగతా 2లో



ప్రయివేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

- ఇద్దరు చిన్నారులు మృతి
- 20 మందికి పైగా గాయాలు

లోపలి పేజీలో..



పశ్చిమగోదావరి జిల్లా గనపవరం మండలం సరిపల్లిలో సిపిఎఫ్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

సిపిఎఫ్ ఫ్యాక్టరీ మూసివేత

- రోడ్డున పడ్డ కార్మికులు

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ తుపాకుల గర్జన

ఏడుగురు మావోయిస్టుల కాల్చివేత



రాయ్‌పూర్: అబుజ్‌మద్ అడవుల్లో మళ్లీ తుపాకులు గర్జించాయి. గత కొంత కాలంగా జరుగుతున్న ఎన్‌కౌంటర్ల పరంపరలో ఇది తాజాది. ఛత్తీగఢ్‌లోని బీజాపూర్ , నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో గురువారం తెల్లవారుజామున ప్రారంభమైన ఎన్‌కౌంటర్ రాత్రి పొద్దుపోయేదాకా కొనసాగుతోంది. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీజాపూర్, దంతేవాడ, నారాయణపూర్ జిల్లాల సరిహద్దులోని అబుజ్‌మద్‌లోని రేకవాయా ప్రాంతంలో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారని పోలీసులకు సమాచారం అందడంతోపెద్దయెత్తున భద్రతా దళ బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. ఇందులో దంతేవాడ, బస్తర్, నారాయణపూర్ జిల్లాల నుంచి వెయ్యి మందికి పైగా డి ఆర్‌జిఎస్, టిఎఫ్ జవాన్లు పాల్గొన్నారు. ఆ సమయంలో పోలీసులకు మావోయిస్టులకు మధ్య భీకర కాల్పులు జరిగాయి. ఇంతవరకు ఏడుగురు సాయుధ మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. వీటిలో ఐదు మృతదేహాలను దంతెవాడ డిఆర్‌జి జవాన్లు స్వాధీనం చేసుకోగా, నారాయణపూర్ జిల్లా జవాన్లు ఇద్దరు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టు అగ్రనేతలూ మరణించినట్లు సమాచారం. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో మావోయిస్టు మృతదేహాలతోపాటు ఆయుధాలు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

పక్కా సమాచారంతో ఎన్‌కౌంటర్

ఇంద్రావతి ఏరియా కమిటీకి చెందిన మావోయిస్టులు రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అధికారులకు ఖచ్చితమైన సమాచారం అందింది. దంతెవాడ, నారాయణ్‌పూర్, బస్తర్ జిల్లాలకు చెందిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ సభ్యులు, బస్తర్ ఫైటర్స్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, రాష్ట్ర పోలీసులు కలిసి గురువారం గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం 11 గంటల సమయంలో మావోయిస్టులు ఉన్న ప్రదేశానికి పోలీసులు చేరుకున్నారని, వెంటనే కాల్పులు, ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయని ఉన్నతాధికారులు తెలిపారు.

ఈ ఘటనతో కలిపి ఛత్తీస్‌గడ్‌లో ఈ ఏడాదిలో ఇప్పటివరకు జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో 112 మంది మావోయిస్టులు చనిపోయారు. ఏప్రిల్ 30న నారాయణ్‌పూర్, కాంకేర్ జిల్లాల మిగతా 2లో

ప్రజాస్వామ్యాన్ని బిజెపి జైల్లో పెడితే..

అక్కడి నుంచే ప్రజాస్వామ్యం నడుస్తుంది

ది హిందూ ఇంటర్వ్యూలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్



న్యూఢిల్లీ : అధికార బిజెపి ప్రజాస్వామ్యాన్ని జైల్లో పెడితే, అక్కడి నుంచే ప్రజాస్వామ్యం నడుస్తుందని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు.. ప్రజలకు సేవ చేయడానికి, వాగ్దానాలు నెరవేర్చడానికి రాజ్యాంగం సాక్షిగా ప్రమాణం చేశానని, తాను పదవిలో కొనసాగడానికి రాజ్యాంగ పరంగా, చట్టపరంగా ఎటువంటి అడ్డంకులు లేవని ఆయన అన్నారు. ది హిందూ పత్రికకు ఇచ్చిన ఒక ఇమెయిల్ ఇంటర్వ్యూలో కేజ్రీవాల్ ఈ విషయం వెల్లడించారు. తనను అరెస్టు చేయకపోతే లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌ను ఓడించలేమని బిజెపి అంగీకరించింది, అందుకే తనపై తప్పుడు కేసులు బనాయించి జైలులో పెట్టారని కేజ్రీవాల్ విమర్శించారు. బిజెపి తన ప్లే బుక్‌లోని ప్రతి ట్రిక్కుని ప్రయోగిస్తోంది. అయితే ఢిల్లీ ప్రజలు మాత్రం ఆప్ పట్ల తమ విశ్వాసాన్ని పునరుద్ఘాటిస్తున్నారని అన్నారు. కేజ్రీవాల్ ఇమెయిల్ ఇంటర్వ్యూ సాగిందిలా...

ప్రశ్న: అరెస్టు అయిన తర్వాత మీరు ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయలేదు. బిజెపి కోరుకున్నప్పటికీ హేమంత్ సోరెన్ రాజీనామా చేసి ఉండాల్సింది కాదని ఇటీవల మీరు అన్నారు. ఏది ఏమైనప్పటికీ, ఇది ప్రభుత్వ పనితీరులో సమస్యలను తెచ్చిపెడుతుంది కదా, అది రాష్ట్రపతి పాలన విధించే పరిస్థితి కూడా రావచ్చు.. ఫైలుపై సంతకం చేయలేని ముఖ్యమంత్రిగా మీరు ఎలా కొనసాగాలని ఆలోచిస్తున్నారు?

కేజ్రీవాల్ : నేను మూడుసార్లు ఎన్నికైన ముఖ్యమంత్రిని. ఢిల్లీ ఓటర్లలో 54 శాతం కంటే ఎక్కువ మంది ఓటు వేశారు. ముఖ్యమంత్రిగా మోడీకి కూడా 54 శాతం ఓట్లు రాలేదు. ప్రజలకు సేవ చేస్తానని, నా వాగ్దానాలను నెరవేరుస్తానని రాజ్యాంగంపై ప్రమాణం చేశాను. 2014 నుండి ఆప్‌ని నాశనం చేయడానికి బిజెపి తన ప్లేబుక్‌లోని ప్రతి ట్రిక్కును ప్రయోగిస్తోంది. అయితే, ప్రజలు అవర్ కామ్ కీ రాజనీతి (పని రాజకీయాలు) పై విశ్వాసం ఉంచారు. బిజెపి ద్వేషపూరిత, విభజన రాజకీయాలను వారు తిరస్కరిస్తున్నారు. ఈ రోజు నన్ను అరెస్టు చేశారు. రేపు మమత దీదీని, స్టాలిన్ సాబ్‌ని, భగవంత్ మాన్‌ని తప్పుడు కేసులుపెట్టి వారు అరెస్టు చేస్తారు. అప్పుడు కూడా వారిని రాజీనామా చేయమంటారు. ఇలా వుంటే ప్రజాస్వామ్యం ఎలా మనగలుగుతుంది. విచారణ లేదు, ఆధారాలు లేవు. ఇది కచ్చితంగా గూండాగిరీనే. ప్రపంచంలో నియంతృత్వ పాలనలో తప్ప ఎక్కడైనా ఇటువంటివి జరిగాయా? బిజెపి ప్రజాస్వామ్యాన్ని జైలులో పెట్టాలని చూస్తే, అక్కడి నుంచే ప్రజాస్వామ్యం నడుస్తుంది. నేను ముఖ్యమంత్రిగా కొనసాగకుండా రాజ్యాంగం కానీ, చట్టపరమైన ఫ్రేమ్‌వర్కు కానీ ఎక్కడా నిషేధం విధించలేదు.

ప్రశ్న : మీరు ఇండియా వేదిక భాగస్వాములతో మాట్లాడకుండానే "కేజ్రీవాల్ యొక్క 10 హామీలు" అంటూ వాగ్దానాలు చేశారు. దేశవ్యాప్తంగా కేవలం 22 స్థానాల్లో మాత్రమే పోటీ చేస్తున్నారు. వేదికకు సంఖ్యాబలం వస్తే సంకీర్ణ భాగస్వామ్య పక్షాల్లో మీ స్వరం ప్రతిధ్వనిస్తుందని భావిస్తున్నారా?

కేజ్రీవాల్ : మా 10 హామీలు దేనికి సంబంధించినవి? మన కలల భారతదేశాన్ని నిర్మించడానికి అవి ఒక రోడ్‌మ్యాప్. ఇక్కడ ప్రతి వ్యక్తి అభివృద్ధి చెందడానికి, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవకాశాలు ఉన్నాయి. 24 గంటల విద్యుత్ సరఫరా, మంచి విద్య, బీమా పథకాలతో నిమిత్తం లేకుండా మిగతా 7లో

చట్టపరమైన ఆదేశాలు లేవు

- గందరగోళానికి దారితీయొచ్చు
- పోలింగ్ కేంద్రాల వారీగా ఓటింగ్ డేటా వెల్లడిపై ఇసి
- సుప్రీంలో 225 పేజీల అఫిడవిట్

న్యూఢిల్లీ : పోలింగ్ శాతాన్ని లేదా పోలింగ్ కేంద్రాల వారీగా ఎన్ని ఓట్లు పోలైనదీ వెల్లడించాలని చట్టపరమైన ఆదేశాలేవీ లేవని ఎన్నికల కమిషన్ తెలిపింది. ఈ వివరాలు వెల్లడించడం వల్ల గందరగోళానికి ఆస్కారం ఏర్పడుతుందని సెలవిచ్చింది. పైగా ఆ సమాచారాన్ని దుర్వినియోగం చేసే ప్రమాదం కూడా ఉన్నదని చెప్పింది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ బుధవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన 48 గంటల్లోగా పోలింగ్ కేంద్రాల వారీగా ఓటింగ్ వివరాలను ఈసీ తన వెబ్‌సైటులో అప్‌లోడ్ చేయాలని, దీనిపై ఎన్నికల సంఘానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), కామన్ కాజ్ సంస్థలు సుప్రీంకోర్టులో ఈ నెల 17న పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌ను న్యాయస్థానం ఆదేశించింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టుకు 225 పేజీల అఫిడవిట్‌ను ఇసి అందజేసింది.

పోలింగ్ కేంద్రాల వారీగా ఓటింగ్ శాతాన్ని బహిర్గతం చేస్తే ఎన్నికల యాంత్రాంగం గందరగోళానికి గురవుతుందని తన అఫిడవిట్‌లో ఇసి తెలిపింది. పోలింగ్ కేంద్రంలో పోలైన ఓట్ల సంఖ్యను తెలియజేసే ఫారం-17సీని స్కాన్ చేసి, దానిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని చట్టంలో ఎలాంటి ఆదేశాలు లేవని స్పష్టం చేసింది. మొదటి, రెండవ విడత పోలింగ్ ముగిసిన తర్వాత ఇసి వెల్లడించిన పోలింగ్ శాతం కంటే ఆ తర్వాత విడుదల చేసిన ఓటింగ్ శాతం 5-6% ఎక్కువగా ఉన్నదని వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చింది.

2019 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పిటిషనర్ లేవనెత్తిన ఆరోపణలు నిరాధారమని ఇసి తెలిపింది. పోలింగ్ ముగిసిన తర్వాత ఫారం-17సీని పోలింగ్ ఏజెంట్ పొందవచ్చునని చెప్పింది. దాని ఒరిజనల్ కాపీలు ఇప్పుడు ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూముల్లో ఉన్నాయని వివరించింది. ఫారం-17సీ ప్రతిని ఎవరికైనా ఇచ్చేందుకు నిబంధనలు అంగీకరించవని స్పష్టం మిగతా 2లో

రాష్ట్ర పోలీసుల తీరుపై కేంద్రం సీరియస్

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిజిపికి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర పోలీసు తీరుపై కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ భద్రతా చర్యల్లో రాష్ట్ర పోలీసుల అలసత్వంపై ఘాటైన వ్యాఖ్యలతో డిజికి లేఖ రాసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా నరేంద్ర మోడీ ఈ నెల 8న విజయవాడ నగరంలో నిర్వహించిన రోడ్ షోలో భద్రతా వైఫల్యం చోటుచేసుకున్నట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ గుర్తించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు సీరియస్‌గా స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిజిపికి లేఖ పంపింది. ప్రధాని రోడ్‌షోకు 45 నిమిషాల ముందు, రోడ్ షో ప్రారంభం, చివరలో రాష్ట్ర పోలీసులు డ్రోన్లను ఎగురవేయడాన్ని కేంద్రం తప్పుపట్టింది. ప్రధాని భద్రతను పర్యవేక్షించే ఎస్‌పిజి ముందుగానే రోడ్ షో ప్రాంతాన్ని నో ఫ్లై జోన్‌గా ప్రకటించింది. అయినప్పటికీ రాష్ట్ర పోలీసులు పట్టించుకోకుండా డ్రోన్‌లను ఎగురవేయడాన్ని కేంద్రం తప్పుపట్టింది. ఈ అంశాన్ని భద్రతా వైఫల్యంగా గుర్తించి తక్షణం విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిజిపికి లేఖ రాసింది.

ఉపాధి హామీ భిక్ష కాదు.. పేదల హక్కు

- వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్, పక్కన దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు తదితరులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట (అన్నమయ్య జిల్లా)

ఉపాధి హామీ చట్టం భిక్ష కాదని, పేదల హక్కు అని, ఉపాధిని రక్షించుకుంటామని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. అన్నమయ్య జిల్లా హార్సిలీహిల్స్‌లో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షతన గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని, ఉపాధి హామీ చట్టాన్ని ప్రమాదంలో పడేశారన్నారు. విపత్తుల సమయంలో పేదలను ఆదుకున్నది ఉపాధి హామీ పథకమేనని పేర్కొన్నారు. మరోసారి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేద కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిర్వీర్యమవుతాయని హెచ్చరించారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అటవీ హక్కుల చట్టం, భూ సీలింగ్ చట్టం, 2013 భూ సేకరణ చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. దున్నే వాడికి భూమి హక్కుగా పేదలకు భూములు పంచాలని, దేశవ్యాప్తంగా భూములను వ్యవసాయ కార్మిక సంఘం తరఫున పేదలకు పంచుతామని చెప్పారు. దేశంలో ఎన్‌డిఎ ప్రభుత్వం పేదలను విభజించి, పాలించు పేరుతో కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతోందని తెలిపారు. దేశంలో మతతత్వ బిజెపికి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజలను విస్మరించి మోసం చేస్తున్నాయని, మతోన్మాద బిజెపిని నెత్తిన పెట్టుకొని ఊరేగుతున్నాయని విమర్శించారు. భూమి, ఉపాధి పరిరక్షణ కోసం వ్యవసాయ కార్మికులు ఉద్యమించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసి పరిష్కరించుకోవాలని కోరారు. సమావేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ఉపాధ్యక్షులు విక్రమ్‌సింగ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ పి.శ్రీనివాసులు, కె.రవి, కెవి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'పై కుట్రలను సహించం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



స్టీల్‌ప్లాంట్ కార్మికులపై కేంద్ర ప్రభుత్వం, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కుట్రలను సహించేది లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1197వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ సింటర్ ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు డిసిహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 2017 నుంచి నూతన వేతనాలను అమలు చేయకుండా కార్మికులను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం మోసం చేస్తోందన్నారు. అనాలోచిత నిర్ణయాలతో ఉత్పత్తిని తగ్గించి ప్లాంట్ నిర్వీర్యానికి పాల్పడుతోందన్నారు. ఈ చర్యలు కార్మికవర్గం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ట్రస్ట్ సొసైటీలో కార్మికులు దాచుకున్న సొమ్ముపైనా యాజమాన్యం పెత్తనం చెలాయించడం దుర్మార్గమన్నారు. విద్యుత్ ఛార్జీలు సైతం దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్లాంట్ పరిధిలో ఒక్కసారిగా 50 పైసలు నుంచి యూనిట్‌కు రూ.8కి పెంచేశారని తెలిపారు. పెంచిన కరెంటు ఛార్జీలను తగ్గించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ ఆంక్షలతో సకాలంలో రా మెటీరియల్‌ను కొనుగోలు చేయకుండా లాభంలో ఉన్న ప్లాంట్‌ను నష్టాల వైపునకు యాజమాన్యం నెట్టేసిందన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు శ్రీనివాసరావు, సుబ్బయ్య, డొక్కా నరసింహారావు, దాసరి శ్రీనివాస్, శ్రీనివాస్‌నాయుడు, కె.వెంకట్రావు, రమణమూర్తి పాల్గొన్నారు.

అంబటి, మోహిత్‌రెడ్డి పిటిషన్లు కొట్టివేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పల్నాడు జిల్లా సత్తెనపల్లి, తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గాల్లో రీపోలింగ్ జరపాలని కోరుతూ మంత్రి అంబటి రాంబాబు, చంద్రగిరి వైసిపి అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. పోలింగ్ రోజు హింసాత్మక ఘటనల నేపథ్యంలో సత్తెనపల్లిలోని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలని మంత్రి అంబటి రాంబాబు, చంద్రగిరిలో రీపోలింగ్ నిర్వహించాలని మోహిత్‌రెడ్డి గురువారం హైకోర్టును ఆశ్రయించారు. వారు దాఖలు చేసిన ఈ రెండు వేర్వేరు పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు.. ఎన్నికల ప్రక్రియ మధ్యలో జోక్యం చేసుకోవడం కుదరదంటూ పిటిషన్లను కొట్టేసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

త్వరితగతిన ఫలితాల వెల్లడి

- ఓట్ల లెక్కింపునకు పటిష్టమైన ఏర్పాట్లు
- సిఇఒ ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ కచ్చితమైన ఫలితాలను త్వరితగతిన ప్రకటించేలా అన్ని ఏర్పాట్లూ ప్రణాళికాబద్ధంగా చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికార్లను ఆదేశించారు. వచ్చే నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపును విజయవంతంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపునకు చేస్తున్న ఏర్పాట్లపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెదురుమదురు ఘటనలు మినహా ఈ నెల 13న జరిగిన ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో ఓట్ల లెక్కింపును కూడా ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కోరారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ముందస్తుగానే పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్‌కు సంబంధించిన అన్ని వివరాలనూ ఏజెంట్లకు ముందుగానే తెలియజేయాలన్నారు. మీడియాకూ ప్రత్యేకంగా మీడియా సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. గుర్తింపు కార్డులు లేని వ్యక్తులను, అనధికార వ్యక్తులను ఎట్టిపరిస్థితుల్లోనూ లెక్కింపు జరిగే ప్రాంగణాల్లోకి అనుమతించకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

ఇవిఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూముల వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో పటిష్టమైన మూడంచెల భద్రత కొనసాగుతోందని, అయితే స్ట్రాంగ్ రూములుకు సీలు వేసిన తలుపులు, సెక్యూరిటీ కారిడార్లను కవర్ చేసేలా ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరును నిరంతరం అధికారులు పర్యవేక్షిస్తుండాలన్నారు. భద్రత పర్యవేక్షణపై పోలీసు అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అదనపు సిఇఒలు పి కోటేశ్వరరావు, ఎమ్ఎన్ హరేంధిర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్స్‌కు 010 పద్దు

- ఎపిఎంఎస్‌టిఎఫ్ కన్వీనర్ చంద్రశేఖర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల జీతభత్యాలు 010 పద్దు కింద చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ కన్వీనర్ పి చంద్రశేఖర్, కో కన్వీనర్ బాలాజీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు సక్రమంగా అమలు జరగాలంటే ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం వర్క్‌షాప్ జరిగింది. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సొసైటీ పరిధి నుంచి తప్పించి పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి తేవాలని సమావేశంలోని సభ్యులు అభిప్రాయపడ్డారు. రెగ్యులర్ సిబ్బందికి రావాల్సిన అన్ని సర్వీస్ ప్రయోజనాలపై జిల్లాల్లోని అందరి అభిప్రాయాలను క్రోడీకరించి అధికారులకు సమర్పించాలని తెలిపారు. మోడల్ స్కూల్స్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటాలకు తమ సహకారం ఉంటుందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు.

తెలుగు విద్యార్థులను రప్పించేందుకు 2 విమానాలు

- ఎపి ఎన్ఆర్‌టి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కిర్గిజ్‌స్థాన్‌లో చిక్కుకున్న తెలుగు విద్యార్థులను స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎపి ఎన్ఆర్‌టి సొసైటీ సిఇఒ హేమలత తెలిపారు. విదేశీ వ్యవహారాలశాఖ గురువారం నుంచి కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్ నుంచి ఢిల్లీకి నేరుగా రెండు విమానాలు నడుపుతోందని ఒక ప్రకటనలో వెల్లడించారు. అక్కడి తెలుగు విద్యార్థులతో తమ సొసైటీ నిరంతరం మాట్లాడుతూ.. కౌన్సెలింగ్ ఇస్తోందని తెలిపారు. విద్యార్థుల భద్రతపై ఎప్పటికప్పుడు విదేశీ వ్యవహారాలశాఖకు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితి సాధారణంగానే ఉన్నందున విద్యార్థులు స్వదేశానికి తిరిగి వచ్చే ముందు నేషనల్ మెడికల్ కమిషన్ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని భారతీయ విద్యార్థులు బిష్కెక్‌లోని రాయబార కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

పోలీసుల సహకారంతోనే పిన్నెల్లి పరారీ

- సిఇఒకు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్ల నుంచి పారిపోవడానికి పోలీసులే సహకరించారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. సిఇఒ ఎంకె మీనాను గురువారం టిడిపి నేతలు కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వర్ల మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 13న పోలింగ్ బూత్‌లోకి చొరబడి ఇవిఎం పగలగొడితే పిఒ ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. బందోబస్తులో ఉన్న కానిస్టేబుళ్లు కూడా పిన్నెల్లిని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఇవిఎం పగలగొట్టినా రిపోర్టు ఇవ్వడానికి రెండు రోజుల సమయం ఎందుకు పట్టిందని, దీని వెనుక కుట్ర దాగి ఉందని అన్నారు. ఇప్పటికైనా అతనిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోస్టల్ బ్యాలెట్ 500 ఓట్లకు ఒక టేబుల్ ఉండాలని, స్టాంపులు, సంతకాలు లేని ఓట్లను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఇసిని కోరినట్లు తెలిపారు. టిడిపి కార్యకర్తలను బెదిరించిన మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టిడిపి నేతలు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మన్నవ సుబ్బారావు తదితరులు ఉన్నారు. మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని అనుచరులు ఎన్నికల రోజు, తర్వాత హింసాకాండ సాగించారని డిజిపి హరీష్‌కుమార్ గుప్తాకు దేవినేని ఉమామహేశ్వరరావు లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు కూడా లేఖతో జతచేసినట్లు పేర్కొన్నారు. మాచర్ల మండలం రాయవరం గ్రామంలోని 51వ పోలింగ్ బూత్‌లో వైసిపి గూండాలు తమ పార్టీ ఏజెంట్లపై దాడి చేసి రిగ్గింగ్‌కు పాల్పడ్డారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డిని వెంటనే బదిలీ చేయకపోతే ఓట్ల లెక్కింపు సరిగ్గా జరిగే అవకాశం లేదని టిడిపి అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు.

అన్ని వీడియోలు బయటపెట్టాలి : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేవలం చిన్న వీడియో క్లిప్పింగ్‌ను ఇసి అడ్డం పెట్టుకుని తమ పార్టీ ఎమ్మెల్యేను వెంటాడం తగదని, ఇసికి చిత్తశుద్ధి వుంటే హింస జరిగిన ప్రాంతాల్లోని అన్ని వీడియోలు బయటపెట్టాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎక్స్ ఖాతాలో ట్వీట్‌ల ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పలు ప్రశ్నలను సంధించారు. 13న జరిగిన ఘటనకు చెందిన వీడియో 21న ఎలా బయటకు వచ్చిందన్నారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇవిఎంను ధ్వంసం చేశారని చెబుతున్న పాల్వాయి గేట్ వీడియో నిజమైనదేనా? అని ప్రశ్నించారు. ఈ వీడియో సోషల్ మీడియాలోకి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. మాచర్లలో ఏడు చోట్ల హింస జరిగిందని చెబుతున్న ఎన్నికల సంఘం కేవలం పాల్వాయిగేట్ వీడియోనే ఎందుకు లీక్ చేసిందన్నారు. అన్ని వీడియోలు బయటకు వచ్చినప్పుడే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఓటర్లపై టిడిపి గూండాలు దాడి చేస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నా.. ఇసి వారిమీద ఎందుకు చర్య తీసుకోలేదన్నారు. పోలింగ్ అనంతరం జరిగిన సంఘటనలు పరిశీలిస్తే పోలీసులు, టిడిపి కుమ్మక్కైనట్లు కనిపిస్తోందని మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. ఈ మేరకు ఆయన నారా లోకేష్ ట్వీట్‌లో విడుదల చేసిన వీడియోతో తమకు సంబంధం లేదని ఇసి ప్రకటన చేశాక ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. మాచర్లలో టిడిపి నాయకులు అల్లర్లు సృష్టించే అవకాశం వుందని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వయంగా ఇసికి ఫిర్యాదు చేసినా స్పందించకుండా, రిగ్గింగ్‌ను నివారించేందుకు వెళ్లిన ఆయనపైనే కేసు పెట్టడం తగదని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ మీడియాతో అన్నారు.

6 వరకు అరెస్టు చేయొద్దు

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- వైసిపి, టిడిపి అభ్యర్థులకు ఊరట

ప్రజాశక్తి, అమరావతి

ఎన్నికల్లో పోటీ చేసి కేసులను ఎదుర్కొంటూ హైకోర్టును ఆశ్రయించిన పలువురు వైసిపి, టిడిపి అభ్యర్థులను అరెస్టు చేయరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టులో వ్యాజ్యాలను దాఖలు చేసిన అభ్యర్థులను జూన్ 6వ తేదీ వరకు అరెస్ట్ చేయవద్దని పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం రాత్రి జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి మధ్యంతర బెయిల్ ఉత్తర్వులను జారీ చేశారు. పలు షరతులను విధించారు. కేసు పూర్వాపరాల్లోకి వెళ్లడం లేదని స్పష్టం చేశారు. పోలీసులు తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని నోటీసులు జారీ చేశారు తదుపరి విచారణను జూన్ 6కి వాయిదా వేశారు. ముందస్తు బెయిల్‌లో పిటిషనర్లకు పలు షరతులను విధించారు. దీంతో మాచర్ల, నర్సరావుపేట, దెందులూరు, తాడిపత్రి నియోజకవర్గాల్లో పోటీ చేసిన ఆయా పార్టీల అభ్యర్థులకు ఉపశమనం కల్పించింది. పలు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. మాచర్లలో వైసిపి అభ్యర్థి అయిన సిట్టింగ్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణారెడ్డి, తాడిపత్రిలో టిడిపి అభ్యర్థి జెసి అస్మిత్ రెడ్డి, వైసిపి అభ్యర్థి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, నర్సరావుపేట వైసిపి అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దెందులూరు టిడిపి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌కు హైకోర్టు ఉత్తర్వులతో తాత్కాలిక ఊరట లభించింది. వీరితో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఇదే తరహా ఉత్తర్వులు పొందారు. పిటిషనర్లు ఎన్నికల కౌంటింగ్ ముగిసేంత వరకు పోటీ చేసిన చోట ఉండరాదని ధర్మాసనం పేర్కొంది. నలుగురు కంటే ఎక్కువ మందితో తిరగరాదని తెలిపింది. ఎలాంటి నేరపూరిత చర్యలకు పాల్పడరాదని నిర్దేశించింది. అలాగే సాక్షులను ప్రభావితం చేయడం, పిటిషనర్లపై ఉన్న కేసుల దర్యాప్తును ప్రభావితం చేయడం వంటి చర్యలకు పాల్పడరాదని పేర్కొంది. పోలీసులు ఎన్నికల సంఘం నియంత్రణలో పనిచేస్తున్నారు కాబట్టి అభ్యర్థుల కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలని ధర్మాసనం షరతులు విధించింది.

గృహ రుణాల్లో ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ వృద్ధి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఐఐఎఫ్ఎల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ అసెస్ మేనేజ్‌మెంట్ ఇయర్‌లో 25 శాతం వృద్ధి సాధించినట్లు సంస్థ రీజనల్ హెడ్ కె.ఎం.ప్రకాష్ తెలిపారు. విజయవాడలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఈ వివరాలను తెలియచేశారు. 2023 ఆర్థిక సంవత్సరంలో రూ.2,712 కోట్ల నుండి 2024 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.3317 కోట్లకు పెరిగిందని తెలిపారు. గృహ రుణాలను సులభతరంగా అందించడంలో తమ సంస్థ ముందుంటుందని తెలిపారు. ఎప్పటికప్పుడు వినియోగదారులకు సమాచారం అందించడంతో పాటు సంస్థ వృద్ధి కార్యకలాపాలను కూడా తెలియచేస్తున్నామని తెలిపారు. రానున్న కాలంలో మరింత వృద్ధి సాధించేందుకు ఇప్పటి నుండే వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

సోనీ బ్రావియా-2 విడుదల

ప్రజాశక్తి - విజయవాడ (హైల్త్ యూనివర్సిటీ)

సోనీ కంపెనీ నుండి సరికొత్తగా బ్రావియా 2 సిరీస్ టివిని మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ ప్రతినిధి ఎల్. ఈశ్వర్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని సోనీ షోరూమ్‌లో బ్రావియా టివిల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 4కె అల్ట్రా హెచ్‌డి, ఎల్ఇడి డిస్‌ప్లే సాంకేతిక ఉందన్నారు. గేమింగ్ సెషన్స్ కూడా అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేకంగా రూపొందించామన్నారు. బ్రావియా 2 సిరీస్ అద్భుతమైన వీక్షణ అనుభవాన్ని అందిస్తుందని తెలిపారు. బ్రావియా 2 సిరీస్ ఎస్-25 వేరియంట్ ఇది అసమానమైన గేమింగ్ సామర్థ్యాలను అందిస్తుందని తెలిపారు. వీటితో పాటు ఇతర ఫీచర్లు కూడా ఉన్నాయని తెలిపారు. సోనీ షోరూమ్‌లతో పాటు అన్ని ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

లూబ్రికెంట్ స్క్రూ కంప్రెసర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఈఎల్‌జీఐ నుండి పర్మనెంట్ ఆయిల్ లూబ్రికేటెడ్ స్క్రూ కంప్రెసర్స్ అందుబాటులోకి తీసుకువచ్చిన సంస్థ మార్కెటింగ్ హెడ్ మహేశ్వర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఎయిర్ కంప్రెసర్ తయారీ దారులలో ఒకటైన ఈ ఎల్ జీ ఐ ఎక్విప్‌మెంట్ సంస్థ తమ ఈజీ సిరీస్ శ్రేణికి అప్‌గ్రేడ్ చేస్తూ ఆయిల్ లూబ్రి కెంట్ స్క్రూ ఎయిర్ కంప్రెసర్ పరిచయం చేసినట్లు తెలిపారు.అత్యాధునిక ఇజిపిఎం 15 శాతం వరకు మెరుగైన సామర్థ్య లాభాలను అందిస్తుందని తెలిపారు. ప్రతి కస్టమర్లకు 16 శాతం ఉచిత ఎయిర్ డెలివరీ అందిస్తుంది అని తెలిపారు.

ఐఐటి విద్యార్థుల్లో 38 శాతం నిరుద్యోగులే

- ఈ ఏడాది మొత్తం 23 ఐఐటి క్యాంపస్‌ల్లో ఎనిమిది వేల మందికి ఉద్యోగలేమి
- గతం కంటే పెరిగిన నిరుద్యోగ శాతం
- 61 శాతం పిజి విద్యార్థులకు దక్కని ఉద్యోగం
- ఆర్‌టిఐ సమాధానంలో వెల్లడి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో విద్యా సంస్థల్లో ఐఐటిలకు ప్రత్యేక స్థానం ఉంది. ఐఐటిల్లో చదివిన వారికి మంచి ఉద్యోగాలు, లక్షల్లో వేతనాలు ఉంటాయని వింటుంటాం. కానీ, ప్రస్తుతం అందుకు భిన్నమైన పరిస్థితులు వెలుగుచూస్తున్నాయి. దేశంలోని వివిధ ఐఐటిల్లో విద్యనభ్యసించిన విద్యార్థుల్లో ఈ ఏడాది దాదాపు 38 శాతం మందికి క్యాంపస్ ఉద్యోగాలు దక్కలేదు. దేశంలో 61 శాతం పోస్ట్ గ్రాడ్యుయేట్లకు ఉద్యోగాలు దక్కలేదు. ఐఐటి కాన్పూర్ పూర్వ విద్యార్థి ధీరజ్సింగ్ సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ద్వారా సేకరించిన సమాచారంలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. ఈ ఏడాది మొత్తం 23 ఐఐటి క్యాంపస్ ల్లో దాదాపు 8 వేల మంది (38శాతం) ఐఐటి విద్యార్థులకు ఉద్యోగాలు దక్కలేదని తేలింది. 2024లో 21,500 మంది విద్యార్థులు ఉద్యోగాలు కోసం నమోదు చేసుకోగా, కేవలం 13,400 మంది మాత్రమే ఉద్యోగాలు సాధించారు. మిగతా వారు (38 శాతం) ఇంకా కొలువుల కోసం అన్వేషిస్తున్నట్లు వెల్లడైంది. రెండేళ్ల క్రితం నాటితో పోలిస్తే ఈ పరిస్థితి దాదాపు రెట్టింపు అయినట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. పాత తొమ్మిది ఐఐటిల్లో ఈ ఏడాది 16,400 మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం నమోదు చేసుకోగా, వారిలో 6,050 (37 శాతం) మందికి ఇంకా ఉద్యోగాలు దక్కలేదు. కొత్త 14 ఐఐటిల్లో అయితే ఈ పరిస్థితి మరింత క్షీణించింది. 5,100 మంది ఉద్యోగాలు కోసం నమోదు చేసుకోగా, ఇంకా 2,040 మందికి కొలువులు రాలేదని తేలింది. గతేడాది ఖరగ్‌పూర్ ఐఐటిల్లో 33 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కలేదని ధీరజ్ సింగ్ పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల్లో సంక్షోభ పరిస్థితుల కారణంగా ఇంకా ఉద్యోగాలు రాని విద్యార్థులు ఒత్తిడి, ఆందోళన, నిస్సహాయతతో ఉన్నారని ఆయన తెలిపారు. "ఉద్యోగాలురాని విద్యార్థుల సంఖ్య రెట్టింపు కావడం దేశంలోని అత్యుత్తమ ఇంజినీరింగ్ కళాశాలల్లో అనిశ్చిత స్థితిని సూచిస్తుంది. దాదాపు 61 శాతం పోస్ట్‌గ్రాడ్యుయేట్‌లు ఇప్పటికీ చోటు చేసుకోలేదు. ఇది ప్రధాన కళాశాలలు, యువ గ్రాడ్యుయేట్లు ఎదుర్కొంటున్న ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ సంక్షోభం నెలకొంది" అని ధీరజ్ సింగ్ తెలిపారు.

ఐఐటి ఢిల్లీలో గత ఐదేళ్లలో 22 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కకపోగా, 2024కు వచ్చేసరికి 40 శాతం మందికి అదే పరిస్థితి ఎదురైంది. గత రెండేళ్లలో 600 మందికి ఉద్యోగాలు దక్కలేదు. 2022 నుంచి 2024 వరకు పాత తొమ్మిది ఐఐటిల్లో నమోదు చేసుకున్న విద్యార్థుల సంఖ్య 1.2 రెట్లు పెరగ్గా, ఉద్యోగాలు సాధించనివారి సంఖ్య 2.1 రెట్లు పెరిగింది. అలాగే, నూతన ఐఐటిల్లో నమోదిత విద్యార్థుల సంఖ్య 1.3 రెట్లు పెరిగింది. కానీ ఉద్యోగాలు దక్కని విద్యార్థుల సంఖ్య కూడా 3.8 రెట్లు పెరిగింది. ఈ సంక్షోభం విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది ఆరుగురు ఐఐటి విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా, అనేక మంది తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి.

రాష్ట్రానికి తప్పిన తుపాను ముప్పు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి తుపాను ముప్పు తప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం తుపానుగా మారుతుందని, దీని ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణశాఖ అంచనా వేసింది. ఆ వాయుగుండం పశ్చిమ బెంగాల్ వైపు కదలడంతో రాష్ట్రానికి తుపాను ముప్పు తప్పిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాయుగుండం ప్రభావంతో శని, ఆదివారాల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని పేర్కొన్నారు. ఆదివారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని తెలిపారు. శుక్రవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, ఎన్‌టిఆర్, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం వుందని పేర్కొన్నారు. అలాగే శ్రీకాకుళం, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం వుందని తెలిపారు.

సిపిఎం సీనియర్ నేత అనంతరామ శర్మ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

అభిమానుల సందర్శనార్థం అనంతరామశర్మ భౌతికకాయాన్ని ఉంచారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు రాష్ట్ర నేతలు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో తమ్మినేని మాట్లాడుతూ.. సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి, తెలంగాణ రైతాంగపోరాట యోధులు అనంతరామ శర్మ అని కొనియాడారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలు యువతరానికి మార్గదర్శకం అని చెప్పారు. అనంతరామ శర్మ మరణం కమ్యూనిస్టు పార్టీలకు ముఖ్యంగా సిపిఎంకు తీవ్ర నష్టమని చెప్పారు. కేంద్ర కమిటీ సభ్యులు చెరుపెల్లి సీతారాములు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, మల్లు లక్ష్మి, డిజి నరసింహారావు, జూలకంటి రంగారెడ్డి, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, మల్లు నాగార్జునరెడ్డి, ఎండి.జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ఎపి రాష్ట్ర కమిటీ సంతాపం

పెన్నా అనంతరామ శర్మ మృతికి సిపిఐ (ఎం) ఆంధ్రప్రదేశ్ కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ఈ మేరకు ఒక సంతాప సందేశాన్ని పంపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రముఖ పాత్ర నిర్వహించడమే కాక ఆ తర్వాత పార్టీ విచ్ఛిన్నాళ్లను ఎదుర్కొని దృఢంగా నిలబడ్డ నాయకుడు అనంతరామ శర్మ అని కొనియాడారు. సిపిఎం ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆయనకు శ్రద్ధాంజలి ఘటించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసింది.

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ తుపాకుల గర్జన

(మొదటి పేజీ తరువాయి)

సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో ఇదే తరహాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ముగ్గురు మహిళలు సహా మొత్తం 10 మంది మావోయిస్టులు భద్రతా సిబ్బంది కాల్పుల్లో మరణించారు. ఏప్రిల్ 16న కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది నక్సలైట్లు హతం అయ్యారు. మే 10న బిజాపుర్ జిల్లాలోని పిడియా గ్రామానికి సమీపంలోనూ ఇదే తరహాలో భద్రతా సిబ్బందికి, మావోయిస్టులు మధ్య కాల్పులు జరిగాయి. ఆ ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు చనిపోయారు. అయితే, పిడియా గ్రామానికి సమీపంలో జరిగినది బూటకపు ఎన్‌కౌంటర్ అని, చనిపోయిన వారు అసలు మావోయిస్టులు కాదని కొందరు స్థానికులు, సామాజిక ఉద్యమకారులు ఆరోపించారు.

బొగ్గు ఉత్పత్తిలో సాంకేతిక సహకారం

- సింగరేణి సిఎండితో ఆస్ట్రేలియా కమిషనర్ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రానున్న ఐదేళ్లలో సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనకు అవసరమైన ఆధునిక మైనింగ్ టెక్నాలజీ, శాస్త్ర సాంకేతిక విషయాల్లో సహకారం అందిస్తామని ఆస్ట్రేలియా వాణిజ్య, పెట్టుబడుల శాఖ కమిషనర్ డెనిస్ ఈటెన్ అన్నారు. సింగరేణి సంస్థ సిఎండి ఎన్.బలరామ్‌తో గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో పత్యేకంగా సమావేశమయ్యారు. బలరామ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సింగరేణిలో ఉపయోగిస్తున్న సాంకేతికత, ఈ ఏడాది సాధించిన రికార్డు ఉత్పత్తి, రవాణా, టర్నోవర్, సంస్థ వృద్ధిరేటును ఆస్ట్రేలియా కమిషనర్‌కు వివరించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తితో పాటు వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా థర్మల్, సోలార్ రంగాల్లోకి విజయవంతంగా అడుగుపెట్టిందని వివరించారు.

చట్టపరమైన ఆదేశాలు లేవు

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటింగ్ శాతాన్ని బహిర్గతం చేస్తే ఆ సమాచారాన్ని మార్ఫింగ్ చేసే ప్రమాదం ఉన్నదని తెలిపింది.

అలాగే ఇసి తన అఫిడవిట్‌లో పిటిషనర్లపై మండిపడింది. కొన్ని శక్తులు తమ స్వప్రయోజనాల కోసం నిరాధారమైన, తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఇలాంటి ఆరోపణలు వస్తూనే ఉన్నాయని గుర్తు చేసింది. కాగా పోలింగ్ ముగిసిన తర్వాత ఫారం-17సీపై ప్రిసైడింగ్ అధికారి సంతకం చేసి ఏజెంటుకు ఇస్తారని, అలాంటప్పుడు ఆ సమాచారాన్ని ఇసి తన వెబ్‌సైటులో ఉంచితే సమస్య ఏముంటుందని ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ ప్రశ్నించారు.

సిపెట్ దరఖాస్తుకు చివరి తేదీ 31

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు 3 సంవత్సరాల వ్యవధి గల డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డిపిటి), డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డిపిఎమ్‌టి), బిఎస్‌సి విద్యార్థులకు 2 సంవత్సరాల వ్యవధి గల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ అనే కోర్సులను సిపెట్ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ) విజయవాడలో అందిస్తున్నట్లు ఆ కళాశాల జాయింట్ డైరెక్టరు సిహెచ్ శేఖర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్యార్థులకు కళాశాల ఆవరణలోనే విడివిడిగా హాస్టల్ వసతి, నిబంధనలను అనుసరించి అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాలు ఉన్నాయని, ఆసక్తి గలవారు సిపెట్24.ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ఫామ్.ఒఆర్‌జి/సిపెట్ అనే లింక్ ద్వారా ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సిపెట్ అడ్మిషన్ టెస్ట్‌ను జూన్ 9న విజయవాడ, అనంతపురంలో నిర్వహించి ర్యాంకు ఆధారంగా విజయవాడ కేంద్రంలో గల 150 సీట్లను భర్తీ చేస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు 9398535697 నెంబరును సంప్రదించాలన్నారు.

వడదెబ్బతో ఉపాధి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పొందూరు (శ్రీకాకుళం)


కిత్తయ్య ఫైల్‌ఫొటో

వడదెబ్బకు గురై ఉపాధి కార్మికుడు మృతి చెందిన ఘటన శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం కృష్ణాపురంలో బుధవారం చోటు చేసుకుంది. తోటి కార్మికులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణాపురానికి చెందిన గార కిత్తయ్య (65) గ్రామంలోని ఉపాధి పనులకు వెళ్లారు. పనిచేస్తున్న సమయంలో ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యారు. తోటి కార్మికులు ఇంటికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స చేసినా ఫలితం లేకుండా పోయింది. కిత్తయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన కిత్తయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ ప్రతినిధి అంబల్ల శ్రీనివాసరావు కోరారు.

సిపిఎఫ్ ఫ్యాక్టరీ మూసివేత

- రోడ్డున పడ్డ కార్మికులు

ప్రజాశక్తి - గణపవరం (పశ్చిమగోదావరి జిల్లా)


సిపిఎఫ్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు

పశ్చిమగోదావరి జిల్లా గనఫవరం మండలం సరిపల్లిలో చేపలు, రొయ్యల మేత తయారీ (సిపిఎఫ్) ఫ్యాక్టరీని యాజమాన్యం గురువారం మూసివేసింది. దీంతో, ప్రస్తుతం ఫ్యాక్టరీలో పనిచేసే 71 మంది కార్మికులు రోడ్డున పడ్డారు. 2013లో థాయిలాండ్‌కు చెందిన వ్యాపారులు సరిపల్లిలో సిపిఎఫ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. గణపవరం, సరిపల్లి, తణుకు, వైజాగ్, భీమవరం ప్రాంతాలకు చెందిన 195 మందిని ఫ్యాక్టరీలో ఇంజనీర్లుగా, ప్రొడక్షన్ మేనేజర్లుగా, క్వాలిటీ అధికారులుగా తీసుకున్నారు. 2023 వరకూ మూడు షిఫ్టులతో ఫ్యాక్టరీ నడిచింది. దేశవ్యాప్తంగా భారీ లాభాలతో కొనసాగింది. ప్రస్తుతం నష్టాల బాటలో నడుస్తోందని, యాజమాన్యం ఫ్యాక్టరీలో పనిచేసే కొద్ది మందిని రాజమండ్రి, వైజాగ్‌లో ఉన్న ఫ్యాక్టరీలకు బదిలీ చేసింది. కొంతమంది మానేసి వెళ్లిపోయారు. మిగిలిన 71 మంది ఉద్యోగులు మాత్రమే ఇక్కడ పనిచేస్తున్నారు. ఫ్యాక్టరీ నష్టాల బాటలో నడుస్తోందని, నెల రోజులు పని చేసినా 20 రోజులకు జీతం ఇస్తామని చెబుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వద్ద మూడు నెలలుగా ఈ విషయంపై చర్చించినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. గురువారం ఫ్యాక్టరీని మూసివేసి తమను బయటకు పంపివేసి గేట్లకు తాళం వేసిందని తెలిపారు. చేసేదిలేక గేటు వద్ద ఆందోళన చేపట్టామన్నారు. ఫ్యాక్టరీలో చేరినప్పుడు ఉద్యోగ భద్రత కల్పిస్తామని థాయిలాండ్ యాజమాన్యం హామీ ఇచ్చిందని, ఆ హామీని నెరవేర్చకుండా ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులను, ఉద్యోగులను బయటకు పంపడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం జిల్లా కలెక్టర్‌కు తెలియజేశామని, ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. సరిపల్లిలో సిపిఎఫ్ ఫ్యాక్టరీని కొనసాగించాలని, కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.పెంటారావు, పి.గోవిందు డిమాండ్ చేశారు. నష్టాలు వస్తున్నాయనే వంకతో కార్మికులను రోడ్డున పడేయటం అన్యాయమన్నారు. జిల్లా లేబర్ అధికారులు కలుగజేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా అన్నమయ్య జయంతి వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

తెలుగు పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య 616వ జయంతి ఉత్సవాలు గురువారం అన్నమయ్య జిల్లా తాళ్ళపాకలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత తాళ్లపాకలోని ధ్యానమందిరం వద్ద శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. తిరుమల ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల్ దీక్షితుల ఆధ్వర్యంలో ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వేడుక నిర్వహించారు. అంతకుముందు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఉదయం 9 నుండి 10 గంటల వరకు బృందగానం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు తిరుపతికి చెందిన గాయకులు ఉదయభాస్కర్, హేమమాలిని అన్నమయ్య గీతాలు ఆలపించారు. అనంతరం తిరుపతికి చెందిన శ్రీనివాస్ బృందం హరికథ గానం చేశారు. ఈ వేడుకల్లో అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు విభీషణ శర్మ, విశాఖపట్నం శారద పీఠాధిపతి స్వరూపానంద తదితర ప్రముఖులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 25న రాజంపేట-కడప హైవేలో ఉన్న 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద శ్రీవారి ఊంజల్‌సేవ నిర్వహించనున్నారు.

ప్రయివేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

- ఇద్దరు చిన్నారులు మృతి
- 20 మందికి పైగా గాయాలు

ప్రజాశక్తి-గోనేగండ్ల (కర్నూలు)


రోడ్డుపై పడిపోయిన బస్సు, క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

ప్రయివేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడిన ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. 20 మందికిపైగా గాయపడ్డారు. ఈ సంఘటన కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాదు నుంచి ఆదోనికి వస్తున్న బిస్మిల్లా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ప్యాలకుర్తి వద్ద ఓ వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి బోల్తా పడింది. గాఢనిద్రలో ఉన్న ప్రయాణికులందరూ ఒక్కసారిగ ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో తెలుసుకునే లోపు క్షతగాత్రుల అర్తనాదాలు మిన్నంటాయి. ప్యాలకుర్తి గ్రామ స్థానికులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రోడ్డుపై పడిపోయిన బస్సును జెసిబి సహాయంతో నిలబెట్టారు. అప్పటికే బస్సు కింద మైదుకూరుకు చెందిన వెంకటేష్ కుమార్తె లక్ష్మి (13), సురేష్ కుమార్తె గోవర్ధని (8) నలిగిపోయి విగత జీవులుగా పడి ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బస్సులో ప్రయాణిస్తున్న 29 మందిలో 20 మందికిపైగా గాయపడ్డారు. వీరందరినీ కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నారు. ఎస్‌పి. కృష్ణకాంత్ సంఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కోడుమూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న బి.సోమయ్య

వేతనాల కోసం క్లాప్ డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరపాలక సంస్థలో పని చేస్తున్న 60 మంది క్లాప్ ఆటో డ్రైవర్లకు గత నెల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, డిసెంబర్ నెల సమ్మె కాలపు జీతం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏలూరు నగరపాలక సంస్థ వెహికల్ డిపో వద్ద క్లాప్ ఆటో డ్రైవర్లు గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ.. క్లాప్ ఆటో డ్రైవర్లు నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని, కనీసం వారికి గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేదని తెలిపారు. ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించడంలేదని, సమ్మె కాలం జీతాలు కూడా చెల్లించలేదని వాపోయారు. క్లాప్ ఆటోలకు సకాలంలో మరమ్మతులు కూడా చేయించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్లాప్ ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఈ సమస్యలను పరిష్కరించని పక్షంలో ఈ నెల 27 నుంచి పనులు నిలుపుదల చేసి నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమానికి క్లాప్ ఆటో డ్రైవర్లు రాజు, గణేష్, సుగుణ రావు, సతీష్, సుబ్బారావు, రాజేష్ తదితరులు నాయకత్వం వహించారు.


మాచర్లలో 144 సెక్షన్ అమలు నేపథ్యంలో మూతబడ్డ దుకాణాలు

టిడిపి నేతల గృహ నిర్బంధం

- చలో మాచర్ల భగ్నం

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

ఎన్నికల నేపథ్యంలో తలెత్తిన ఘర్షణల్లో గాయపడిన, నష్టపోయిన టిడిపికి చెందిన వారిని నాయకులు పరామర్శించేందుకు చేపట్టిన 'చలో మాచర్ల'కు పోలీసులు అనుమతిని నిరాకరించడంతోపాటు వెళ్లడానికి ప్రయత్నించిన వారినీ అడ్డుకున్నారు. టిడిపి నాయకులను ఎక్కడికక్కడే ముందస్తుగా గృహ నిర్బంధాల్లో ఉంచారు. మాచర్ల పట్టణంలోనూ 144 సెక్షన్ విధించి బయటి వారు ఎవరూ రాకుండా కట్టడి చేశారు. దుకాణాలు, ఇతర కార్యాలయాలను మూసేయించారు. పట్టణంలోని పలువురు టిడిపి నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా మాచర్లకు వెళ్లేందుకు ప్రయత్నించిన టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు, మాచర్ల నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, నాయకులు కె.శ్రీనివాసరావును గుంటూరులో గృహ నిర్బంధంలో ఉంచారు. విజయవాడ నుంచి బయలుదేరిన మాజీ మంత్రి దేవినేని ఉమ, వర్ల రామయ్యనూ గహ నిర్బంధంలో ఉంచినట్లు పోలీసులు తెలిపారు.

ఇసి స్పందించకుంటే న్యాయ పోరాటం : వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పోలింగ్‌కు ముందు, ఆ తర్వాత జరిగిన అక్రమాలపై ఎన్నికల కమిషన్ స్పందించకుంటే న్యాయ పోరాటం చేస్తామని వైసిపి ప్రకటించింది. గురువారం సచివాలయంలో సిఇఒ ముఖేష్‌కుమార్ మీనాను వైసిపి ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైసిపి గ్రీవెన్స్‌సెల్ రాష్ట్ర అధ్యక్షులు అంకంరెడ్డి నారాయణమూర్తి కలిసి వినతిపత్రం సమర్పించారు. టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఆ పార్టీ కార్యకర్తలు పెద్దయెత్తున పోలింగ్ అక్రమాలకు పాల్పడ్డారని వివరించారు. అనంతరం మల్లాది విష్ణు, కాసు మహేష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. టిడిపి చేస్తున్న విధ్వంసాన్ని ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని అన్నారు. 60, 70 పోలింగ్ బూత్‌లలోకి టిడిపి నాయకులు చొరబడి రిగ్గింగ్ చేశారని ఆరోపించారు. వెబ్ కెమెరాల ఫుటేజ్ పరిశీలించి రీ పోలింగ్ జరపాలని కోరినా ఇసి స్పందిచకపోవడం సరికాదన్నారు. రాష్ట్రంలో జరిగిన ఈ హింసకు ఇసి, బిజెపి, టిడిపి బాధ్యత వహించాలన్నారు.

నాణ్యతపై మీన మేషాలు

- ప్రమాణాల రూపకల్పనలో అయోమయం
- ఇరిగేషన్, ఆర్అండ్‌బి పనుల్లో లోపాలు
- పంచాయితీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల్లోనూ ఇంతే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు, పథకాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మిస్తున్న భవనాలు, ఇతర నిర్మాణాల నాణ్యత లోపభూయిష్టంగా ఉంటోందన్న వాదనలకు అధికారుల తీరు బలం చేకూర్చుతోంది. నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించాల్సిన క్వాలిటీ కంట్రోల్ విభాగం పూర్తిగా పడకేసినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని వివిధ శాఖల పరిధిలో చేపట్టే నిర్మాణాలన్నిటికీ ఒకే విధమైన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, తద్వారా పారదర్శకత, నిర్మాణ పటిష్టత వంటి విషయాల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చుని ఇదివరకే అన్ని శాఖల అధిపతులు ఒక నిర్ణాయానికి వచ్చినా..అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదించడంలో సంబంధిత శాఖల అధికారుల మీన మేషాలు లెక్కిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపడుతున్న నిర్మాణాల్లో నాణ్యత ఏ స్థాయిలో ఉదంటే 'ఎవరికి ఎరుక' అనే సమాధానం సంబంధిత శాఖల ఉన్నతాధికారుల నుంచి వినిపిస్తుండటం విశేషం.

ప్రధానంగా నీటిపారుదల, పంచాయితీరాజ్, గృహనిర్మాణం, రోడ్లు భవనాల శాఖ, వైద్య ఆరోగ్యం వంటి శాఖల్లో భారీ స్థాయిలో నిర్మాణాలు జరుగుతుంటాయి. వీటి కోసం ఏటా వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటారు. అయితే ఆయా పనుల్లో నాణ్యతా ప్రణామాలను గుర్తించేందుకు నిర్దిష్టమైన విధానమంటూ ఏదీ లేదు. ఏ శాఖకు ఆ శాఖ క్వాలిటీ కంట్రోల్‌ను అమలు చేసేందుకు ప్రయత్నించడం వల్ల ఇబ్బందులొస్తున్నాయన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు నాణ్యతా ప్రమాణాల్లో అన్ని శాఖలకు 'ఒకే విధానం' తీసుకురావాలన్న ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఇందుకోసం ఆయా శాఖల ఇంజనీరింగ్ విభాగాలతో ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. వీటిని బోర్డ్ ఆఫ్ చీఫ్ ఇంజనీర్స్ (బోస్) ఆమోదముద్ర కూడా వేసింది. ఆయా నిర్మాణాల్లో క్వాలిటీ కంట్రోల్‌కు సంబంధించిన అన్ని అంశాలతో సవివరమైన నివేదికను గతంలోనే ప్రభుత్వానికి కూడా అందజేసినట్లు తెలిసింది. కానీ దీనిపై ఇప్పటివరకు తుది నిర్ణయం తీసుకోకుండా సంబంధిత యంత్రాంగం నాన్చుతూ వస్తోందని కీలక శాఖకు సంబంధించిన చీఫ్ ఇంజనీర్ ఒకరు వ్యాఖ్యానించారు.

కనీసం థర్డ్ పార్టీ ద్వారా అయినా క్వాలిటీ కంట్రోల్ పర్యవేక్షించాలని ఆర్థికశాఖ నుంచి అన్ని శాఖలకు సూచనలు వెళ్లినా వాటిని కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

నేటి నుంచి టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 3వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 1,61,877 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. మొత్తం 685 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. జూన్ 1వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 5,03,459 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 3,65,872 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,37,587 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు నిర్వహించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 861 పరీక్ష కేంద్రాలను బోర్డు ఏర్పాటు చేసింది.

విద్యుదాఘాతంతో దంపతులు మృతి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు (నెల్లూరు)

విద్యుదాఘాతంతో దంపతులు మృతి చెందిన ఘటన నెల్లూరు జిల్లా టిపిగూడూరులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరు గ్రామంలో అన్నం నరసయ్య (60), అన్నం భాగ్యమ్మ (55) దంపతులున్నారు. నరసయ్య కల్లుగీత కార్మికుడు. బుధవారం అర్ధరాత్రి టేబుల్ ఫ్యాన్ ఆఫ్‌చేసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై నరసయ్య మృతి చెందారు. గది నుంచి బయటకు రాకపోవడంతో భర్తను నిద్రలేపేందుకు వెళ్లిన భాగ్యమ్మ కూడా విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. విద్యుదాఘాతంలో తల్లిదండ్రులు మరణించినట్లు గ్రహించిన కుమారుడు మెయిన్ స్విచ్‌ను ఆపేశారు. రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


విరాళానికి సంబంధించిన పత్రాన్ని కలెక్టర్‌కు అందజేస్తున్న రతన్‌రాజ్

సంజీవని నిధికి హెచ్‌పిసిఎల్ ఉద్యోగుల విరాళం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

పేదలకు, అనారోగ్య బాధితులకు సాయం చేయాలనే దృక్పథంతో నెలకొల్పిన సంజీవని నిధి (డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్)కి హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీ ఉద్యోగులు తమ వంతు సాయంగా రూ.6,45,000ను విరాళంగా అందించారు. సదరు మొత్తాన్ని సంజీవని నిధి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ మేరకు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జునను హెచ్‌పిసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి రతన్‌రాజ్ కలిసి సంబంధిత పత్రాలను గురువారం అందజేశారు.

విశాఖ రిఫైనరీలో పని చేస్తున్న ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి సంజీవని నిధికి తమ వంతుగా ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయమని కలెక్టర్ అభినందించారు. హెచ్‌పిసిఎల్ ఉద్యోగుల చూపిన చొరవను, దాతృత్వాన్ని మిగిలిన అందరిలో తప్పకుండా స్ఫూర్తిని నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న డిజిపి హరీష్ కుమార్ గుప్తా

ప్రజాశక్తి, వన్‌టౌన్ (ఎన్‌టిఆర్ జిల్లా)


డిజిపి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఒ రామారావు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను గురువారం రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు అందజేశారు.

వనపర్తిలో బిఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్య

- గొడ్డలితో నరికి చంపిన గుర్తుతెలియని వ్యక్తులు
- కాంగ్రెస్‌ది ప్రతీకార పాలన : కెటిఆర్
- అంత్యక్రియల్లో మాజీ మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ నేత,మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి ముఖ్య అనుచరుడు బొడ్డు శ్రీధర్‌రెడ్డి (45) హత్యకు గురయ్యారు. వనపర్తి జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో దాడి చేసి హతమార్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా లక్ష్మీపల్లి, పరిసర గ్రామాల్లో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేశారు. శ్రీధర్ రెడ్డి హత్య విషయం తెలిసిన వెంటనే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ గురువారం మధ్యాహ్నం లక్ష్మీపల్లి కెటిఆర్ గ్రామానికి వచ్చి శ్రీధర్ రెడ్డికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అంత్యక్రియల్లో కెటిఆర్‌తోపాటు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. శ్రీధర్‌రెడ్డిని కిరాతకంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి మంత్రి జూపల్లినే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పేరుకేమో ప్రజాపాలన.. చేస్తున్నది ప్రతీకార పాలన అని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని ఫ్యాక్షన్ సంస్కృతిని మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్‌లో తీసుకొచ్చారన్నారు. జనవరిలో మల్లేష్ యాదవ్, ఇప్పుడు శ్రీధర్‌రెడ్డి హత్యకు కారణమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ప్రమేయం, ప్రోద్బలం లేకుండా ఆయన అనుచరులు ఇంత దారుణాలకు తెగబడరని అన్నారు. స్థానిక పోలీసులపై తమకు నమ్మకం లేదని, వరుస హత్యలపై ప్రత్యేక దర్యాప్తు సంస్థ ఏర్పాటు లేదా జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఇదే దాడుల సంస్కృతి కొనసాగితే తమ కార్యకర్తలనూ తాము నియంత్రించలేమన్నారు. హత్యా రాజకీయాలు కొనసాగితే మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడికి వెనుకాడబోమని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీధర్ రెడ్డి హత్య ముమ్మాటికీ రాజకీయ హత్య అని అన్నారు. అతని రాజకీయ ఎదుగుదలను గిట్టని కొందరు వ్యక్తులు మంత్రి ప్రోద్బలంతోనే హత్య చేశారని ఆరోపించారు. శ్రీధర్‌రెడ్డి హత్యపై సిబిఐ విచారణ చేపట్టి మంత్రి జూపల్లి కృష్ణారావును బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని వాటిని కట్టడి చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు శ్రీధర్‌రెడ్డి హత్యకు నిరసనగా మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. ర్యాలీగా లక్ష్మీపల్లికి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

సంపాదకీయం

ధరల సూచీలకు జాప్యమేల?


మోడీ ప్రభుత్వానికి శ్రమజీవుల సంక్షేమం పట్ల ఉన్న నిర్లక్ష్యమూ, యాజమాన్యాల పట్ల ఉన్న శ్రద్ధాసక్తీ మరోసారి వెల్లడైంది. నెలనెలా విడుదల చేయాల్సిన వినియోగ ధరల సూచీని రెండు నెలల నుంచి విడుదల చేయకపోవడం కేంద్ర కార్మిక శాఖ నిర్వాకాన్ని ఎత్తి చూపుతోంది. మోడీ షాల పదేళ్ల పాలనలో పెట్రోలు, డీజిలు, వంట గ్యాసు ధరలు రెండింతలూ, మూడింతలూ పెరగడంతో- వాటి ఆధారిత ధరలన్నీ ఎప్పుడో ఆకాశాన్నంటాయి. అందుకు తగ్గట్టుగా వేతనాలు పెరగక, నిజ ఆదాయాలను కోల్పోయిన అన్ని తరగతుల ఉద్యోగులూ దైనందిన జీవితాలను నెట్టుకురావటానికి నానా ఇబ్బందులూ పడాల్సి వస్తోంది. అరకొర జీతాలతో పనిచేస్తున్న సంఘటిత, అసంఘటిత కార్మికుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది.

పెరిగిన ద్రవ్యోల్బణానికి అనుగుణంగా శ్రమజీవులు ఆహార ఖర్చులను తట్టుకోవటానికి ధరల సూచీని విడుదల చేయడం, దానినిబట్టి సంస్థల యాజమాన్యాలు కరువు భత్యం (డిఎ) పెంచటం దశాబ్దాలుగా అమలులో ఉన్న చట్టబద్ధమైన ప్రక్రియ. ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులూ అవసరమైన పోషకాహారాన్ని తీసుకోవాలనేది ఈ ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశం. గత నెలలో వివిధ ఆహారోత్పత్తుల ధరలను సేకరించి, మధించి, వాటి హెచ్చుతగ్గుల వివరాలను నడుస్తున్న నెల ఆఖరి రోజున కేంద్ర మంత్రిత్వ శాఖ విడుదల చేయాలి. ఈ పని 2024 జనవరి వరకూ జరిగింది. ఫిబ్రవరి, మార్చి నెలల ధరల సూచీలను మాత్రం ప్రకటించకుండా నొక్కి పెట్టారు. ఆ రెండు మాసాలకు సంబంధించి లేబర్ బ్యూరో సేకరించి, గణించిన ద్రవ్యోల్బణ గణాంకాలు వివిధ సందర్భాల్లో ప్రస్తావనకొచ్చాయి కూడా. కానీ, కార్మికులకు ఉపయోగపడే ధరల సూచీలను మాత్రం ఇంతవరకూ విడుదల చేయలేదు. ఎందుకు ప్రకటించలేకపోయారో కూడా ఎక్కడా పేర్కొనలేదు.

వెల్లడైన గణాంకాల ప్రకారం ... ఈకాలంలో ఆహారోత్పత్తుల ధరలు విపరీతంగా పెరిగాయి. టోకు ధరల సూచీ (డబ్ల్యుపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 1.26 శాతంగా నమోదైంది. గడచిన 13 నెలల్లో ఇదే గరిష్ఠ స్థాయి. ఫిబ్రవరిలో 0.20 శాతం ఉన్న టోకు ధరల సూచీ (డబ్ల్యుపిఐ) మార్చిలో 0.53 శాతానికి, ఏప్రిల్‌లో 0.79 శాతానికి ఎగసింది! కూరగాయల ధరలు 19.52 శాతం నుంచి 23.60 శాతానికి ఎగసాయి. భారతీయులు ఎక్కువగా వినియోగించే బంగాళాదుంపల ధరలు 71.97 శాతం పెరిగాయి. ఉల్లి ధరలు 59.75 శాతం హెచ్చాయి. ఈ సంఖ్యల అన్నింటి సారాంశం ఒక్కటే.. ప్రజలు ఆహారంపై పెట్టే ఖర్చు గణనీయంగా పెరిగిందీ అని. కార్మిక మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు ధరల సూచీని విడుదల చేసి ఉంటే- ఉద్యోగులకు, కార్మికులకు ఎంతోకొంత ఉపశమనం దొరికి ఉండేది. సూచీలో పేర్కొన్న వ్యత్యాసాన్ని బట్టి సంస్థల యాజమాన్యాలు భత్యాన్ని పెంచాల్సి ఉండేది. పద్ధతి ప్రకారం జరగాల్సిన ఈ పనిని కేంద్ర ప్రభుత్వం కావాలనే ఆపేసిందని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి. పెరిగిన ధరలు, ద్రవ్యోల్బణం ఎన్నికల వేళ ప్రస్తావనకు రాకుండా ఉండటానికి; తన పనుపున నిలిచే యజమానులకు మేలు చేయటానికీ బిజెపి ఉద్యోగులకు ఈ ద్రోహం తలపెట్టింది.

కేంద్రం ప్రదర్శిస్తున్న ఈ నిర్లిప్త, నిర్లక్ష్య వైఖరి లక్షలాది మంది ఉద్యోగుల, కార్మికుల ప్రయోజనాలకు తీవ్రమైన దెబ్బ. ధరల సూచీ విడుదలలో జాప్యం కారణంగా బ్యాంకు ఉద్యోగులతో సహా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ కార్మికులూ డియర్‌నెస్ అలవెన్సు (డిఎ)ను కోల్పోతారు. ఎఐసిపిఐ ఐడబ్ల్యు వెల్లడించే ఈ గణాంకాల మధింపు ఉద్యోగుల డిఎ లెక్కలకు మాత్రమే కాదు; ద్రవ్యోల్బణం, ఇతర విధాన సూత్రీకరణలకూ దోహదపడతాయి. దేశ ఆర్థిక, సామాజిక స్థితిగతులను అంచనా వేయటానికీ, అధ్యయనం చేయటానికీ ఉపకరిస్తాయి. ఇదే విషయమై సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ బుధవారం కేంద్ర కార్మిక శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు లేఖ రాశారు. "ధరల సూచీ విడుదలలో ఇప్పుడు జరిగిన జాప్యం అసాధారణమైనది." అని పేర్కొన్నారు. కార్మికుల, ఉద్యోగుల సహనాన్ని పరీక్షించకుండా తక్షణం మూడు నెలల ధరల సూచీలను ప్రకటించటం కేంద్ర ప్రభుత్వ బాధ్యత.

మహనీయుల మాట



పుస్తకాలు ఎంత ముఖ్యమో, అంతకంటే పది రెట్లు మనిషి జీవితానుభవం ద్వారా నేర్చుకోగలుగుతాడు. విద్య పుస్తకాల వరకే పరిమితం కాక, నిత్య జీవితంతో సంబంధం కలిగి వుండాలి. అది జీవితాంతం విద్య కావాలి.

- గ్రుండ్ విగ్,


ఫోక్ హైస్కూల్ రూపకర్త

ప్రాణాలు తీసేవాడిని ప్రజలు క్షమించరు

ప్రజలు వాస్తవమైన ఆనందం ఏమిటో గ్రహించిన రోజున, ఆ ఆనందాన్ని పొందడం సాధ్యమేనని తెలుసుకున్న రోజున, మతం అదృశ్యమౌతుంది- అయితే, పాలకవర్గాలు తమ ప్రయోజనాల రీత్యా- ప్రజలు అసలు విషయం తెలుసుకోకుండా అడ్డుపడుతుంటారు. తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి మతాన్ని ఉపయోగించుకుంటారు.

- ఆగస్ట్ బెబెల్,

రచయిత, వక్త, జర్మన్ సోషలిస్ట్ రాజకీయవేత్త.




డా॥ దేవరాజు మహారాజు

తెలివిగలవాడికైతే వాడి మెదడు పని చేస్తుంది. తెలివి లేనివాడికైతే వాడి నాలుక పని చేస్తుంది-అనే మాట ఉంది. తెలివిగల నాయకుడే కదా సకారాత్మకమైన నిర్ణయాలు తీసుకుని, ఒకవైపు ప్రజా సంక్షేమం మీద, మరో వైపు అభివృద్ధి మీద దృష్టి పెడతాడూ? అవి చేయలేని నాయకుడు మన్‌కీ బాత్ పేరిట నాలుకను తెగ ఉపయోగిస్తాడు. కోతల పురాణం వినిపిస్తాడు. అది పదేళ్ల పాటు విన్న ఈ దేశ ప్రజలు తమకు రవ్వంతైనా లాభం చేకూరిందా?-అని ఆలోచనలో పడ్డారు!

ఒక సంప్రదాయవాదుల ఇంట్లో నామకరణ మహోత్సవం జరుగుతూ ఉంది. పురోహితుడు పిల్లవాడికి 'నరేంద్ర' అనే పేరు పెట్టమని సూచించాడు. పక్కన ఓ మూల కూర్చున్న పిల్లవాడి నానమ్మకు దు:ఖం ఆగలేదు. బోరున ఏడ్చింది. "ఏంటమ్మా? ఏమైందీ?"-అని అందరూ ఆత్రంగా అడిగారు. "నా మనవడు ఇక ఎప్పుడూ నిజం మాట్లాడలేడు కదా? అని ఏడుపొచ్చింది!"-అని చెప్పింది. పురోహితుడు తల వంచుకున్నాడు. బంధువులంతా పగలబడి నవ్వారు.

ఒక బఫూన్ (హాస్యగాడు) రాజమందిరంలోకి ప్రవేశించినంత మాత్రాన అతను రాజు కాలేడు. కానీ, రాజ మందిరమే సర్కస్ అవుతుంది-అనేది ఒక టర్కిష్ సామెత. ఇది మన దేశంలో ఎవరికి వర్తిస్తుందో ఈ దేశ ప్రజలకు తెలుసు. చిత్ర విచిత్ర వేషధారణలతో జనాన్ని ఆకర్షించాలనుకునే వాడు-ఈ దేశ ప్రధాని నరేంద్ర మోడీనే! ఆయన పరిపాలన మీద దృష్టి పెట్టలేదు. ఎలా పెట్టగలడూ? నిజాయితీ, నిబద్ధతా లేని వాడు కదా? ఆయన కాలంలో విదేశాల్లో దేశానికి ఉన్న పరువు పోయింది. దేశంలో కరువు పెరిగింది. ధర్మ వ్యాధిగ్రస్తుడయిన అధర్మ పాలకుడుగా ఆయన చరిత్రలో మిగిలిపోయాడు. పెద్ద నోట్ల రద్దు కాలంలో ఒక పెద్దాయన ఇలా అన్నాడు. 'మాటిమాటికీ నోట్లు మార్చుకునే బదులు, ఒక్కసారే ప్రభుత్వాన్ని మార్చుకోవడం మేలు' అని! ఈ దేశ ప్రజలు ఎప్పటినుండో అనుకుంటున్నారు. ఇక ఇప్పుడు మార్చుకునే సమయం రానే వచ్చింది.



దేశానికి తిండి పెట్టే రైతుల మీద మోడీ ప్రభుత్వం బుల్లెట్లు కురిపిస్తుందా? వారి దారిలో మేకులు కొట్టిస్తుందా? ఏడు వందల మంది రైతుల ప్రాణాలు తీసిన మోడీ ప్రభుత్వాన్ని ఈ దేశ ప్రజలు ఇప్పుడే కాదు, ఇక ఎప్పటికీ క్షమించరు. గుజరాత్, మణిపూర్ మారణకాండలు జరిపించిన మోడీ-షాలు తమ గొయ్యి తామే తవ్వుకున్నారు. మనుషులుగా కూడా మిగిలిలేరు. అయినా, జడ్జిని చంపించిన వాడిని దేశ హోంమంత్రిగా చేసుకోవడమా? ఎంత అమానవీయం? ఎంత అమానుషం? రచయితల్ని, ఆలోచనాపరుల్ని, ప్రతిపక్ష నాయకుల్ని చంపించి లేదా జైళ్లలోకి తోయించి రాజ్యమేలుతామనుకుంటే ఎలా? ప్రశ్నను ఎవడూ అణిచివేయలేడని తెలుసుకోలేని బుద్ధిహీనులు అహంకారంతో ప్రవర్తిస్తే ఏమవుతుందీ? ఆలస్యం అవుతుందేమోగానీ, చివరికి మట్టి కరవాల్సిందే. తప్పదు!

కాంగ్రెస్ పాలనలో ప్రధాని ఒక రూపాయి విడుదల చేస్తే లబ్ధిదారులకు పదిహేను పైసలే అందుతున్నాయని-ఒక విమర్శ ఉండేది. నిజమే కావచ్చు. కానీ, ఇప్పుడు ఈ బిజెపి ప్రధాని ప్రజల నుండి పదిహేను రూపాయలు లాగుతూ లబ్ధిదారులను ఒట్టి చేతులే చూపుతున్నాడు. కదా? ఆయన 'భాయియో..' అని మెత్తగా సంభోదించాడంటే, 'రండిరా రండి మీ గొంతులు కోయడానికే నేనొచ్చానన్నంత'-ప్రేమ వొలికిపోతుంది కదా? ఇటీవల ఈ దేశ ప్రధాని తాను విలేకరుల సమావేశాలు ఎందుకు ఏర్పాటు చేయడో దాని వెనుక ఉన్న రహస్యం ఏమిటో బట్టబయలు చేశాడు. సోషల్ మీడియాలో అబద్ధపు వార్తలు ప్రచారమవుతున్నాయనీ, అందుకని తాను ప్రెస్ మీట్లు పెట్టడం లేదని సెలవిచ్చారు. వంద ఎలుకల్ని మింగిన పిల్లి సత్య వచనాలు ప్రవచించినట్టుగా ఉందా వివరణ. పైగా ఆయన ఈ దేశ ప్రజల్ని కూడా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించాడు. తప్పుడు వార్తల్ని నమ్మొద్దన్నాడు. బాగానే ఉంది కానీ, నాలుగు వేల ఐటి ఉద్యోగులతో ఐటీసెల్ ఏర్పాటు చేసి తప్పుడు వార్తలు, మార్ఫింగ్ చేసిన ఫొటోలు రోజూ వేలకు వేలు దేశ వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న పార్టీ ఏది తండ్రీ? ముందా విషయం చెప్పు అని అడిగేవాడు లేకనే కదా? ఇలాంటి పనికి మాలిన వివరణలూ? సరే, ఆ విషయం అలా ఉండనివ్వండి. "బిజెపి- ఆవు-రాముడు-మధుర-కాశీ-కబ్రస్థాన్-పాకిస్థాన్-శ్మశాన్-తాలిబన్‌ల మీద ఆధారపడి ఇంకా ఎంతకాలం ఎలక్షన్లు గెలుస్తుందీ? అసలు ఎప్పటికైనా తమ స్వంత బలం మీద గెలుస్తుందా?"- అని ప్రశ్నించాడు ప్రసిద్ధ జర్నలిస్ట్ అశోక్ వాంఖడే.

భారత సైన్యంలో మూడు వేల అగ్నివీర్‌లను నియుక్తం చేయడానికి అప్లికేషన్లు ఆహ్వానిస్తే తొమ్మిది లక్షల యాభై అయిదు వేల నిరుద్యోగులు అప్లికేషన్ పెట్టుకున్నారు. దేశం ఎంత ప్రమాదకర స్థితిలో ఉందో ఎంత దయనీయమైన స్థితిలో ఉందో చెప్పుకోవాలంటే మన ముందు ఇలాంటి ఎన్నో సంఘటనలున్నాయి. ఇలాంటి విషయాలేవీ పట్టించుకోకుండా. "మనమంతా కలిసి అమృత్ మహోత్సవంలో పాల్గొందాం!" అని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే బిజెపి ప్రభుత్వ పెద్దలకు, బాధ్యులకు కళ్లు మూసుకుపోయాయా? దేశ పరిస్థితులేవీ కనిపించడం లేదా? అని ఈ దేశ ప్రజలు ఆందోళన పడుతున్నారు.

"జ్ఞానవంతుడు తన శత్రువులను ప్రేమించడమే కాకుండా తన స్నేహితులను ద్వేషించనూ గలడు" అన్నాడు జర్మన్ తత్వవేత్త ఫ్రెడరిక్ నీషే. ఆ మాట అర్థం చేసుకోగలిగే స్థాయి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి లకు ఎక్కడుందీ? ప్రశ్నించిన వారిని జైల్లో తోయడమో లేక చంపేయడమో చేస్తున్న మోడీ ప్రభుత్వానికి అంతకన్నా లేదు. పదేళ్లుగా చూస్తూనే ఉన్నాం కదా? "మనిషి అత్యంత క్రూర జంతువు' - అని కూడా అన్నాడు మరో సందర్భంలో ఫ్రెడరిక్ నీషే. గుజరాత్, మణిపూర్ మారణకాండలు జరిపించిన మోడీ-షాల గురించే చెప్పాడా నీషే? కాదు. ఆయనెప్పుడో ఒక యూనివర్సల్ ట్రూత్ చెప్పాడు. ఇక్కడ మన దేశ నాయకులు దాన్ని నిజం చేసి చూపారు. ఇటీవల ఒక లోక్‌సభ ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ దేశ ప్రధాని ఇలా అన్నారు. "కాంగ్రెస్ గనక అధికారంలోకి వస్తే అయోధ్య రామాలయంపైకి బుల్డోజర్లు పంపి కూలగొడతా-అని! గతంలో ఆలయాలను కూల్చిన రికార్డు ఆ పార్టీకి లేదు. కానీ, ఉత్తరప్రదేశ్‌లో పేద ముస్లింల ఇళ్ల పైకి బుల్డోజర్లు పంపిన గొప్ప సంప్రదాయం బిజెపి-యోగి ప్రభుత్వానికి ఉందని ఈ దేశ ప్రజలకు తెలియదా? ప్రజల చెవుల్లో బిజెపి వారు కమలం పూలు ఏనాటికీ పెట్టలేరు. వాళ్లు పెడతామన్నా ప్రజలు పెట్టించుకోరు. ముస్లిం మహిళలు చేపట్టిన షహీన్‌బాగ్ ఉద్యమం తక్కువదా? ఒక్కసారి గుర్తు చేసుకోండి! వంట చేసి టిఫిన్ బాక్సులు పెట్టి పిల్లల్ని స్కూలుకు పంపే మహిళలు, భర్తల్ని ఆఫీసులకు పంపే మహిళలు, రాజకీయాలు అంతగా తెలియని మహిళలు రోడ్డెక్కి షహీన్‌బాగ్‌లై విస్తరించారు. నిరసన గళాల్ని బలంగా వినిపించారు. నియంతలమని అనుకున్న వాళ్లంతా ఊడిపోయే 'ఖాకీ నిక్కర్లు' పట్టుకుని పరుగులు తీశారుకదా?

అది అలా ఉండనిచ్చి, రైతుల నల్ల చట్టాల్ని ఈ దేశంలో రైతులు ఎలా తిప్పికొట్టారో చూశాం. వృద్ధులు, యువకులు పొలం పనులు మానుకుని, నిద్రాహారాలు మానుకుని నిరసన నినాదాలు చేస్తే-అవి ఢిల్లీ దాకానే కాదు. ప్రపంచ దేశాలన్నిటికీ వినిపించాయి. బిజెపి ప్రభుత్వం తోక ముడిచి నల్లచట్టాల్ని వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. దేశానికి తిండి పెట్టే రైతుల మీద మోడీ ప్రభుత్వం బుల్లెట్లు కురిపిస్తుందా? వారి దారిలో మేకులు కొట్టిస్తుందా? ఏడు వందల మంది రైతుల ప్రాణాలు తీసిన మోడీ ప్రభుత్వాన్ని ఈ దేశ ప్రజలు ఇప్పుడే కాదు, ఇక ఎప్పటికీ క్షమించరు. గుజరాత్, మణిపూర్ మారణకాండలు జరిపించిన మోడీ-షాలు తమ గొయ్యి తామే తవ్వుకున్నారు. మనుషులుగా కూడా మిగిలి లేరు. అయినా, జడ్జిని చంపించిన వాడిని దేశ హోంమంత్రిగా చేసుకోవడమా? ఎంత అమానవీయం? ఎంత అమానుషం? రచయితల్ని, ఆలోచనాపరుల్ని, ప్రతిపక్ష నాయకుల్ని చంపించి, లేదా జైళ్లలోకి తోయించి రాజ్యమేలుతామనుకుంటే ఎలా? ప్రశ్నను ఎవడూ అణిచివేయలేడని తెలుసుకోలేని బుద్ధిహీనులు అహంకారంతో ప్రవర్తిస్తే ఏమవుతుందీ? ఆలస్యం అవుతుందేమోగానీ, చివరికి మట్టి కరవాల్సిందే. తప్పదు!

(వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త - మెల్బోర్న్ నుంచి)

సందర్భం



యాభై ఏళ్ల హక్కుల పోరాటం

ప్రపంచంలోకెల్లా అతి పెద్ద కార్మిక సమ్మెలలో ఒకటైన అఖిల భారత రైల్వే సమ్మె మే 8న స్వర్ణోత్సవం జరుపుకున్నది. ఆ సమ్మెలో దాదాపు 20 లక్షల మంది ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. ఆ సందర్భంలో దేశానికి జీవనాడి అయిన రైలు పట్టాలు 20 రోజుల పాటు నిశ్చలంగా ఉన్నాయి. 1974 మే 8 నుంచి 28 వరకు జరిగిన సమ్మె...పోరాట చరిత్రలో వర్గ చైతన్యానికి కొత్త పుటలను లిఖించింది. 15 లక్షల మంది ఉద్యోగులు, 5 లక్షల మంది క్యాజువల్ కార్మికులు చేసిన సమ్మె ప్రపంచం దృష్టిని ఆకర్షించింది.



ఆర్.జి. పిళ్లై

బ్రిటీష్ పాలనలో రైల్వే ఉద్యోగులు నిరంతరం దోపిడీకి గురయ్యారు. దానికి వ్యతిరేకంగా సాగిన ఉజ్వల పోరాటాలు కూడా సామ్రాజ్యవాద వ్యతిరేకమైనవే. దుర్మార్గపు బ్రిటీష్ సామ్రాజ్యవాదం ఎప్పుడూ వీటిని అణచివేయడానికే ప్రయత్నించింది. 1946లో జరిగిన 31 రోజుల సుదీర్ఘ సమ్మెను అణిచివేసేందుకు శతవిధాలా ప్రయత్నించింది. విత్తిరాపల్లి లోని గోల్డెన్ రాక్ రైల్వే వర్క్‌షాప్ దగ్గర సమ్మె చేస్తున్న కార్మికులపై పోలీసులు జరిపిన కాల్పులలో ఐదుగురు మరణించారు. మొదటి వేతన సంఘం సిఫారసులకు వ్యతిరేకంగా 1948లో దక్షిణ భారత రైల్వే లేబర్స్ యూనియన్ సమ్మెకు దిగింది. 1960, 1968, 1973 సంవత్సరాలలో కూడా సమ్మెలు జరిగాయి.

వలస రాజ్యాల వేతన విధానం ఏమాత్రం మారలేదు. మొదటి, ద్వితీయ, తృతీయ వేతన కమిషన్ల వల్ల ఉద్యోగులకు న్యాయం జరగలేదు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, యుద్ధ కాల పరిస్థితుల కారణంగా ఉపాధి హక్కుల తిరస్కరణ...వీటికి తోడు దేశంలో తీవ్రమైన అసమానతలు...కార్మికులలో అసంతృప్తికి ఆజ్యం పోశాయి. పైగా పని గంటలు అనిశ్చితంగా వుండేవి. ఇంతలో సిఐటియు ఏర్పాటు కార్మిక ఐక్యతను బలపరిచింది. దేశంలో ఆందోళన వాతావరణం నెలకొంది. సిఐటియు మద్దతుతో సదరన్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ (డి.ఆర్.ఇ.యు) కార్మికుల సంక్షేమం కోసం చర్యలు చేపట్టింది. 1973 ఆగస్టులో ఆహార కొరత కారణంగా రైల్వే కార్మికులు మూడు రోజుల పాటు సమ్మెకు దిగారు.

బ్రిటీష్ పాలనలో రైల్వే ఉద్యోగులు నిరంతరం దోపిడీకి గురయ్యారు. దానికి వ్యతిరేకంగా సాగిన ఉజ్వల పోరాటాలు కూడా సామ్రాజ్యవాద వ్యతిరేకమైనవే. దుర్మార్గపు బ్రిటీష్ సామ్రాజ్యవాదం ఎప్పుడూ వీటిని అణచివేయడానికే ప్రయత్నించింది. 1946లో జరిగిన 31 రోజుల సుదీర్ఘ సమ్మెను అణిచివేసేందుకు శతవిధాలా ప్రయత్నించింది. విత్తిరాపల్లి లోని గోల్డెన్ రాక్ రైల్వే వర్క్‌షాప్ దగ్గర సమ్మె చేస్తున్న కార్మికులపై పోలీసులు జరిపిన కాల్పులలో ఐదుగురు మరణించారు. మొదటి వేతన సంఘం సిఫారసులకు వ్యతిరేకంగా 1948లో దక్షిణ భారత రైల్వే లేబర్స్ యూనియన్ సమ్మెకు దిగింది. 1960, 1968, 1973 సంవత్సరాలలో కూడా సమ్మెలు జరిగాయి.

సిఐటియు మద్దతుతో 'ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్' (ఎ.ఐ.ఆర్.ఎఫ్) అధ్యక్షుడిగా జార్జ్ ఫెర్నాండెజ్‌ను ఎన్నుకున్నారు. తదనంతరం, 1974 ఫిబ్రవరి 27న ఢిల్లీలో దాదాపు నూట ముప్పై రైల్వే కార్మిక, ఉద్యోగ సంఘాల సమావేశం జరిగింది. సమ్మె కమిటీ (రైల్వే మెన్స్ స్ట్రగుల్ నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ-ఎన్.సి.సి.ఆర్.ఎస్) ఏర్పాటు చేయబడింది. ఆ తర్వాత కార్మికుల హక్కుల కోసం 1974 మే 8 నుంచి సమ్మె చేయాలని నిర్ణయించారు. ఒకవైపు సమ్మె కమిటీతో రెండవ దశ చర్చలు జరగాల్సి వుంది. ఇంతలో జార్జ్ ఫెర్నాండెజ్‌తో సహా సమ్మె కమిటీ నాయకులను, కార్యకర్తలను, సమ్మెకు మద్దతిచ్చిన వారిని 'మీసా' కింద మే 2వ తేదీ ఉదయం, అరెస్టు చేయడం ద్వారా ఇందిరా గాంధీ ప్రభుత్వం దాడిని ప్రారంభించింది. సమ్మె చేస్తున్న వారిపైనే కాదు. వారి కుటుంబాలపై కూడా హింస జరిగింది. ఈ పోరాటంలో దేశవ్యాప్తంగా ఎంతో మంది అమరులయ్యారు. మదురై సిఐటియు కార్యకర్త ఒకరు రైలును ఆపే ప్రయత్నంలో మృతి చెందాడు. సమ్మెకు మద్దతుగా ఎర్నాకులం జంక్షన్ స్టేషన్‌లో ఎ.కె. గోపాలన్, సుశీలా గోపాలన్, ఎం.ఎం.లారెన్స్, కె.ఎన్.రవీంద్రనాథ్ తదితరుల ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. నాయకుల మూకుమ్మడి అరెస్టులు, ఆర్థిక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని మే 28న సమ్మె విరమించాలని నిర్ణయించారు. సమ్మె తర్వాత పదోన్నతి లేకుండానే ఉద్యోగ విరమణ చేయాల్సిన వారికి (స్టేషన్ మాస్టర్ సహా) మూడు పదోన్నతులు లభించాయి. బోనస్ అందింది. క్యాజువల్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారు. వేతన విధానంలో గణనీయమైన మార్పు వచ్చింది. కుటుంబ, డిపెండెంట్ పెన్షన్ అందింది. రైల్వే ఉద్యోగులకు ఇప్పుడు అందుబాటులో ఉన్న అనేక అద్భుతమైన ప్రయోజనాలు 1974 సమ్మె తర్వాత అమలులోకి వచ్చినవే.

నేడు నాలుగున్నర లక్షల ఖాళీలను భర్తీ చేయకుండా, పర్మినెంట్ ఉద్యోగాల ఊసెత్తకుండా, అప్రెంటిస్, కాంట్రాక్టు నియామకాలను ఉధృతం చేస్తూ...దేశంలోకెల్లా అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన రైల్వేను సర్వనాశనం చేసే దిశగా మోడీ నాయకత్వం లోని బిజెపి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 1974 రైల్వే సమ్మె స్ఫూర్తితో ఇటువంటి చర్యలకు వ్యతిరేకంగా పోరాటాన్ని బలోపేతం చేయాలి.

(వ్యాసకర్త సదరన్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు)

/ 'దేశాభిమాని' సౌజన్యంతో /

జనవాక్యం

కౌలు రైతులను ఆదుకోరే?

రాష్ట్రంలో వ్యవసాయం చేసేవారిలో 70 శాతం పైగా కౌలు రైతులే ఉన్నారు. వీరు రుణాలు పొందడానికి సాగు హక్కు పత్రం అర్హత కల్పిస్తుంది. అయితే ఇది పేరుకు మాత్రమే. వాస్తవ భూహక్కు ఉన్న రైతులు ఎవరూ దీనిని ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. ఈ చట్టం వచ్చి మూడేళ్లు అవుతున్నా ఫలితం లేకుండా పోయింది. నోటి మాటతో పొలం తీసుకుని పంట సాగుచేయడం. అనుకున్న విధంగా ముందుగానే యజమానులకు కొందరు ఏక మొత్తంగా మరి కొందరు రెండు దఫాలుగా సొమ్ము చెల్లించడం రివాజుగా వస్తోంది. దీంతో క్షేత్ర స్థాయిలో ఈ పథకం కౌలు రైతులను ఆదుకోలేక పోయింది. పాలకులు సైతం దీనిపై దృష్టి సారించక పోవడంతో ప్రకటనలకే పరిమితమైంది. వేరే దారి లేక కౌలు రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నారు. పంట రుణాల జారీకి ఈ-క్రాప్ నమోదు సైతం అడ్డంకిగా మారింది. సొంత భూములున్న వారికే పాసు పుస్తకాల ఆధారంగా ఈ-క్రాప్ పత్రాలు అందుతాయి. కౌలు రైతులకు పత్రాలు లేకపోవడంతో బ్యాంకు రుణాలు పొందలేక పోతున్నారు. మరోవైపు సిసిఆర్‌సి కార్డుల జారీలో పొలం సొంత రైతుల సంతకాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. భూమిని కౌలుకు ఇచ్చినా యజమాని ఆ పొలంపై బ్యాంకు రుణాలు తీసుకోవడం మరో సమస్యగా మారింది. జాయింట్ లయబిల్టీ గ్రూపులుగా (జె.ఎల్) కౌలు రైతులను ఏర్పాటు చేయాలి. ఇది కూడా దస్త్రాలకే పరిమితమైనది. విత్తనాలు, ఎరువులు వంటివి రాయితీపై దక్కడం లేదు. కౌలు రైతులు గతంలో తీసుకున్న పాత అప్పులు (రుణాలు) సకాలంలో తీర్చక పోవడం వల్ల బ్యాంకులు ముఖం చాటేస్తున్నాయి. సాగు హక్కు పత్రం కావాలంటే భూముల వాస్తవ రైతులు సంతకాలు పెట్టాలి. ప్రభుత్వమే దీంట్లో మార్పులు తీసుకొస్తే కౌలు రైతులకు ఆర్థిక సహకారం అందే అవకాశం ఉంది.

- గొనప అప్పన్న, విశాఖపట్నం.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

పాలస్తీనాకు మరో మూడు దేశాల గుర్తింపు

అనేక తర్జన భర్జనల తరువాత 2024 మే28 లోగా పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని స్పెయిన్, ఐర్లండ్, నార్వే నిర్ణయించాయి. నిజానికి 2014 నవంబరు 17న...పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించేందుకు ప్రభుత్వానికి అధికారమిస్తూ స్పెయిన్ పార్లమెంటు తీర్మానించింది. ప్రధాన స్రవంతికి దూరంగా లేదా వ్యతిరేక శిబిరంలో ఉండి ఇంతకాలంగా విమర్శల పాలైన ఈ దేశాలు ఇప్పటికైనా ఈ సముచిత నిర్ణయం తీసుకోవటాన్ని స్వాగతించాల్సిందే. అయితే దీని వలన కొత్తగా పాలస్తీనా అరబ్బులకు ఒరిగేదేంటన్న వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. ఇప్పటికే 139 దేశాలు గుర్తించాయి. ఐరాసలో పాలస్తీనాకు ఇప్పుడున్న పరిశీలక హోదా స్థాయికి బదులు పూర్తిస్థాయి దేశంగా గుర్తించాలనే బాటలో మరొక అడుగు వేసే తీర్మానంపై తాజాగా 143 దేశాలు మద్దతుగా ఓటు వేశాయి. పరిశీలక హోదాకు పరిమితం కాకుండా కొత్త హక్కులు, చర్చల్లో అన్ని అంశాలపై మాట్లాడే సభా హక్కులు ఇవ్వాలన్నదే దాని సారం. మరో విధంగా చెప్పాలంటే పూర్తి స్థాయి సభ్యత్వ హోదాను ఆమోదించటమే. భద్రతా మండలిలో తీర్మానం పెడితే నరుకుతా అంటూ వీటో కత్తితో వీరంగం వేస్తున్న అమెరికా ఉన్నంతవరకు ఇలాంటి ఎన్ని తీర్మానాలు చేసినా ప్రయోజనం ఉండదు. మరి మూడు దేశాల గుర్తింపుతో ఎలాంటి ప్రభావం ఉండదా అంటే తప్పకుండా ఉంటుంది. పాలస్తీనాను వ్యతిరేకిస్తున్న శక్తులపై ఒత్తిడి పెరుగుతుంది. వాటి ప్రజాస్వామ్య, మానవత్వ ముసుగులు మరికొంత చిరిగి వాస్తవ రూపాలు మరింతగా కనిపిస్తాయి. పాలకులలో స్పందన లేకున్నా పౌరుల్లో చురుకు పుట్టిస్తాయి. అమెరికా, ఐరోపా దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో ఉద్యమిస్తున్న విద్యార్థులకు ఊపునిస్తాయి. దూరంగా ఉన్నవారికి మనమెందుకు స్పందించటం లేదనే ఆలోచన కలిగిస్తాయి.



మూడు దేశాల గుర్తింపుతో ఎలాంటి ప్రభావం ఉండదా అంటే తప్పకుండా ఉంటుంది. పాలస్తీనాను వ్యతిరేకిస్తున్న శక్తులపై ఒత్తిడి పెరుగుతుంది. వాటి ప్రజాస్వామ్య, మానవత్వ ముసుగులు మరికొంత చిరిగి వాస్తవ రూపాలు మరింతగా కనిపిస్తాయి. పాలకులలో స్పందన లేకున్నా పౌరుల్లో చురుకు పుట్టిస్తాయి.

ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, రక్షణ మంత్రి గాలాంట్‌కు సమన్లు జారీ చేయాలని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ప్రాసిక్యూటర్ కోరటం ఇజ్రాయిల్‌కు దిగ్భ్రాంతి కలిగించింది. దీనికి తోడు మూడు దేశాల ప్రకటనతో ఇజ్రాయిల్‌కు ఆగ్రహం కలిగింది. ఉక్రోషంతో ఆ దేశాల నుంచి రాయబారులు వెనక్కు రావాలని ఆదేశించింది. ఉగ్రవాదానికి ఇచ్చిన బహుమతి అంటూ చిందులేసింది. స్వతంత్ర పాలస్తీనాను రెండుగా విభజించి ఇజ్రాయిల్ ఏర్పాటుకు ఐరాస తీర్మానించిన సంగతి తెలిసిందే. తరువాత అడ్డం తిరిగిన పశ్చిమ దేశాలు పాలస్తీనాను గుర్తించేందుకు అంగీకరిస్తూనే ఆచరణ సాధ్యంగాని షరతులను ముందుకు తెస్తూ అడ్డు పడుతున్నాయి. రెండు పక్షాల మధ్య నేరుగా సంప్రదింపులు జరిగిన తరువాతే తప్ప ఏకపక్షంగా గుర్తింపు ఇవ్వకూడదన్న తన అప్రజాస్వామిక వైఖరిని మరోసారి మూడు దేశాల ప్రకటన తరువాత అమెరికా ప్రదర్శించింది. గాజాలో హమాస్ ఉన్నంత వరకు పాలస్తీనా దేశాన్ని తాము గుర్తించబోమని బ్రిటన్ విదేశాంగ మంత్రి కామెరాన్ సెలవిచ్చాడు. హమాస్ నిన్నగాక మొన్న ఉనికి లోకి వచ్చింది, అంతకు ముందు ఎందుకు గుర్తించలేదన్న ప్రశ్నకు సమాధానం ఏమిటి? మేకపిల్లను తినదలచుకున్న తోడేలు చెప్పిన కుంటి సాకు కథ తప్ప మరొకటి కాదు. తనకు కేటాయించిన ప్రాంతాలకు పరిమితం గాకుండా తమ రక్షణకు హామీగా ఉండాలంటూ అడ్డగోలు వాదనలతో పాలస్తీనా ప్రాంతాలను ఆక్రమించుకోవటమే కాదు. జనాభా స్థితిగతులను మార్చివేసేందుకు ఆ ప్రాంతాలలో యూదుల నివాసాలను ఏర్పాటు చేసి, అరబ్బులను మైనారిటీగా మార్చి...వాటిని చూపి అవి కూడా తమవే అంటున్న ఇజ్రాయిల్‌తో పాలస్తీనా విముక్తిని కోరుకుంటున్న వారికి ఏకీభావం ఎలా ఉంటుంది.

మూడు దేశాల చర్యతో ఐరోపాలో మరికొన్ని దేశాలు అదే బాట పట్టవచ్చనే చర్చ జరుగుతోంది. తాము కూడా పరిశీలిస్తున్నట్లు మాల్టా, స్లోవేనియా మార్చి నెలలో ప్రకటించాయి. ఐరోపా స్పందన ఎంతో బలహీనంగా ఉన్నందున మిగతా దేశాలతో నిమిత్తం లేకుండా ఏకపక్షంగా గుర్తింపు ఇచ్చేందుకు ముందుకు పోవాల్సిన పరిస్థితిలో ఉన్నామని ఈ రెండు దేశాల ప్రధానులతో మాడ్రిడ్‌లో జరిపిన చర్చల తరువాత స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్ ప్రకటించాడు. తాము కూడా వీటితో జత కడతామని బెల్జియం, పోర్చుగల్ దేశాలు సంకేతాలు పంపినప్పటికీ అడుగు ముందుకు పడలేదు. ఇన్ని దేశాలు తమ వైఖరిని స్పష్టంగా వెల్లడించినా ఇజ్రాయిల్ దాని దారుణాలకు మద్దతు ఇస్తున్న, పాలస్తీనా స్వతంత్ర దేశ ఏర్పాటుకు మోకాలడ్డుతున్న అమెరికా మరికొన్ని దేశాల వైఖరిలో రాని మార్పు ఇప్పుడు వస్తుందని భావించనవసరం లేదు. వీటో కత్తిని ఝుళిపిస్తున్న అమెరికా ఉన్నంత వరకు దానికి తోడుగా ఇజ్రాయిల్ మినహా... పాలస్తీనాను ప్రపంచ దేశాలన్నీ గుర్తించినా ఆచరణలో తక్షణ ప్రయోజనం కనిపించదు.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

ఇల్లు కట్టేదెలా..!

- భారంగా నిర్మాణ సామగ్రి ధరలు
- రెండు గదులు, హాలుతో ఇంటి నిర్మాణానికి రూ.20 లక్షలుపైనే
- హడలిపోతున్న సామాన్య ప్రజానీకం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సామాన్య ప్రజానీకానికి సొంతింటి కల అందని ద్రాక్షగా మారింది. పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలతో సామాన్యులు ఇల్లు కట్టాలంటేనే హడలిపోయే పరిస్థితి నెలకొంది. నలుగురు సభ్యులు ఉన్న కుటుంబం రెండు పడక గదులు, హాలు, వంటగది ఉన్న ఇంటి నిర్మాణం చేయాలంటే రూ.20 లక్షలుపైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఇంటి నిర్మాణంవైపు ఆలోచించాలంటేనే సామాన్య ప్రజానీకం వణికిపోతున్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సాయానికి, అయ్యే ఖర్చుకు పొంతన లేకపోవడంతో ఇంటి నిర్మాణంవైపు సామాన్యులు ఆలోచించడం వదులుకుంటున్నారు. అత్యధికం మంది సొంతిల్లు నిర్మాణాలను వేసవిలో ఎక్కువ చేపడతారు. వాతావరణం అనుకూలంగా ఉంటుందని ఆలోచన చేస్తారు. ప్రస్తుత వేసవిలో కొత్త ఇంటి నిర్మాణాలు పెద్దగా సాగడం లేదని తాపీపనివారు చెబుతున్నారు. అందుకు ప్రధాన కారణం ఒక్కటే. సామాన్యులు భరించలేని స్థితికి నిర్మాణ వ్యయం పెరిగింది. ప్రభుత్వం జిల్లాలో లక్షకుపైగా ఇంటిస్థలాలు ఇచ్చినప్పటికీ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసేందుకు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం నిర్మాణ వ్యయమే. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు పడక గదులు, హాల్, వంటగది తరహా ఇంటి నిర్మాణం చేయాలని సామాన్య ప్రజానీకం ఆలోచిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో టన్ను ఐరన్ ధర రూ.66 వేలు పలుకుతోంది. ఇసుక ఐదు యూనిట్లు లారీ ధర రూ.17,500 ఉంది. వెయ్యి ఇటుక ధర రూ.30 వేలు, సిమెంట్ బస్తా ధర రూ.325కు చేరింది. ఇల్లు నిర్మించడానికి తాపీపని వారి ఖర్చు రూ.ఆరు లక్షల వరకూ అవుతోంది. ఇవికాకుండా గుమ్మాలు, కిటికీలు, విద్యుత్ సామాన్లు, ఇతర ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. దీంతో ఇల్లు కట్టాలంటే వెనుకాడే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఇళ్ల నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.రెండు లక్షలు మాత్రమే సాయం చేస్తోంది. ఈ సొమ్ము విడుదలకు కూడా సవాలక్ష ఆంక్షలు పెడుతోంది. ప్రభుత్వం ఇచ్చే సాయం ఏమాత్రం పెంచడం లేదు. దీంతో ఇంటి నిర్మాణానికి దిగితే అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో కష్టపడి కట్టిన ఇంటిని అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇంటి నిర్మాణానికి బ్యాంకులు హౌసింగ్ లోన్లు ఇస్తున్నాయి. అయితే ప్రొసెసింగ్ ఫీజుల రూపంలో రూ.25 వేలకుపైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. వ్యవసాయ పనులు చేసుకునే సామాన్య ప్రజానీకం ప్రతినెలా బ్యాంకులకు ఇఎంఐలు కట్టడం కష్టతరమైన పని కావడంతో సామాన్యుల భయపడుతున్నారు. భూముల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు సెంటు భూమీ కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు సొంతిల్లు సైతం కట్టుకోలేని పరిస్థితి నెలకొంది. సామాన్య ప్రజానీకం రూ.20 లక్షలు ఖర్చుపెట్టి ఇంటి నిర్మాణం చేయడం ఏమాత్రం సాధ్యంకాని పరిస్థితిగా మారిపోయింది. దీంతో చాలామంది ఇప్పటికే ఉన్న చిన్నపాటి ఇంటిలోనే కాలం గడుపుతుండగా, అద్దె ఇంట్లో ఉండేవాళ్లు అదేరీతిలో ఉండిపోతున్నారు. పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం సాయం పెంచాల్సి ఉంది. లేకపోతే సామాన్యుల బతుకులు 'ఎక్కడవేసిన గొంగళి అక్కడే' అన్నట్లు ఉండిపోనున్నాయి.

క్యాట్ తీర్పుపై ముగిసిన వాదనలు

- తీర్పు వాయిదా వేసిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

నిఘా పరికరాల కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడ్డారంటూ సస్పెన్షన్‌కు గురైన సీనియర్ ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావును తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌పై వాదనలు పూర్తయ్యాయి. తీర్పును తర్వాత వెలువరిస్తామని జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయితో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ప్రకటించింది. క్యాట్ ఉత్తర్వులను రద్దు చేయాలని రాష్ట్రం తరపున ఎజి ఎస్ శ్రీరామ్ వాదించారు. అక్రమాలపై దర్యాప్తు పూర్తయ్యే వరకు, కోర్టులో విచారణ ముగిసేంత వరకు అవినీతి ఆరోపణలు ఎదుర్కొనే ఎబిపై సస్పెన్షన్ కొనగించాలన్నారు. వెంకటేశ్వరరావు తరపున సీనియర్ న్యాయవాది బి ఆదినారాయణరావు వాదిస్తూ, ఒకే అభియోగంపై రెండు సార్లు సస్పెండ్ చేయడాన్ని క్యాట్ తప్పుపట్టిందని, ఆ తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది.

నేటి నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

ఖరీఫ్‌కు సంబంధించి సబ్సిడీ వేరుశనగ కాయలు కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు శుక్రవారం నుంచి స్థానిక రైతు భరోసా కేంద్రాలు ద్వారా విత్తనకాయలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అనంతపురం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ గురువారం తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విత్తన వేరుశనగ కోసం 47,704 మంది రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. అన్ని ఆర్‌బికె కేంద్రాల్లో వేరుశనగ కాయలు నిల్వ ఉంచామన్నారు. శుక్రవారం నుంచి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలియజేశారు.

అనంతలో చీనీచెట్లు నరికివేత

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు వెంకటలక్ష్మమ్మకు చెందిన 189 చీనీ మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి నరికివేశారు. 18 నెలల వయస్సున్న మొక్కలను నరికివేశారు. ఇదే రైతుకు చెందిన మామిడి మొక్కలను గతంలో కూడా నరికివేశారు. అప్పట్లో దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా నిందితులు ఎవరనేది బయట పడలేదు. ఇదే గ్రామానికి చెందిన బాలవర్ధిరాజుకు చెందిన 300 చీనీ చెట్లు, భాస్కర్‌కు చెందిన 150 చీనీచెట్లను గతంలో గుర్తు తెలియని వ్యక్తులు నరికేశారు. చెట్లు నరికివేసిన విషయం తెలుసుకున్న ఎస్ఐ శరత్‌చంద్ర ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత మహిళా రైతుతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ తెలియజేశారు.

పోలీసుల తీరుపై విమర్శలు

రెడ్డిపల్లి గ్రామంలో తరచూ పండ్ల తోటలను నరికివేస్తున్నా పోలీసులు స్పందించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వరుస ఘటనలు చోటు చేసుకున్నా పోలీసులు నిందితులను గుర్తించడంలో విఫలం అయ్యారు. ఈ నేపథ్యంలో ఒకదాని తర్వాత మరొక ఘటన చోటు చేసుకుంటూనే ఉంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితులను గుర్తించి చట్టప్రకారం వారిని కఠినంగా శిక్షించాలని రెడ్డిపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. మహిళా రైతుకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు రాజారాంరెడ్డి కోరారు. జిల్లా ఎస్‌పి ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను శిక్షించాలని కోరారు.

హిమాచల్, తెలంగాణా ఎన్నికలపై జోస్యం చెప్పి

బోల్తా పడ్డ కిషోర్

- కరణ్ థాపర్‌కిచ్చిన ఇంటర్వ్యూలో పరస్పర విరుద్ధ ప్రకటనలు

న్యూఢిల్లీ ఎన్నికల నిపుణుడిగా పేరొందిన ప్రశాంత్ కిషోర్ ఆన్‌లైన్ పోర్టల్ ది వైర్‌కు చెందిన జర్నలిస్టు కరణ్ థాపర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేశారు. ఒక దశలో అసహనంతో రుసరుసలాడారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ముందు ప్రశాంత్ కిషోర్ జోస్యం చెబుతూ బిజెపికి 300 సీట్లకు పైగా వస్తాయని చెప్పారు. కరణ్ థాపర్‌కిచ్చిన ఇంటర్వ్యూలో 2019తో పోల్చితే మోడీపై సామాన్యులకు ఉన్న ఆసక్తి చాలా వరకు పోయింది. మోడీ పట్ల గుడ్డి భక్తి కూడా తగ్గింది. గత అయిదేళ్లలో సోషల్ మీడియాలో మోడీ వీడియోల వీక్షకుల సంఖ్య కూడా గణనీయంగా పడిపోయిందని కిషోర్ చెప్పారు. గతంలో 50 లక్షలకు చేరువలో వ్యూస్ రాగా ఇప్పుడు 10-20 లక్షలకు తగ్గాయి. మొత్తం మీద బిజెపి మోడీల పాపులారిటీ కాస్తా తగ్గింది. 2019లో బాలాకోట్, పుల్వామా ఘటనల తరువాత తీవ్ర జాతీయవాద భావాల ఆధారంగా లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో బిజెపి 303 సీట్లు సాధించింది. చాలా మంది ప్రజలు మోడీ పట్ల చాలా భ్రమలు పెట్టుకున్నారు. అయితే, ఈ కాలంలో ఆ భ్రమలు తొలగిపోయాయన్నారు.అయినా, గతసారి వచ్చిన సీట్లను బిజెపి ఎలా నిలుపుకుంటుందని చెప్పడం ఆయనలోని అయోమయాన్ని సూచిస్తోంది. 2022 మేలో జరిగిన హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతుందని అంచనా వేశారు. కానీ, దానికి విరుద్ధంగా కాంగ్రెస్ అక్కడ విజయం సాధించింది. తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల్లోనను ప్రశాంత్ కిషోర్ లెక్కలు తప్పాయి. థాపర్ హిమాచల్ ఎన్నికల్లో మీ అంచనాలు తప్పు అని తేలాయి కదా అని అడిగినప్పుడు కిషోర్ ఫైర్ అయ్యారు. అలాంటి ప్రకటన చేయలేదని అన్నారు. ఎందుకంటే ఆ ప్రకటనకు సంబంధించిన వీడియో ఏదీ రికార్డు కాలేదు గనుక.వార్తా పత్రికలు, పోర్టల్‌లు ఇష్టానుసారంగా ప్రకటనలను వక్రీకరించగలవు. కాబట్టి అవి సాక్ష్యాలుగా సరిపోవు అని కిషోర్ అన్నారు. కాంగ్రెస్‌కు వంద సీట్లు రావు అని అంటూనే దానికి వందకు పైగా సీట్లు వస్తే బిజెపికి 300 సీట్లు వస్తాయని అన్నారు. జూన్ 4 తరువాత మీకు ఆశ్చర్యం కలిగించే ఫలితాలు వస్తాయని చివరిలో కిషోర్ ముక్తాయింపు ఇచ్చారు.

నేటి నుంచి ఏనుగుల గణన

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్



ఈనెల 25వ తేదీ శుక్రవారం నుండీ దక్షిణ భారతదేశ వ్యాప్తంగా ఏనుగుల గణన చేపట్టనున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ గణన జిల్లాలో మూడు రోజుపాటు జరుగుతుందని గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం జిల్లాలో వంద ఏనుగులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ ఏడాది ప్రమాద బారిన 6 ఏనుగులు చనిపోయిన్నట్లు తెలిపారు. ప్రస్తుత సర్వేలో జిల్లాలో ఎనుగుల సంఖ్య ఖచ్చితంగా తెలిసే అవకాశముందన్నారు. ఈ సర్వే సౌత్ ఇండియాలో ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళలో చేపడుతున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంత సరహద్దు గ్రామాల్లో ప్రజలు సర్వేకు సహకరించాలని సర్వే సందర్భంగా ఎనుగులకు ఇబ్బంది కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు.

ఏజెన్సీలో మలేరియా విజృంభణ

- పెరుగుతున్న జ్వర పీడితులు
- రోగులతో కిటకిటలాడిన ఏరియా ఆస్పత్రి


రోగులతో కిటకిటలాడుతున్న ఏరియా ఆస్పత్రి

ప్రజాశక్తి-సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

ఏజెన్సీలో వైరల్ జ్వరాలు, మలేరియా కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. గత వారం రోజులుగా రోగులతో సీతంపేట ఏరియా ఆస్పత్రి కిటకిటలాడుతోంది. ఎపిడమిక్ సీజన్ మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరగడం, దాంతోపాటు కొద్దిపాటి వర్షాలు కురవడం, దోమలు పెరగడం, కలుషిత జలాలు తాగడం వల్ల వైరల్ జ్వరాలు, మలేరియా బారిన పడుతున్నారు. దోమతెరలు పంపిణీ చేసినా, మలాథియన్ స్ప్రేయింగ్ చేసినా ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదు.

ఏజెన్సీలో మలేరియా, వైరల్ జ్వరాలు చాప కింద నీరులా ప్రబలుతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏరియా ఆస్పత్రిలో రోజుకు ఈ సీజన్లో 300 వరకు ఒపి పెరిగింది. వీటిలో సుమారు 15 మంది వరకు వైరల్, 5 వరకు మలేరియా కేసులు నమోదవుతున్నాయి. సీతంపేట మండలం గడ్డికారెం గ్రామానికి చెందిన ప్రణీత్, సంతోషి, నిమ్మక వైష్ణవి, లాడకు చెందిన ఆరిక భాస్కరరావు, మానాపురానికి చెందిన అప్పలమ్మ, బోడయ్య, కొత్తూరుకు చెందిన తిరుపతిరావు, హడ్డుబంగి పనసగూడకు చెందిన సవర తిరుపతిరావుకు మలేరియా పాజిటివ్ నమోదైంది. గత మూడు రోజులుగా ఈ కేసులు నమోదయ్యాయి. వీరికి సీతంపేట ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటికే కొన్ని మలేరియా కేసులను డిశ్చార్జి చేశారు. గతేడాది ఇదే సీజన్లో దోనుబాయి పరిసర ప్రాంతాల్లో అధికంగా మలేరియా కేసులు నమోదయ్యాయి. గత నెలలో మర్రిపాడు, పూతికవలస పరిసర ప్రాంతాల నుంచి మలేరియా కేసులు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ఎండ వేడిమి తట్టుకోలేక, కలుషిత నీరు తాగడంతో వైరల్ జ్వరాలు కూడా విజృంభిస్తున్నాయి. దీంతో ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది.

దీనిపై ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా మలేరియా కేసులు వస్తున్నాయని, వీరికి సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి భానుప్రతాప్ వద్ద ప్రస్తావించగా మలేరియా కేసులు నమోదైన చోట వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందరికీ వైద్య పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 16 నుంచి పిచికారీ చేస్తున్నామని, దోమతెరలు పంపిణీ చేశామని తెలిపారు. వైద్య సిబ్బంది ద్వారా సర్వే కూడా చేపడుతున్నామని వివరించారు. ఇప్పటికే వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశామని సమాధానం ఇచ్చారు.

జ్వరాలపై అప్రమత్తం

ఏజెన్సీలో వ్యాప్తి చెందుతున్న వైరల్ జ్వరాలు, మలేరియా కేసులపై అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఒ విజయపార్వతి వైద్యులను ఆదేశించారు. గురువారం దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి మరణాలూ సంభవించకుండా చూడాలని ఆదేశించారు. జ్వరాలుంటే వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి, పరీక్షలు చేయాలని సూచించారు. సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు భానుప్రతాప్, గిరీషా, హెల్త్ సూపర్వైజర్లు తదితరులు ఉన్నారు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టు రట్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

తమిళనాడు నుంచి వచ్చి విశాఖ కేంద్రంగా పలు ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను గురువారం మధ్యాహ్నం ఎంవిపి.కాలనీ క్రైమ్ పోలీస్ స్టేషన్లో ద్వారకా డివిజన్ క్రైమ్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం వెల్లూరు జిల్లా, పెరియపాలెం గ్రామానికి చెందినా గణేష్ శంకర్, వి.మంజునాథన్తో పాటు మరొక వ్యక్తి విజయనగరంలో ఇల్లు అద్దెకు తీసుకుని ప్రతి రోజు ఉదయం విశాఖపట్నం వచ్చి ఇక్కడ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఎంవిపి కాలనీ సెక్టార్-9కు చెందిన మధుసురి విఎస్ ఫణి కిరణ్ వర్మ ఈ నెల 21న ఉదయం తన ఫ్లాట్లో దొంగతనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలో ప్రత్యేక బృందం ద్వారా పోలీసులు నిఘా పెట్టగా గురువారం ఉదయం వెంకోజీపాలెం వద్ద నిందితుల్లో గణేష్ శంకర్, వి.మంజునాథన్ పట్టుబడ్డారు. వీరితో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఆహార సబ్సిడీ పద్దులో కోతలు

- నామమాత్రపు కేటాయింపులతో సరి
- ఉచిత రేషన్ పంపిణీతో రాజకీయ లబ్ధికి బిజెపి ప్రయత్నం



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పిఎంజికెఎవై) గురించి బిజెపి గొప్పగా ప్రచారం చేసుకుంటుంది. ఈ ఉచిత పంపిణీ వల్ల నిరుపేదలు, పేదలకు ఆర్థికంగా పెద్దగా ఒరుగుతోంది ఏమీ లేదని, అలాగే ప్రభుత్వం పెట్టే మొత్తం బడ్జెటరీ వ్యయంలో ఈ ఆహార సబ్సిడీ పద్దుకు విదిలిస్తోంది ఐదు శాతం కంటే తక్కువగానే ఉందని నిపుణులు చెబుతున్నారు. అంటే ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం నామమాత్రమే.

యూపీఏ హయాంలోనే ప్రారంభం

ఈ పథకం కింద ఉచిత ఆహారధాన్యాలు పొందేందుకు దేశంలోని 80 కోట్ల మంది అర్హులు. ఈ పథకం ప్రధానికి మంచి పేరే తెచ్చి పెట్టింది. అయితే దీని నేపథ్యాన్ని గమనిస్తే...2013లో ప్రజల నుండి వచ్చిన డిమాండ్ మేరకు అప్పటి యుపిఎ ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం దేశంలోని గ్రామీణ జనాభాలో 75శాతం మంది, పట్టణ జనాభాలో 50 శాతం మంది సబ్సిడీ ధరపై ఆహారధాన్యాలు పొందారు. ఇతర ప్రభుత్వ పథకాల మాదిరిగా కాకుండా దీనికి చట్టరూపం కల్పించారు.

ఆహార భద్రతా చట్టం అంటే...

జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అత్యంత నిరుపేద కుటుంబాలకు నెలకు మొత్తం 35 కిలోల ఆహారధాన్యాలు అందించారు. కిలో బియ్యం మూడు రూపాయలు, కిలో గోధుమలు రెండు రూపాయలు, కిలో తృణధాన్యాలు రూపాయికి అందజేశారు. ఇక పేద కుటుంబాలకు సంబంధించి ఒక్కో లబ్దిదారుడికి ఇవే ధరలపై ఐదు కిలోల ఆహారధాన్యాలు అందించారు. మోడీ తొలిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇది కొనసాగింది.

రేషన్ సంచులపై మోడీ బొమ్మ

2020లో కోవిడ్ మహమ్మారి దేశాన్ని అతలాకుతలం చేసినప్పుడు పేదలు పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆహారధాన్యాల పంపిణీ పరిమాణాన్ని రెట్టింపు చేసింది. ఎనిమిది నెలల పాటు వాటిని ఉచితంగా అందజేసింది. గత సంవత్సరం జనవరి 1 నాటికి కోవిడ్‌కు సంబంధించిన అన్ని సహాయక చర్యలను నిలిపివేసినప్పటికీ ఉచిత ఆహారధాన్యాల పంపిణీని మాత్రం కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి 1 నుండి ఐదు సంవత్సరాల పాటు ఇది కొనసాగుతుంది. అయితే నిరుపేదలు, పేదలకు అందజేస్తున్న ఆహారధాన్యాల సంచులపై ప్రధాని మోడీ చిత్రాన్ని ముద్రించారు. దీంతో అందరూ ఇది మోడీ పథకమేమోనని భావించారు. వాస్తవానికి సబ్సిడీ ధరపై ఆహారధాన్యాల పంపిణీ అనేది యూపీఏ పాలనలోనే మొదలైంది. కాకపోతే ఇప్పుడది ఉచిత పంపిణీగా మారింది. అంతే తేడా.

గోరంత ప్రయోజనమే

వాస్తవానికి ఆహారధాన్యాల ఉచిత పంపిణీ పథకం నిరుపేదలు, పేదలకు పెద్దగా ఆర్థిక ప్రయోజనం కలిగించలేదు. అత్యంత నిరుపేద కుటుంబాలు తాము వినియోగించే ఆహారధాన్యాల పరిమాణం ఆధారంగా బియ్యంపై నెలకు రూ.70, గోధుమలపై రూ.105 మాత్రమే ప్రయోజనం పొందాయి. ఈ కొద్దిపాటి వెసులుబాటుతో పేదల కష్టాలు గట్టెక్కుతాయా? రేషన్ సంచులపై మోడీ బొమ్మను ముద్రించినంత మాత్రాన వారంతా బీజేపీకే ఓటేస్తారా? అసలు పీఎంజీకేఏవై ద్వారా ఎంతమంది లబ్ధి పొందారు అనేది పరిశీలిస్తే జాతీయ స్థాయిలో 2023 జూన్ 30 నాటికి 8.95 కోట్ల మంది నిరుపేదలు, 71.15 కోట్ల మంది పేదలు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందారు. అయితే పేదలతో పోలిస్తే నిరుపేదలే ఎక్కువ లబ్ది పొందారు. ఎందుకంటే వారికి పేదల కంటే ఎక్కువ పరిమాణంలో ఉచితంగా ఆహారధాన్యాలు లభించాయి.

రాజకీయ ప్రభావం ఉంటుందా?

దేశంలోని పలు రాష్ట్రాలు అర్హత కలిగిన కుటుంబాలన్నింటికీ దాదాపుగా ఆహారధాన్యాలు అందజేస్తున్నాయి. 2016 నాటికే జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేయడంతో ఇదేమీ ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. అయితే ఆసక్తికరమైన విషయమేమంటే ప్రధాని స్వరాష్ట్రమైన గుజరాత్ మాత్రం లక్ష్యానికి దూరంగానే ఉంది. అసోం, బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మణిపూర్, ఒడిషా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు జనాభాలో 80 శాతం మందిని లబ్దిదారులుగా గుర్తించాయి. ఈ రాష్ట్రాలన్నీ రాజకీయ ప్రాధాన్యత కలిగినవే. లోక్‌సభలోని మొత్తం స్థానాల్లో మూడో వంతు స్థానాలు ఈ రాష్ట్రాల్లోనే ఉన్నాయి. ఆహారధాన్యాల పంపిణీ ఓట్లను రాలిస్తే...లేదా కనీసం కొంతమంది లబ్దిదారులైనా పాలక పక్షానికి ఓటేస్తే...ఈ పథకం చూపే రాజకీయ ప్రభావం గణనీయంగానే ఉంటుంది.

ఆర్థిక భారం తక్కువే

సబ్సిడీపై పంపిణీ నుండి ఉచిత పంపిణీకి నిర్ణయం తీసుకోవడం వల్ల ప్రభుత్వంపై ఎంత భారం పడిందో పరిశీలిద్దాం. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఆహారధాన్యాల సేకరణ, నిల్వ, పంపిణీ ఖర్చును కలిపి ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో 'ఆహార సబ్సిడీ'గా చూపుతోంది. 2014లో మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు జాతీయ ఆహార భద్రతా చట్టం అమలు కోసం ప్రభుత్వం సుమారు 6 శాతం (మొత్తం బడ్జెట్ వ్యయంలో) ఖర్చు చేసింది. ఆ తర్వాత రెండు సంవత్సరాల పాటు ఆహార సబ్సిడీని పెంచింది. 2016 నుండి 2020 వరకూ ఆహార సబ్సిడీపై ప్రభుత్వ వ్యయం తగ్గుతూ వచ్చింది. 2020లో మొత్తం ప్రభుత్వ వ్యయంలో ఆహార సబ్సిడీ కోసం పెట్టిన ఖర్చు కేవలం 4 శాతం మాత్రమే. కోవిడ్ తర్వాత ఈ పద్దు కింద వ్యయం ఎప్పుడూ 5 శాతం కంటే తక్కువగానే ఉంటోంది. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే సబ్సిడీపై పంపిణీ నుండి ఉచిత పంపిణీకి మారడం వల్ల ప్రభుత్వంపై పెద్దగా ఆర్థిక భారం పడలేదు. కానీ ప్రచారం మాత్రం లభించింది.

10-14 కోట్ల మంది దూరం

ఇక్కడ గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయమేమంటే ఆహారధాన్యాల ఉచిత పంపిణీ 80 కోట్ల మంది ప్రజలకు ఎంతో కొంత లబ్ది చేకూరుస్తున్నప్పటికీ మరో 10-14 కోట్ల మందికి ఈ పథకం వర్తించడం లేదు. ఈ లెక్కలు కూడా 2011 నాటివి. అప్పటి నుండి జనగణన సహా పలు పత్రాలను తాజా పరచలేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు అర్హులైన లబ్దిదారుల సంఖ్య మరింత పెరిగి ఉండవచ్చు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

పుండి - నౌపడా - కోటబొమ్మాళి సెక్షన్‌లో వంతెన పునర్నిర్మాణ పనుల కారణంగా నౌపడా యార్డ్, పర్లాకిమిడి యార్డ్ మీదుగా మే 24, 27 తేదీల్లో నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు. మరికొన్ని రైళ్లను షార్ట్ టర్మినేట్‌తో పాటు రీ షెడ్యూల్ చేసినట్టు వెల్లడించారు. ఈ మేరకు రైల్వే శాఖ సీనియర్ డిసిఎం కె.సందీప్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

సెమీస్‌కు ప్రథమేశ్

ప్రపంచ ఆర్చరీ స్టేజ్-2



యేఛియాన్(కొరియా): ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-2లో ప్రథమేశ్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం క్వార్టర్‌ఫైనల్లో ప్రథమేశ్ 147-146పాయింట్ల తేడాతో టర్కీకి చెందిన ఎమెరికన్ హెన్రీను ఓడించాడు. తొలిరౌండ్‌లో 148-144పాయింట్ల తేడాతో ప్రజ్జెసిక్‌ను, రెండోరౌండ్‌లో మెక్సికోకు చెందిన సెబాస్టియన్ గార్సియా(మెక్సికో)ను ఓడించిన ప్రథమేశ్.. క్వార్టర్‌ఫైనల్లోనూ ఆ స్థాయి ప్రదర్శనను కనబర్చి పతకానికి చేరువయ్యాడు. సెమీస్‌లో నికో వెయినర్(అమెరికా)తో తలపడనున్నాడు. నికో వెమినార్ 146-145పాయింట్ల తేడాతో ఆస్ట్రేలియాకు చెందిన ఆర్చర్‌ను ఓడించి సెమీస్‌కు చేరాడు. కాంపౌండ్ వ్యక్తిగత విభాగం పోటీల్లో ప్రియాన్ష్, అభిషేక్, రాజత్ ప్రత్యర్థుల చేతిలో ఓడారు. ఇక డబుల్స్ విభాగంలో అభిషేక్ వర్మ-రజత్ రెండోరౌండ్‌లో డెన్మార్క్ ఆర్చర్ల చేతిలో ఓటమిపాలయ్యారు.

ఐపిఎల్ ఫైనల్‌కు షారుక్ : జూహీ చావ్లా



ముంబయి: కోల్‌కతా నైట్‌రైడర్స్ సహ యజమాని షారుక్ ఖాన్ ఐపిఎల్ ఫైనల్‌కు వచ్చేస్తాడని బాలీవుడ్ నటి జూహీ చావ్లా తెలిపారు. మంగళవారం జరిగిన తొలి క్వాలిఫయర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌పై కోల్‌కతా గెలిచిన తర్వాత షారుక్ ఖాన్ స్వల్ప అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. కెకెఆర్ గెలుపు తర్వాత షారుక్ ఆటగాళ్లతో అహ్మదాబాద్ మైదానంలో సందడి చేశాడు. ఆ తర్వాత స్వల్ప అస్వస్థతకు గురై బుధవారం ఆసుపత్రిలో చేరారు. డీహైడ్రేషన్, అధిక వేడి కారణంగా ఇబ్బంది పడుతున్నట్లు డాక్టర్లు తెలిపారు. ఈ క్రమంలో అతడి ఆరోగ్య పరిస్థితిపై కేకేఆర్ సహ యజమాని జూహీ చావ్లా కీలక సమాచారం అందించారు. "ఆసుప్రతిలో చేరినప్పుడు షారుక్ కాస్త ఇబ్బందిగా ఉన్నాడు. ఆ తర్వాత ఆరోగ్యం మెరుగైంది. కోల్‌కతాను ప్రోత్సహించేందుకు తప్పకుండా ఐపీఎల్ ఫైనల్‌కు వస్తాడు" అని చావ్లా తెలిపారు.

ఇండియా × పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్

టికెట్ ధర 20వేల డాలర్లు..

ఐపిఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోడీ ట్వీట్



న్యూఢిల్లీ: భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే క్రికెట్ మ్యాచ్ అంటేనే అభిమానుల్లో యమ క్రేజ్. ఆ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు క్రీడాభిమానులు ఎగబడుతుంటారు. నిజానికి ఈ రెండు దేశాల మధ్య ప్రస్తుతం ద్వైపాక్షిక సిరీస్‌లు లేకున్నా.. ఐసిసి టోర్నీల్లో మాత్రం ముఖాముఖి తలపడుతున్నాయి. ఈ క్రమంలో అమెరికా వేదికగా జూన్ 9న జరిగే టి20 వరల్డ్‌కప్ భారత్-పాక్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు ఫుల్ క్రేజీ ఏర్పడింది. డైమండ్ క్లబ్‌కు చెందిన టికెట్లను 20 వేల డాలర్ల(అంటే భారత కరెన్సీలో సుమారు 17 లక్షలు అమ్ముతున్నట్లు ఐపిఎల్ మాజీ ఛైర్మెన్ లలిత్ మోడీ తన ఎక్స్ అకౌంట్‌లో ఓ పోస్టు చేశాడు. అలాగే ఈ క్రికెట్ మ్యాచ్‌కు సంబంధించి అనేక వెబ్‌సైట్లు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్నట్లు ఆరోపణలు వచ్చినట్లు లలిత్ మోడీ తన ట్విటర్‌లో పోస్ట్ చేశాడు.

నాదల్ తొలిరౌండ్ ప్రత్యర్థి జ్వెరేవ్

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ డ్రా విడుదల



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ డ్రాను నిర్వాహకులు గురువారం విడుదల చేశారు. ఈ టైటిల్‌ను 14సార్లు చేజిక్కించుకొని రికార్డుపుటల్లోకెక్కిన రఫెల్ నాదల్‌కు తొలిరౌండ్‌లోనే గట్టి ప్రత్యర్థితో ఢీ కొట్టనున్నాడు. నాదల్ తొలిరౌండ్‌లో అలెగ్జాండర్ జ్వెరేవ్‌తో తలపడనున్నాడు. రెండేళ్లుగా జ్వెరేవ్ చీలమండ గాయం కారణంగా టోర్నమెంట్‌లకు దూరంగా ఉంటున్నాడు. ఇక రఫెల్ నాదల్ ఏడాదిగా తుంటిగాయం కారణంగా ప్రధాన టోర్నీలకు దూరంగా ఉంటున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ తొలిరౌండ్‌లో వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ఆటగాడు పియర్ హెర్బర్ట్‌తో ఢీకొట్టనున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్ జెన్నిక్ సిన్నర్ తొలిరౌండ్‌లో అమెరికాకు చెందిన క్రిస్టోఫర్‌తో, 2సార్లు ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాజ్ 3వ సీడ్‌గా ఈ టోర్నీ బరిలోకి దిగుతున్నాడు. ఇక భారత స్టార్ ఆటగాడు సుమిత్ నాగల్ తొలిరౌండ్‌లో 18వ ర్యాంక్ ఆటగాడు, రష్యాకు చెందిన కరెన్ ఖచనోవ్‌తో తలపడనున్నాడు. సుమిత్ ఏటిపి ర్యాంకింగ్స్‌లో 100లోపు నిలవడంతో అతడు నేరుగా ఫ్రెంచ్ ఓపెన్ ప్రధాన టోర్నీకి అర్హత సాధించాడు.

స్వైటెక్‌కు టాప్‌సీడింగ్..

ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో ఇగా స్వైటెక్ (పోలెండ్)కు టాప్‌సీడింగ్ లభించింది. ఆమె తొలిరౌండ్‌లో క్వాలిఫయర్‌తో తలపడనుంది. ఇక రెండోరౌండ్‌లో మాజీ నంబర్‌వన్ క్రీడాకారిణి నవోమీ ఒసాకా(జపాన్)తో ఆడాల్సి ఉంటుంది. ఇక ఒసాకా తొలిరౌండ్‌లో ఇటలీకి చెందిన లూసియా బ్రోంజెట్టితో తలపడనుంది. ఇక 2వ సీడ్, 2సార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్ ఆర్యానా సబలెంకా తొలిరౌండ్‌లో ఎరికా ఆండ్రీవా(అమెరికా)తో తలపడనుంది. మూడోసీడ్, యుఎస్ ఓపెన్ ఛాంపియన్ కోకా గాఫ్ తొలిరౌండ్‌లో క్వాలిఫయర్‌తో, 5వ సీడ్, వింబుల్డన్ మాజీ ఛాంపియన్ ఎలెనా రైబకినా బెల్జియంకు చెందిన మినెన్‌తో అమీ తుమీ తేల్చుకోనుంది. ఇక ఫ్రెంచ్ ఓపెన్ నుంచి పెగూలా వైదొలిగింది. 26నుంచి ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ తొలిరౌండ్ పోటీలు ప్రారంభం కానున్నాయి.

మోడీకి రైతు సెగ

- కనీస మద్దతు ధర అమలు చేయాలని డిమాండ్
- పంజాబ్ పర్యటనలో ప్రధానికి అడుగడుగునా అడ్డంకులు
- బిజెపి నాయకుల నిలువరింత.. గో బ్యాక్ అంటూ నినాదాలు
- నల్లజెండాలతో నిరసన
- తమకు కేటాయించిన ప్రాంతంలో వందలాది మంది రైతుల ర్యాలీ
- మూడు రహదారుల దిగ్బంధం


మోడీ గో బ్యాక్ అంటూ పాటియాలలో ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీకి రైతు సెగ తగిలింది. దశాబ్దకాలంగా తమను మోసం చేస్తున్నారంటూ మోడీకి వ్యతిరేకంగా రైతులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. దీంతో పోలీసులకు, భద్రతా బలగాలకు ముచ్చెమటలు పట్టాయి. పంజాబ్‌లోని పాటియాలలో మోడీ ఎన్నికల ప్రచారం భారీ భద్రత నడుమ సాగింది. రైతులు మార్చ్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పాటియాలలో మోడీ నిర్వహిస్తున్న సభ వేదిక వరకూ పోలీసు అధికారులు భారీ భద్రతను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. మోడీ పర్యటన, రైతుల నిరసన మార్చ్ నేపథ్యంలో 5,500 మంది పోలీసులు, భద్రతా సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. రైతులు పాటియాలలోకి ప్రవేశించకుండా నిరోధించటానికి, వాహనాల కదలికను నియంత్రించటానికి ర్యాలీ వేదికను పూర్తిగా చుట్టుముడుతూ ఎంట్రీ పాయింట్ల వద్ద ఇసుకతో నింపిన ట్రక్కులను భద్రతా అధికారులు ఉంచారు. దీంతో పంజాబ్‌లో బీజేపీ లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని గురువారం సాయంత్రం ప్రారంభించటానికి మోడీ పర్యటనకు ముందు పాటియాలా ఒక ఉద్రిక్తమైన వాతావరణాన్ని చూసింది.

సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం)కు చెందిన రాజకీయేతర, రాజకీయ వర్గాలు, భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ, ఉగ్రహన్), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం) సహా అనేక రైతు సంఘాలు ప్రధాని మోడీకి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చాయి. ఆయన పర్యటనలో నల్ల జెండాలు చూపించాలని రైతులను, నిరసనకారులను కోరాయి. దీంతో పోలీసు ఉన్నతాధికారులు భద్రతను పెంచారు. వాస్తవానికి, సాయంత్రం ఐదు గంటలకు షెడ్యూల్ చేయబడిన మోడీ ర్యాలీకి కొన్ని గంటల ముందు నుంచే కొంత మంది రైతులు పాటియాలా ఎంట్రీ పాయింట్ల వద్ద నిరసనలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో పోలీసులు పలు ఆంక్షలు విధించారు. మోడీ ర్యాలీకి వచ్చేవారిని నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతాలకు ఆదేశించారు. వేదిక వద్దకు కనీసం ఒక కిలోమీటరు నడిచి వెళ్లవలసి వచ్చింది. అన్ని ఎంట్రీ పాయింట్ల వద్ద కూడా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాము శాంతియుతంగా నిరసనలు వ్యక్తం చేస్తుంటే పోలీసులు అడ్డుకుంటున్నారని రైతులు తెలిపారు. సింభు, ఖనౌరీతో పాటు తమను అనుమతించిన ఇతర సరిహద్దు ప్రాంతాల్లో రైతులు సమావేశమయ్యారు. తమ డిమాండ్ల సాధన కోసం కేంద్రానికి వ్యతిరేకంగా జరుపుతున్న పోరాటం వంద రోజులు పూర్తయిన నేపథ్యంలో రైతులు గుమిగూడారు. భద్రతా దళాలు, పోలీసులు రైతులను ఢిల్లీలోకి ప్రవేశించకుండా నిరోధించటంతో అన్నదాతలు సరిహద్దు ప్రాంతాల్లోనే ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. రైతులు మూడు రహదారులను దిగ్బంధం చేశారు. పాటియాలలోని అడ్మినిస్ట్రేటివ్ కాంప్లెక్స్ వద్ద తమకు కేటాయించిన ప్రదేశంలో రైతులు వందలాది మందిగా చేరి ర్యాలీ చేపట్టారు.

కొందరు రైతులు గురువారం ఉదయం ధరేరి జట్టన్ టోల్ ప్లాజా వద్ద గుమిగూడి ర్యాలీకి అంతరాయం కలిగించకుండా నిరసన తెలిపారు. బీజేపీ నేత జగదీష్ జగ్గా, ఆయన మద్దతుదారులు ప్రయాణిస్తున్న బస్సులను రైతులు మోడీ పాటియాలా ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకున్నారు. తాము ఉదయాన్నే వచ్చామని సిద్ధూపూర్‌కు చెందిన మరో రైతు కార్యకర్త దర్శన్ సింగ్ తెలిపారు. టోల్ ప్లాజా వద్ద రైతులు మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండగా.. "మేము ఇక్కడే ఉంటాం కానీ బీజేపీ నాయకులు తమ మద్దతుదారులను ముందుకు తీసుకెళ్లడానికి అనుమతించం" అని ఆయన అన్నారు. ఇంతలో, ఎస్కేఎం (నాన్ పొలిటికల్) పిలుపు మేరకు రైతులు గురువారం మధ్యాహ్నం శంభు సరిహద్దు నుంచి పాటియాలాకు వెళ్లటం ప్రారంభించారు. పోలీసులు వారిని నిరోధించారు.

గతంలోనూ మోడీకి రైతుల నుంచి వ్యతిరేకత

ప్రధాని మోడీ పంజాబ్ పర్యటనలో రైతుల ఆగ్రహాన్ని ఎదుర్కోవటం ఇదే మొదటిసారి కాదు. 2022లో, ఫిరోజ్‌పూర్ సమీపంలోని ఫ్లై ఓవర్‌పై రైతుల నిరసన కారణంగా మోడీ కాన్వాయ్‌కు అంతరాయం ఏర్పడింది. దిగ్బంధం కారణంగా.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ ర్యాలీలో ప్రసంగించే ప్రణాళికలను మోడీ రద్దు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

రైతుల నిరసనలు దేనికి?

వివిధ రైతు సంఘాలతో అనుబంధం ఉన్న రైతులు తమ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టంతో సహా తమ వివిధ డిమాండ్లను నెరవేర్చనందుకు బీజేపీ నేతృత్వంలోని కేంద్రంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ వైపు వెళ్లకుండా తమను పంజాబ్, హర్యానాలోని శంభు, ఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద వారిని బలవంతంగా క్యాంప్‌ను ఏర్పాటు చేసేలా ఒత్తిడి చేయటంపైనా రైతన్నలు ఆగ్రహంతో ఉన్నారు. సిర్హింద్ రోడ్‌లోని ఫగ్గన్ మజ్రా వద్ద పాటియాలా, పాత్రన్ రోడ్‌లోని అసర్‌పూర్ చుప్కీ, గురుద్వారాస్ పరమేషర్ ద్వార్ సంగ్రూర్ రోడ్, రఖ్రా మాండౌర్ నభా రోడ్, ఖాసియాన్ పెహెూవా రోడ్ వద్ద ఐదు ఎంట్రీ పాయింట్ల వద్ద నిరసనకు రైతు సంఘాలు పిలుపునిచ్చాయి.

ముగిసిన ప్రచార పర్వం

- రేపే ఆరో దశ పోలింగ్
- ఎనిమిది రాష్ట్రాల్లో 58 లోక్‌సభ స్థానాలకు పోలింగ్
- 889 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల ఆరో దశ పోలింగ్ కు సంబంధించిన ప్రచారపర్వం గురువారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. పోలింగ్ రేపు (శనివారం) జరగనుంది. ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 58 నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతుంది. ఈ రాష్ట్రాల నుంచి 889 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఆరో దశలో ఉత్తరప్రదేశ్‌లో 14, బీహార్‌లో ఎనిమిది, హర్యానాలో పది, ఢిల్లీలో ఏడు, పశ్చిమ బెంగాల్‌లో ఎనిమిది, జార?ండ్‌లో నాలుగు, ఒరిస్సాలో ఆరు స్థానాలకు పోలింగ్ జరగనుంది. అయితే మూడో దశ (మే 6)లో జరగాల్సిన జమ్మూకాశ్మీర్ లోని అనంతనాగ్ లోక్‌సభ నియోజకవర్గం పోలింగ్, మే 25 ఆరో దశ పోలింగ్ కు మార్చారు. జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ కట్టర్, కాంగ్రెస్ నేతలు కన్నయ్య కుమార్, దీపేందర్ సింగ్ హుడా, బిజెపి నేత మనోజ్ తివారీ తదితరులు బరిలో ఉన్నారు.

ఆశ్చర్యకర ఫలితాలు తథ్యం

- ఇండియా ఫోరందే అధికారం :రాహుల్ గాంధీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వచ్చే సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యపరుస్తాయని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలోని 90 శాతం పేద ప్రజలు తమ వెంట ఉన్నారని, ఇండియా ఫోరం అధికారంలోకి రానుందని అన్నారు. గురువారం నాడిక్కడ ఏపి, తెలంగాణ భవన్ లో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తో కలిసి లంచ్ చేశారు. అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. దేశ రాజధాని ఢిల్లీలోని ఏడు సీట్లనూ ఇండియా ఫోరం గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. రాజ్యాంగం, రిజర్వేషన్లపై మోడీ, బిజెపి దాడి చేస్తోందని ఫైర్ అయ్యారు. దేశ ప్రధానిగా మోడీ 22 మంది పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే పని చేశారని విమర్శించారు. దేశ సంపదను ఆదానీ కి దోచిపెట్టారని ఆరోపించారు. దళితులు, ఆదివాసీలు, వెనకబడిన వర్గాలకు ఈ ఎన్నికలు అత్యంత కీలకమని రాహుల్ పేర్కొన్నారు.

ఓట్ల తారుమారుకు అవకాశం

- 120 పౌర సమాజ సంస్థల హెచ్చరిక

న్యూఢిల్లీ : లెక్కింపు రోజున ఓట్లను తారుమారు చేసే అవకాశం ఉన్నదని 120 పౌర సమాజ సంస్థలు హెచ్చరించాయి. ఎన్నికల కమిషన్‌ను ఎలా జవాబుదారీ చేయాలనే విషయంపై పలువురు హక్కుల కార్యకర్తలు, ప్రభుత్వ మాజీ ఉన్నతోద్యోగులు, నిపుణులు ఇటీవల ఆరు గంటల పాటు కూలంకషంగా చర్చించారు. కర్ణాటకలో ఈ సమావేశం జరగ్గా, న్యూఢిల్లీలోనూ, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. విధి నిర్వహణలో ఇసి తరచుగా విఫలమవుతున్న నేపథ్యంలో ఈ సమావేశం అవసరమైందని రాజకీయ ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్ తెలిపారు.

'ఇప్పుడు మాకు ఓ పరిమితమైన లక్ష్యం ఉంది. ప్రజలు బ్యాలెట్ ద్వారా తమ తీర్పును వెలువరించాలి. అది ఏదైనా సరే. అలా జరగకపోతే ప్రజల పౌర హక్కుల పరిరక్షణ కోసం పౌర సమాజం దానిని సవాలు చేయాల్సి వస్తుంది' అని పరకాల చెప్పారు. ఎన్నికల కమిషన్ సభ్యుల నియామక ప్రక్రియ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పించడం ఈసీ నిస్పాక్షికతపై తీవ్రమైన అనుమానాలు రేకెత్తిస్తోందని అన్నారు. తాము ఈసీని నిందించడం లేదని, అయితే తమ అనుమానాలు నిరాధారమైనవని ఆ సంస్థ తేల్చాల్సి ఉంటుందని చెప్పారు. కానీ ఈసీ చర్యలు తమ అనుమానాలను మరింత పెంచుతున్నాయని అన్నారు. ప్రధాని, ఆయన పార్టీ విద్వేష ప్రసంగాలు చేస్తున్నా, ప్రవర్తనా నియమావళిని తరచూ ఉల్లంఘిస్తున్నా దానిని అడ్డుకోవడంలో లేదా కనీసం నిరుత్సాహపరచడంలో ఈసీ విఫలమైందని ఆరోపించారు.

దేశంలో ఇప్పుడు జరుగుతున్నంతగా గతంలో ఎన్నడూ ఎన్నికలు అనుమానంతో, అపోహలతో జరగలేదని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఎంజీ దేవసహాయం చెప్పారు. ప్రజాస్వామ్యం కావాలా నియంతృత్వం కావాలా అనేదే ఇప్పుడు ప్రజల ముందు ఉన్న ప్రశ్న అని ఆయన అన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాద్ సూచించారు. ఉత్తరప్రదేశ్‌లోని సంబల్, అమేథీలో ఓటర్లపై లాఠీఛార్జీ చేశారని 'యునైటెడ్ అగనెస్ట్ హేట్' సంస్థకు చెందిన నదీమ్ ఖాన్ తెలిపారు.

రఫాపై దాడులు ఉధృతం

- జెనిన్‌లో 12మంది పాలస్తీనియన్లు మృతి
- ఇజ్రాయిల్‌పై నేడే ఐసిజె రూలింగ్

గాజా, జెనిన్ : రఫా నగరంపై ఇజ్రాయిల్ సైన్యం ఉధృతంగా దాడులు కొనసాగిస్తోంది. మరోపక్క గాజాలో కాల్పుల విరమణను అమలు చేసేలా ఇజ్రాయిల్‌ను ఆదేశించాలంటూ దక్షిణాఫ్రికా చేసిన అభ్యర్థనపై శుక్రవారం రూలింగ్ ఇవ్వనున్నట్లు అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) పేర్కొంది. రఫాలో దాడులు ఆరంభించిన తరావ్త 8లక్షల మందికి పైగా పాలస్తీనియన్లు రఫాను వీడి పారిపోయారని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. గత 7 మాసాలకు పైగా కొనసాగుతున్న దాడుల్లో 35,800మంది మరణించగా, 80,011 మంది గాయపడ్డారు.

తామనుకున్న లక్ష్యాలు నెరవేరేవరకు రఫా నగరంలో తమ దాడులు నిరంతరంగా కొనసాగుతాయని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్ స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ నావికాదళ సామర్ధ్యాలను పరిశీలించేందుకు ఆయన గాజా తీర ప్రాంతంలో పర్యటించారు. పదాతిదళ, వైమానిక దాడులకు మరిన్ని బలగాలు రంగంలోకి దిగాయని చెప్పారు.

జెనిన్‌లో 12మంది పాలస్తీనియన్లు మృతి

వెస్ట్ బ్యాంక్ నగరమైన జెనిన్‌లో రెండు రోజుల పాటు ఇజ్రాయిల్ బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో 12మంది పాలస్తీనియన్లు మరణించగా, 25మంది గాయపడ్డారు. గాజాలో కొనసాగుతున్న దాడులు, ఊచకోతలో భాగంగానే వెస్ట్ బ్యాంక్‌లో కూడా ఈ దాడులు చోటు చేసుకున్నాయి. తీవ్రవాదులను ఏరివేయాలనే పేరుతో ఇజ్రాయిల్ మిలటరీ చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా జెనిన్‌లో సాయుధులను లక్ష్యంగా చేసుకున్నారు. మంగళవారం ఉదయం జరిగిన మొదటి దఫా కాల్పుల్లో ఏడుగురు మరణించారని, 9మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. విధులకు హాజరవడానికి వెళుతున్న డాక్టర్ జబరీన్‌పై ఉద్దేశ్యపూర్వకంగానే ఇజ్రాయిల్ సైనికులు కాల్పులు జరిపారని ఆరోగ్య శాఖ వర్గాలు విమర్శించాయి. గాజా దాడుల నేపథ్యంలో వెస్ట్ బ్యాంక్‌లో కూడా కొనసాగుతున్న ఘర్షణల్లో ఇప్పటివరకు 480మంది పాలస్తీనియన్లు మరణించారని ఐక్యరాజ్య సమితి వర్గాలు తెలిపాయి. వీరిలో హమాస్ సభ్యులతో పాటూ సామాన్యులు కూడా వున్నారని తెలిపారు. జెనిన్‌లో, చుట్టుపక్కల పరిస్థితులు అత్యంత ఉద్రిక్తంగా వున్నాయి.

ఇదేం తీరు?

- ఇసి తీరును ఎండగడుతూ ది హిందూ, డక్కన్ హెరాల్డ్ సంపాదకీయాలు

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల నిర్వహణ తీరుపై రెండు ఆంగ్ల పత్రికలు గురువారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఎన్నికల నిర్వహణలో ఇసి పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించాయి. ఈ మేరకు ది హిందూ, డక్కన్ హెరాల్డ్ పత్రికలు తమ సంపాదకీయాల్లో ఈసీ తీరును ఎండగట్టాయి.

ఎన్నికల ప్రసంగాల్లో మతపరమైన అంశాలు లేవనెత్తవద్దని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఈసీ తాజాగా రాసిన లేఖను 'ది హిందూ' పత్రిక సంపాదకీయం ప్రస్తావించింది. అయితే ఇప్పటికే ఆలస్యమైందని, తాను నిస్పాక్షికంగా వ్యవహరిస్తున్నానని ప్రజలకు ఈసీ నచ్చచెప్పలేకపోయిందని వ్యాఖ్యానించింది. డక్కన్ హెరాల్డ్ పత్రిక మరింత కఠిన పదజాలంలో ఈసీపై మండిపడింది. అన్ని విషయాల్లో ఈసీ వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోందని తెలిపింది.

అసమర్థత చాటుకున్న ఇసి : ది హిందూ

'బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఈసీ లేఖలు రాయడం గుడ్డిలో మెల్ల మాదిరిగా ఉంది. ఈసీ తన అసమర్థత కారణంగా ఓటర్లను నిరుత్సాహానికి గురిచేసింది. సమర్థతతో, నిస్పాక్షికతతో సజావుగా ఎన్నికలు నిర్వహించి కాపలా కుక్క మాదిరిగా ఉండాల్సిన ఈసీ తన అసమర్థతను చాటుకుంది. దీనంతటికీ కమిషన్ సభ్యులను నియమించిన పాలకులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, తెలంగాణ మంత్రి కొండా సురేఖ, బీజేపీ నేతలు శోభా కరంద్లజే, దిలీప్ ఘోష్, కాంగ్రెస్ నాయకులు సుప్రియా శ్రీనాటే, రణదీప్ సూర్జివాలాపై ఈసీ తీసుకున్న చర్యల కారణంగా కొంత నిస్పాక్షికత కన్పించినా అది సరిపోదు' అని 'ది హిందూ' సంపాదకీయం తెలిపింది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మపై వచ్చిన ఫిర్యాదులు ఇప్పటికీ పెండింగులోనే ఉన్నయని ఆ పత్రిక గుర్తు చేసింది.

దాని పనులు కోర్టులు చేస్తున్నాయి : డక్కన్ హెరాల్డ్

ఈసీ చేయాల్సిన పనులను ఇప్పుడు న్యాయస్థానాలు చేస్తున్నాయని డక్కన్ హెరాల్డ్ వ్యాఖ్యానించింది. 'అభ్యంతరకరమైన, అపవాదులు వేసే ప్రకటనలు ఇవ్వవద్దని కలకత్తా హైకోర్టు బీజేపీని ఆదేశించింది. ఫిర్యాదులపై ఈసీ సకాలంలో స్పందించడం లేదని చెప్పడానికి ఇదో ఉదాహరణ. కొల్‌కతా కేసు ఒక్కటే కాదు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి సకాలంలో చర్యలు తీసుకోవడంలో ఈసీ వైఫల్యం అనేక సందర్భాల్లో బహిర్గతమైంది. ఒకవేళ చర్యలు తీసుకున్నప్పటికీ అవి ఛోటా నాయకుల పైనే. అది కూడా సకాలంలో కాకుండా ఆలస్యంగా తీసుకున్నది. గత ఎన్నికల్లో కంటే ఇప్పుడు విద్వేష ప్రసంగాలు, మతపరమైన ప్రకటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ప్రధాని మోడీ ముస్లింలపై విషం చిమ్ముతున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ తన స్వతంత్రతను తానే నీరుకారుస్తోంది. ఫిర్యాదులపై సకాలంలో చర్యలు తీసుకోవడంలో విఫలం కావడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోంది. రాజకీయ పార్టీలకు బుధవారం జారీ చేసిన సాధారణ మార్గదర్శకాలు ఈ అభిప్రాయాన్ని మార్చలేకపోతున్నాయి' అని తెలిపింది.



పట్టణ ఓటర్లపై రాజకీయ ప్రకటనల ప్రభావం

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు ఇచ్చిన ప్రకటనలు పట్టణ ఓటర్లపై ప్రభావం చూపాయని యూగవ్ సంస్థ నిర్వహించిన సర్వే తెలిపింది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసిన ప్రతి పది మంది పట్టణ ఓటర్లలో ఆరుగురు బీజేపీ ప్రకటనల కారణంగా ప్రభావితులయ్యారని ఆ సర్వే తేల్చింది. ఎన్నికల సమయంలో తాము రాజకీయ ప్రకటనలు చూశామని 76 శాతం మంది తెలుపగా కేవలం 14 శాతం మంది మాత్రమే వాటిని పట్టించుకోలేదని చెప్పారు.

కనీసం ఒక ప్రకటన అయినా చూశామని చెప్పిన వారిలో 81 శాతం మంది బిజెపి యాడ్స్‌ను వీక్షించారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రకటనలు చూశామని 47శాతం మంది తెలియజేశారు. అమ్‌ఆద్మీ పార్టీ ప్రకటనలు చూశామని కేవలం 12శాతం మంది మాత్రమే చెప్పారు. ఇతర పార్టీల యాడ్స్‌ను 7శాతం మంది చూశారు. 1981-1996 మధ్య జన్మించిన వారు ఎక్కువగా కాంగ్రెస్ ప్రకటనలు చూడడం గమనార్హం. రాజకీయ ప్రకటనలు వచ్చిన మాధ్యమాలలో యూట్యూబ్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ వేదికలో తాము యాడ్స్ చూశామని 67 శాతం మంది తెలిపారు.

58 శాతం వీక్షకులతో టీవీ రెండో స్థానంలో నిలిచింది. 43 శాతం మందితో ఇన్‌స్టాగ్రామ్, 38 శాతం మందితో వాట్సప్, 35 శాతం మందితో మెటా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

అణచివేత, బెదిరింపుల భయంతో

స్వదేశాలకు దూరంగా వేలాది జర్నలిస్టులు

- యుఎన్ జనరల్ అసెంబ్లీకి నివేదికలో ఇండిపెండెంట్ ఇన్వెస్టిగేటర్ ఇర్నె ఖాన్ వెల్లడి



ఐక్యరాజ్య సమితి : రాజకీయ వేధింపులు, అణచివేత చర్యలు, బెదిరింపుల నుండి తప్పించుకునేందుకు వేలాదిమంది జర్నలిస్టులు స్వదేశాల నుండి పారిపోతున్నారని ఐక్యరాజ్య సమితి నిపుణురాలు, స్వతంత్ర దర్యాప్తు అధికారి ఇర్నె ఖాన్ తెలిపారు. అయితే వారు ప్రవాసంలో వున్నప్పటికీ తరచుగా భౌతిక, చట్టపరమైన, డిజిటల్ బెదిరింపులకు గురవుతునే వున్నారని ఆమె తెలిపారు.

భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కు పరిరక్షణకై పోరాడుతున్న స్వతంత్ర దర్యాప్తు అధికారి అయిన ఇర్నె ఖాన్ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీకి అందచేసిన ఒక నివేదికలో ఆమె ఈ విషయాలు వెల్లడించారు. అనేకమంది జర్నలిస్టులు, కొన్ని స్వతంత్ర మీడియా సంస్థలు స్వేచ్ఛగా, నిర్భయంగా వార్తలందించడానికి, ఇన్వెస్టిగేట్ చేసుకోవడానికి వీలుగా వుండేలా దేశాలు విడిచి వెళ్ళాయని, ఆమె తెలిపారు. ప్రజాస్వామ్య దేశాల్లో స్వతంత్ర, విమర్శనాత్మక మీడియాకు ప్రాముఖ్యత కుంచించుకుపోతూ వస్తోందని, నిరంకుశ ధోరణులు పెరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి చోట్లే జర్నలిస్టులు ప్రవాసంలోకి వెళుతున్నారని అన్నారు. మూడో వంతు ప్రపంచ దేశాల్లో ఈనాడు స్వేచ్ఛా, స్వతంత్ర, వైవిధ్యమైన మీడియాకు మద్దతిచ్చే ప్రజాస్వామ్యం కరువవడం లేదా తీవ్రంగా ఇబ్బందులకు గురవడం జరుగుతోందన్నారు. గతంలో అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్‌గా చేసిన ఇర్నె ఖాన్ బంగ్లాదేశ్‌లో లాయర్‌గా కూడా పనిచేశారు. తమ భద్రత కోసం ఒక పక్క భయపడుతూనే మరోపక్క స్వదేశంలో తమ కుటుంబం పడే ఇబ్బందులును తలచుకుంటూ పైగా విదేశాల్లో నివసించడం వల్ల ఎదురయ్యే స వాళ్ళను అధిగమించేందుకు ప్రయత్నిస్తూ అనేకమంది జర్నలిస్టులు చిట్టచివరికి తమ వృత్తిని కూడా వదులుకోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రవాసమనేది విమర్శకుల నోళ్లను మూసివేయించడానికి మరో మార్గమని ఆమె వ్యాఖ్యానించారు. ఇటీవలి సంవత్సరాల్లో ఆఫ్ఘనిస్తాన్, బెలారస్, చైనా, ఇథియోపియా, ఇరాన్, మయన్మార్, నికారాగ్వా, రష్యా, సూడాన్, సోమాలియా, టర్కీ, ఉక్రెయిన్‌ల నుండి వందలాదిమంది జర్నలిస్టులు పారిపోయారని ఆమె చెప్పారు. బురుండి, గ్వాటెమాలా, భారత్, పాకిస్తాన్, తజకిస్తాన్‌ల నుండి కూడా చాలా కొద్దిమంది వెళ్ళిపోయారని ఆమె తెలిపారు. సరిహద్దులకు ఆవల దేశాలు పాల్పడే మానవ హక్కుల ఉల్లంఘనలపై ఎలాంటి డేటా లేదని చెప్పారు. ఇతర దేశాలకు ప్రవాసం వచ్చిన జర్నలిస్టులకు వీసాలు, వర్క్ పర్మిట్లు ఇవ్వాలని ఆమె ఆయా దేశాలను కోరారు.

ధరల సూచీని విడుదల చేయండి : సిఐటియు

న్యూఢిల్లీ : పారిశ్రామిక కార్మికుల కోసం వినియోగదారుల ధరల సూచీని వెంటనే విడుదల చేయాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో పారిశ్రామిక కార్మికులకు (ఎఐసిపిఐ-ఐడబ్ల్యు) ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్‌ను విడుదల చేయడంలో జాప్యాన్ని సిఐటియు ప్రశ్నించింది. ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ కేంద్ర కార్మిక మంత్రి భూపేందర్ యాదవ్‌కు లేఖ రాశారు. లేబర్ బ్యూరో డేటాను విడుదల చేయకుండా ఆలస్యం చేయడం చాలా అసాధారణమని, వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని కోరారు.దేశంలోని లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులకు వేతనాలు మరియు డియర్‌నెస్ అలవెన్స్ నియంత్రణకు ఎఐసిపిఐ ఐడబ్ల్యు చాలా ముఖ్యమైన కార్మిక గణాంకాలు అని సేన్ తన లేఖలో పేర్కొన్నారు. "ఈ సూచికలు ద్రవ్యోల్బణం, ఇతర విధాన సూత్రీకరణలను కొలవడానికి కూడా ఉపయోగించబడతాయి. కానీ, గత రెండు నెలలుగా (ఫిబ్రవరి మరియు మార్చి, 2024) విడుదల చేయలేదని మీ దృష్టికి తీసుకురావాలని మేము భావించాము" అని ఆయన పేర్కొన్నారు. ' ఏడాది ఫిబ్రవరికి సంబంధించిన సూచీని మార్చి 28న విడుదల చేస్తామని కార్మిక మంత్రిత్వ శాఖ హామీ ఇచ్చింది. మార్చి సూచికను ఏప్రిల్ 30న విడుదల చేయాలి. అది కూడా జరగలేదు."అని సేన్ లేఖలో పేర్కొన్నారు. సూచీలను విడుదల చేయడంలో జాప్యంపై లేబర్ బ్యూరో లేదా కార్మిక మంత్రిత్వ శాఖ వివరణ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఈ ఆలస్యం కారణంగా బ్యాంకు ఉద్యోగులతో సహా సెంట్రల్ పబ్లిక్ సెక్టార్‌లోని ఉద్యోగులు డియర్‌నెస్ అలవెన్స్‌ను కోల్పోతున్నారని అన్నారు.

నోటీసు చూసి షాకయ్యా

- మాజీ మంత్రి, బిజెపి ఎంపి జయంత్ సిన్హా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల ప్రచారంలో ఎందుకు పాల్గొనలేదంటూ పార్టీ ఇచ్చిన షోక్ నోటీసుపై బిజెపి సీనియర్ నేత, హజారీబాగ్ ఎంపి జయంత్ సిన్హా స్పందించారు. షోకాజ్ నోటీసు చూసి ఆశ్చర్యపోయానన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఎందుకు ఓటు వేయలేదని, ఎన్నికల ప్రచారంలో ఎందుకు పాల్గొనలేదో వివరణ అడుగుతూ బిజెపి జార్ఖండ్ ప్రధాన కార్యదర్శి ఆదిత్య సాహు షోకాజ్ నోటీసు జారీ చేశారన్నారు. వ్యక్తిగత కారణాత రీత్యా తాను విదేశాల్లో ఉండటంతో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు ఉపయోగించుకున్నట్లు తన సమాధానంలో పేర్కొన్నారు. షోకాజ్ నోటీసుపై రెండు పేజీల వివరణతో కూడిన లేఖను జయంత్ సిన్హా విడుదల చేశారు. షోకాజ్ నోటీసు చూడగానే తాను షాకయ్యానని, ఆ లేఖ మీడియాలో ప్రత్యక్షమవ్వడంతో మరింత ఆశ్చర్యానికి గురయ్యానని సిన్హా పేర్కొన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేయబోనని తాను ఈ ఏడాది మార్చి 2న ప్రకటించిన విషయాన్ని లేఖలో పొందుపర్చారు. బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డాతో మాట్లాడిన తరువాత ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

హజారీబాగ్ అభ్యర్థిగా పార్టీ మనీష్ జైస్వాల్‌ను ప్రకటించిందని, మార్చి8న ఆయనకు తాను అభినందనలు తెలిపడంతో ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపానన్నారు. తాను ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని పార్టీ భావించి ఉంటే తనను సంప్రదించి ఉండేవారని,పార్టీ ఎంపి, ఎమ్మెల్యే, పార్టీ ముఖ్య నాయకులు ఎవరూ తనను సంప్రదించలేదని సిన్హా లేఖలో పేర్కొన్నారు. పార్టీ బహిరంగ సభలు, సంస్థాగత సమావేశాలకు తనను పిలవలేదన్నారు.

బెంగళూరు రేవ్ పార్టీ..

డ్రగ్స్ టెస్ట్‌లో 86 మందికి పాజిటివ్..

బెంగళూరు : బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని ఓ ఫాం హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. డ్రగ్స్ టెస్టులో మొత్తం 86 మందికి పాజిటివ్ వచ్చినట్లు నార్కోటిక్ టీమ్ తెలిపింది. మొత్తం 150 మంది రక్త నమూనాలను నార్కోటిక్ టీమ్ సేకరించగా.. అందులో 59 మంది పురుషులు, 27 మంది మహిళల రక్త నమూనాలో డ్రగ్స్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కాగా నటి హేమకు కూడా పాజిటీవ్‌గా నిర్ధరాణ అయినట్లు సమాచారం. రక్త నమూనాలు పాజిటివ్‌గా తేలిన వారందరికీ సీసీబీ సమన్లు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని బిజెపి జైల్లో పెడితే..

అక్కడి నుంచే ప్రజాస్వామ్యం నడుస్తుంది

(మొదటిపేజీ తరువాయి)

ఉచిత వైద్యం, చైనా ఆక్రమించిన భారత భూభాగాన్ని స్వాధీనం చేసుకునేందుకు భారత సైన్యానికి స్వేచ్ఛ, అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయడం, స్వామినాథన్ కమిషన్ ప్రకారం అన్ని పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయిస్తామని హామీ ఇచ్చాం. యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు, వ్యాపారులకు సులభంగా వ్యాపారం చేయడం, ఢిల్లీకి పూర్తి రాష్ట్ర హెూదా ఇస్తాం. అవినీతిపరులకు రక్షణ కల్పించే బీజేపీ "వాషింగ్ మెషీన్"ని నాశనం చేయడంలో ఇండియా వేదిక పార్టీలు భాగస్వాములౌతాయని నేను కచ్చితంగా చెప్పగలను. ఇండియా వేదికకి బలమైన మూలస్తంభం ఆప్. జూన్ 4న ఇండియా వేదిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, మేము ఈ హామీలను సమిష్టిగా నెరవేరుస్తామని నా హామీ.

ప్రశ్న : మీరు గతంలో శరద్ పవార్, సోనియా గాంధీ వంటి పలువురు నేతలను అవినీతిపరులు అన్నారు. మీరు ఇప్పుడు వారిలో కొందరితో వేదికను పంచుకుంటున్నారు. ఈ వైఖరిలో మార్పు గురించి మీరేమంటారు?

కేజ్రీవాల్ : చరిత్రలో ఎన్నడూలేని విధంగా నేడు దేశం నేడు ఓ అసాధారణమైన ప్రజాస్వామ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ప్రతి సంస్థపైన ఈ పదేళ్లలో ఎడాపెడా దాడులు జరగడాన్ని మనం చూశాం. 'ప్రతిపక్ష-ముక్త్' భారతదేశం అనే కలను నెరవేర్చుకోడానికి అది ఎటువంటి పద్ధతులు అవలంబిస్తున్నదీ చూస్తున్నాం. ప్రతిపక్ష పార్టీలుగా మా విభేదాల గురించి మాట్లాడుకునే సమయం కాదిది.

భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అందరూ ఏకమై కృషి చేయాల్సిన సమయమిది. ప్రజాస్వామ్యమే లేకపోతే, మనం ఏ పార్టీలో ఉన్నామనేది అంత ముఖ్యం కాదు. ప్రధాని మోడీ 'వన్ నేషన్, వన్ లీడర్' మిషన్‌ను ప్రారంభించారు. దేశంలో ఇది జరగడానికి మనం అనుమతిస్తే, సాధారణ ప్రజల వాణి వినిపించేందుకు కూడా వీలులేని పరిస్థితి వస్తుంది. మనకు శాశ్వతంగా ఏక పార్టీ పాలన మిగిలిపోతుంది. ఇప్పటికే చాలా నష్టం జరిగిపోయినప్పటికీ, అది జరగకుండా నిరోధించడానికి, నియంతత్వం నుండి మన దేశాన్ని రక్షించడానికి '2024' భారతదేశ ప్రజలకు ఉన్న చివరి అవకాశం.

ప్రశ్న : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మీ పార్టీ రెండు నిర్ణయాత్మక విజయాలు సాధించగలిగింది. కానీ ఢిల్లీ నుంచి లోక్‌సభ సీటును గెలుచుకోలేకపోయింది. ఈసారి మీ పార్టీ విధానం దీనికి భిన్నంగా ఉంటుందా?

కేజ్రీవాల్ : ఈసారి రెండు పెద్ద మార్పులు చోటుచేసుకున్నాయి. గత పదేళ్లలో ఆప్ శరావేగంతో అభివద్ధి చెందింది. దశాబ్దంలో జాతీయ పార్టీగా అవతరించిన మొదటి పార్టీగా అవతరించింది. బీజేపీ, కాంగ్రెస్ తర్వాత రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఉన్న ఏకైక పార్టీ మాదే. మాకు నాలుగు రాష్ట్రాలలో ఎమ్మెల్యేలు ఉన్నారు. భారతదేశం అంతటా స్థానిక సంస్థలకు ఎన్నికైన అసంఖ్యాక సభ్యులు ఉన్నారు. గతంలో లోక్‌సభ ఎన్నికల్లో చిన్న ప్రాంతీయ పార్టీగా పోటీ చేశాం. నేడు మేము జాతీయ శక్తిగా ఉన్నాం. జాతీయంగా ఆకర్షించే పాలనా నమూనాను కలిగిఉన్నాం. మరో పెద్ద మార్పు ఏమిటంటే మేము పోరాడడం ఇదే మొదటిసారి.

ప్రశ్న : కుల ఆధారిత రిజర్వేషన్లపై మీ పార్టీ వైఖరేమిటి? మొత్తం జనాభాలో వివిధ సెక్షన్ల ప్రజలకు వారి దామాషాను బట్టి రిజర్వేషన్ల వాటా కావాలని హక్కుల గ్రూపులు కోరుతున్నాయి. ఆదాయ, సంపద అసమానతలు ఒక సమస్యగా ముందుకొస్తోంది. దీనిని మీరు ఎలా పరిష్కరిస్తారు?

కేజ్రీవాల్ : ప్రభుత్వ రంగంలో నాణ్యమైన విద్య, వైద్యం అందించడం ద్వారానే ప్రపంచంలో ఏ సమాజమైనా సుసంపన్నమవుతుంది. అమెరికాలోను, యూరపులోనూ ఇదే జరిగింది. తూర్పున సింగపూర్, జపాన్‌లలోనూ ఇదే జరిగింది. భారత్‌లో మాత్రం నాణ్యమైన ఉచిత విద్య అందరికీ అందుబాటులో లేని పరిస్థితి ఇప్పటికీ ఉంది. ఢిల్లీ, పంజాబ్‌లలో మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు మేము కృషి చేస్తున్నాం. ఖచ్చితంగా. సమాజంలోని అట్టడుగున నివసిస్తున్న వర్గాలు ప్రధాన స్రవంతిలో ఖాళీలను ఆక్రమించుకోవడానికి కుల ఆధారిత రిజర్వేషన్లు సహాయపడతాయి. ఇది వారి హక్కు. రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్‌ను అంతం చేయాలని భావిస్తున్నందున తమకు 400 ప్లస్ సీట్లు కావాలని సీనియర్ బీజేపీ సభ్యులు బహిరంగంగా చెప్పడం నాకు షాకింగ్‌గా ఉంది. బీజేపీ రాజ్యాంగాన్ని, బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను గౌరవించడం లేదు. వారు దానిని మార్చడానికి తహతహలాడుతున్నారు. కాని మేము మా చివరి శ్వాస వరకు వారితో పోరాడుతాం.

వేసవి విడిది

రాము తెలివి



అనగనగా గుండారం అనే ఊరు ఉంది. ఆ ఊరిలో నివసిస్తున్న సురేశ్, సువర్ణ దంపతులకు రాము అనే కొడుకు ఉన్నాడు. రాముకు నాయనమ్మ అంటే ఎంతో ఇష్టం. నాయనమ్మకు రాము అంటే ఇష్టం. అమ్మ ఇచ్చిన కాయలు, పండ్లు రోజూ నాయనమ్మకు రామునే స్వయంగా ఇస్తాడు. నాయనమ్మకు కాస్త ఒంట్లో నలతగా ఉంటే తెగ కంగారు పడిపోతాడు. మందులు తెచ్చి ఇస్తాడు. సపర్యలు చేస్తాడు.

రాము రోజూ నాయనమ్మ దగ్గర కథలు చెప్పించుకుంటాడు. సాహసం కథలని మళ్లీ మళ్లీ చెప్పమంటాడు. ఒక రోజు రాము స్కూలు నుంచి ఇంటికి వచ్చేసరికి నాయనమ్మ ఇంట్లో కనిపించలేదు. అంతా తిరిగి చూశాడు. బావి దగ్గర బిందె చూసి అటువైపు వెళ్లాడు. అక్కడా నాయనమ్మ కనిపించలేదు. అటూ ఇటూ చూస్తూ, బావిలోకి తొంగి చూశాడు. బావిలో నాయనమ్మ పడిపోయి వుంది. నీళ్లల్లో కాళ్లు చేతులు కొట్టుకుంటూ ఉంది.

ఆ దృశ్యం చూసి రాము వెంటనే ఇంట్లోకి పరుగెత్తాడు. పెద్ద తాడు తెచ్చి బావిలోకి వేశాడు. నాయనమ్మను గట్టిగా పట్టుకొమ్మని చెప్పి, మరొక కొసను బావి పక్కనే ఉన్న చెట్టుకు కట్టాడు. ఇరుగుపొరుగుకు వినపడేలా నాయనమ్మ బావిలో పడిపోయిందని గట్టిగా అరిచాడు. ఆ అరుపులకు జనం గుమిగూడారు. బావిలోని నాయనమ్మను పైకి తీశారు. సరైన సమయానికి బావిలో తాడు వేసి నాయనమ్మను కాపాడాడని మెచ్చుకున్నారు. నాయనమ్మ కూడా రాముని దగ్గరికి తీసుకుని గట్టిగా హత్తుకుంది.

- డా.వాసరవేణి పరశురాం,
సింగారం, రాజన్న సిరిసిల్ల జిల్లా

బొమ్మరిల్లు





- పి.జాన్‌మోజెస్,
7వ తరగతి,
జెడ్‌పిహైస్కూలు,
సి.బెల్గల్ మండలం,
కొడమూరు తాలుకా,
కర్నూలు జిల్లా.





కె.నిర్వి,
5వ తరగతి,
సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం స్కూలు,
పురుషోత్తపట్నం,
అల్లూరి సీతారామరాజు జిల్లా.

మధుర ఫలాలు



ఆకారంలో చిన్న
తీపిలో తేనె కన్నా మిన్న
పోషకాలు అధికం కన్నా
అనారోగ్యం సున్నా!

వచ్చినప్పుడే తినాల్సినవి
మళ్లీ వేసవి వచ్చు వరకు దొరకనివి
ఆరోగ్యానికి మేలైనవి
తప్పక తిని తీరాల్సినవి!

సరసమైన ధరలకు లభిస్తూ
సామాన్యులకు అందుబాటులో ఉంటూ
మధుర ఫలాలను తలపిస్తూ
మళ్లీ మళ్లీ తినాలనిపించే చెట్టుకాయలు!

వేసవి మాత్రమే ఇచ్చు వరాలు
ప్రకృతి వర ప్రసాదితాలు
చెట్టున పండు కాయలు
ఎర్రంగ నుండు ఈత కాయలు!



- ఆళ్ల నాగేశ్వరరావు,
74166 38823.

గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా ప్రతిరోజూ 'వేసవి విడిది' ముస్తాబై వస్తోంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు మెయిల్‌కి లేదా
వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.
మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com
- ఎడిటర్

జీవన the family

JEEVANA

జీవన సౌరభం

లక్ష్యం ఏర్పర్చుకోవడానికి సందర్భం అంటూ ఏమీ అవసరం లేదు. సంకల్పం ఉంటే చాలు.

నిస్సహాయ స్థితి నుంచి నీడనిచ్చే స్థాయి దాకా ...

మమతానుబంధాలు వెల్లివిరియాల్సిన కుటుంబాల్లో ద్వేషం, నిరాకరణచోటు చేసుకుంటే జీవితం నరక ప్రాయమే! కుటుంబాల్లో దురాచారాలూ, పురుషాధిపత్యం పీఠం వేసుకొని ఉంటే - వాటిని ఛేధించుకుని బయటకు రావటం అంత సులభమైన పని కాదు. కోడలిగా ఓ ఇంటికి వెళ్లిన ఆమెకు అప్పటికే తన భర్తకు మరో భార్య ఉందని తెలిసి, ఆవేదనకు గురైంది. పైగా భర్త తననో మనిషిలా చూడకుండా వేధింపులకు దిగటంతో తల్లడిల్లిపోయింది. అత్తమామల నుంచీ నిరాదరణ ఎదుర్కొంది. అలాంటి పరిస్థితులను దాటి, ఇప్పుడు అనేకమందికి తానే ఒక అభయహస్తంగా, నీడగా నిలబడింది. ఆమె పేరు హేమలత. అందరూ హేమలతా బెహన్ అని ఇష్టంగా పిలుచుకుంటారు.



ఉత్తరప్రదేశ్ రుద్ర ప్రయోగ్ జిల్లాలోని రాన్సి గ్రామంలో హేమలత జన్మించారు. ఆమె పసిపాపగా ఉన్నప్పుడే తండ్రి చనిపోయాడు. తనకు ఐదేళ్ల వయస్సు ఉన్నప్పుడు - తల్లి జీవంతిదేవికి ఇష్టం లేకపోయినా వేరొకరిని పెళ్లి చేశారు. భార్య ఉండగానే మరో ఇద్దర్ని, ముగ్గుర్ని పెళ్లి చేసుకోవడం అక్కడ కొనసాగుతోంది. భర్త చనిపోయినా, వదిలేసినా, గత్యంతరం లేని పరిస్థితుల్లో మహిళలు వేరొకరి భార్యగా వెళ్లాల్సిందే. లేకపోతే కట్టుబాట్లకు వ్యతిరేకమైనదిగా కుల పెద్దలు భావిస్తుంటారు. మహిళ ఒంటరిగా జీవిస్తే ఆమె నైతిక ధైర్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తారు. తన చుట్టూ ఉన్న ప్రాంతంలో ఇలాంటి అనేక సంఘటనలు హేమలత చిన్నప్పటి నుంచి చూస్తూనే ఉంది.


తల్లి వేరే పెళ్లి చేసుకొని వెళ్లడంతో అమ్మమ్మ గారింట్లో పెరిగింది హేమలత. 15 ఏళ్ల వయసు రాగానే పెళ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. ఒక మధ్యవర్తి ఆమె కుటుంబాన్ని మోసగించి, అప్పటికే పెళ్లయి ముగ్గురు పిల్లలున్న వ్యక్తికి కట్టబెట్టాడు. అత్తింటికి వెళ్లగానే ఆమెకు కఠోర వాస్తవాలు తెలిశాయి. అప్పటికే తన భర్త తన మొదటి భార్యను ఓ గదిలో బంధించి చిత్ర హింసలు పెడుతున్నాడు. ఆ ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే లోపలి నుంచి మొదటి భార్య ఆర్తనాదాలు. హేమలతను కూడా ఓ మనిషిలా చూడలేదు. అత్తింటి ఆరళ్లతోపాటు భర్త వేధింపులు, ఈసడింపులు షరా మామూలుగా మారాయి. తనకు ఇలా జరిగినందుకు బాధపడుతూనే ఆ కూపంలో ఆరేళ్లు కొనసాగింది. ప్రతి విషయానికీ తనదే తప్పన్నట్లుగా భర్త వ్యవహరించేవాడు. అత్తమామలదీ అదే వరస. దీంతో, ఆమె ధైర్యం తెచ్చుకొని, 1988లో ఆ ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. అంజనీసైన్‌లోని ఒక ఆశ్రమానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ తనలాంటి 40 మంది మహిళలు ఆశ్రయం పొందుతున్నారు. వారంతా హేమలత పరిస్థితిని తెలుసుకుని, నీకు మేమున్నామంటూ ధైర్యం చెప్పారు. దాంతో ఆమె కొంత ఊరట చెందింది.

నిస్సహాయిగా ఆ ఆశ్రమంలో చేరిన హేమలత తొందరలోనే ఒక ధైర్యవంతురాలిగా అక్కడి అన్ని పనులూ చక్కబెట్టేది. తనలా వచ్చి చేరే నిస్సహాయ మహిళలకు ధైర్యం చెప్పేది. అందరికీ తనదైన రీతిలో సేవలు అందించేది. అలా 17 సంవత్సరాల పాటు అక్కడ ఉంటూ, తోటి మహిళలకు అండగా నిలబడింది. ఆ ఆశ్రమానికి చెందిన ఇతర బ్రాంచీలకు వెళ్లి అక్కడి మహిళలకు సేవలందించింది. ఆ క్రమంలోనే ఆమె డెహ్రాడూన్‌కు తన మకాం మార్చారు. ఆమె కృషిని మెచ్చుకున్న సంస్థ ఆమె సేవలు కొనసాగించేందుకు గానూ రిషికేష్‌లో 400 చదరపు గజాల స్థలాన్ని కేటాయించింది. అందులో ఆమె ఒక భవనం నిర్మించి, తన సేవలను కొనసాగిస్తున్నారు. 2013లో యాక్షన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సొసైటీ ఆర్గనైజేషన్ (ఎఎఎస్) స్థాపించారు. క్షయవ్యాధి (టిబి)తో బాధపడే వారికి నయం చేయటం కోసం దీనిని ఏర్పాటు చేశారామె. మొదటగా ఆరుగురు బాలికలను చేర్చుకుని వారికి నయం చేయించారు. ఇప్పుడు అనేకమందికి ఆమె ఆసరాగా నిలబడ్డారు.

చిన్నతనంలో తీవ్రమైన కష్టాలు, కడగండ్లు ఎదుర్కొన్న హేమలత ఆ తర్వాత పరిణామ క్రమంలో ఆత్మగౌరవ మహిళగా జీవిస్తున్నారు. రిషికేష్‌లోని భవన నిర్మాణం కొనసాగిస్తుండగా, కొందరు తెలిసిన వారు సహాయం చేయటానికి రాగా, ఆమె సున్నితంగా తిరస్కరించారు. తన అనుచరులు 'హేమలత బెహన్'గా తన ఇంటి ముందు పెట్టిన నేమ్‌ప్లేటును తొలగించి, 'పూర్ణకుటీర్' పేరిట నేమ్‌ప్లేట్ ఏర్పాటు చేయించారు. "నేను నా జీవితంలో దుర్భరమైన పరిస్థితులను చూశాను. వాటి నుంచి బయట పడే ప్రయత్నం చేస్తూ, నాలాంటి అనేకమందికి సహాయకారిగా నిలబడ్డాను. నేను స్థాపించిన ఈ సంస్థ నా మరణాంతరం హిమాలయన్ ఇనిస్టిట్యూట్ హాస్పటల్‌కు చెందేలా వీలునామా రాశాను. అలాగే నా భౌతికకాయం వైద్య పరీక్షలకు ఉపయోగపడాలని భావిస్తున్నాను." అని చెబుతున్నారు హేమలతా బెహన్. అనటమే కాదు; దేహదానపత్రం మీద సంతకం చేసి, ట్రస్టుకు అప్పగించారు కూడా!



29న పుష్ప-2 సెకండ్ సింగిల్



అల్లు అర్జున్ హీరోగా రష్మికా మందన్నా హీరోయిన్‌గా సుకుమార్ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'పుష్ప 2 ది రూల్' ప్రమోషన్ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. తాజాగా ఈ చిత్రం రెండో సాంగ్ డ్యూయెట్‌పై చిత్రబృందం క్లారిటీ ఇచ్చింది. రష్మికపై ఓ చిన్న బైట్ వీడియోతో 'సూసేకి అంటూ సాగే సాంగ్ ఈ మే 29న ఉదయం 11 గంటల 7 నిమిషాలకి రిలీజ్ చేస్తున్నట్లుగా ప్రకటించారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు. ఆగస్టు 15న ఈ సినిమా విడుదల కానుంది.

ఆస్కార్ లైబ్రరీలో 'పార్కింగ్'




గత ఏడాది తమిళ నాట వచ్చిన పలు హిట్ చిత్రాల్లో హరీష్ కళ్యాణ్ హీరోగా నటించిన 'పార్కింగ్' చిత్రం ఒకటి. ఫ్యాషన్ స్టూడియోస్, సోల్జర్ ఫ్యాక్టరీ వారు నిర్మాణం వహించారు. ఇందుజా రవిచంద్రన్ హీరోయిన్‌గా రామ్ కుమార్ బాలకృష్ణన్ తెరకెక్కించిన ఈ చిత్రం ఆస్కార్ లైబ్రరీలో చోటు దక్కించుకుంది. కొన్ని ముఖ్యమైన కలెక్షన్‌లో ఒకటిగా పార్కింగ్ స్క్రీన్‌ప్లేకి ఆస్కార్ అవకాశం ఇచ్చింది. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ షేర్ చేసింది. హరీష్ కళ్యాణ్ కూడా ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ అకాడమీ వారికి తన చిత్ర యూనిట్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు.

నేడు 'రాజు యాదవ్' విడుదల

బుల్లి తెర కమల్ హాసన్‌గా పాపులరైన జబర్దస్త్ ఫేమ్ గెటప్ శ్రీను 'రాజు యాదవ్'తో హీరోగా ఆరంగేట్రం చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా నుంచి ఫీల్ మై స్మైల్ అంటూ సాగే పాటను డైరెక్టర్ కొరటాల శివ విడుదల చేశారు. ఈ చిత్రం ద్వారా కృష్ణమాచారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సాయి వరుణవి క్రియేషన్స్, చరిష్మా డ్రీమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లపై కె.ప్రశాంత్ రెడ్డి, రాజేష్ కల్లెపల్లి సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. శుక్రవారం నాడు ఈ సినిమా విడుదల కానుంది.





'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఫస్ట్‌లుక్ విడుదల


తమిళ హీరో అజిత్ నటిస్తున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' నుంచి ఫస్ట్‌లుక్ విడుదలైంది. అజిత్ మూడు ముఖాలతో కూడిన ఈ పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో అజిత్ త్రిపాత్రాభినయం చేస్తున్నారు. ఆయనకు జంటగా శ్రీలీల, మీనా, సిమ్రాన్ నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి థియేటర్లలో రానుంది.



'సత్యభామ' వాయిదా..

కాజల్ అగర్వాల్ 60వ చిత్రం 'సత్యభామ'. సురన్ చిక్కాల తెరకెక్కించిన ఈ చిత్రం విడుదల వాయిదా పడుతూ వస్తుంది. తాజాగా ఈనెల 25న విడుదల కావాల్సి ఉండగా ఇప్పుడు అది కూడా వాయిదా పడింది. జూన్ 7న రిలీజ్‌కి రాబోతున్నట్లుగా చిత్రబృందం ఓ పోస్టర్ ద్వారా తెలిపింది. ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్, నాగినీడు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. శ్రీచరణ్ పాకాల సంగీతం అందించారు. ఆరం ఆర్ట్స్ నిర్మాణం వహించారు.

చురుగ్గా కాంతారా 2 పనులు



కాంతారా2 పేరుతో సీక్వెల్‌ను తీసుకొచ్చే ప్రయత్నాలను ఆ సినిమా హీరో రిషబ్ శెట్టి చురుగ్గా చేస్తున్నారు. ఇటీవలే ఆయన మలయాళ నటుడు మోహన్‌లాల్‌ను కలిశారు. కాంతార-2లో నటించమని అడగటానికే ఈ సమావేశం జరిగినట్టు వార్తలొచ్చాయి. కాంతార2 ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాగా, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే రిషబ్ ఫ్యామిలీతో ఉన్న ఫొటోలను ఎప్పటికప్పుడు షేర్ చేస్తుంటారు. తాజాగా తన కూతురు రాధ్యకు అక్షర అభ్యాసం నిర్వహించారు రిషబ్ దంపతులు. దానికి సంబంధించిన ఫోటోలను తన ఇన్‌స్టాలో పంచుకున్నారు.

ఫైనల్‌కు చేరేదెవరో..!

- నేడు సన్‌రైజర్స్-రాజస్థాన్ జట్ల మధ్య క్వాలిఫయర్-2 మ్యాచ్
- రాత్రి 7.30గం॥ల నుంచి



చెన్నై: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-17 చివరి దశకు చేరుకుంది. ఈ సీజన్‌లో మరో రెండు మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇప్పటికే ఫైనల్‌కు చేరగా.. బెంగళూరు జట్టు ప్లే-ఆఫ్‌లో ఓడి 4వ స్థానానికి పరిమితమైంది. మరోవైపు కోల్‌కతా చేతిలో ఓడిన సన్‌రైజర్స్ హైదరాబాద్, బెంగళూరుపై నెగ్గిన రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య చిదంబరం స్టేడియంలో శుక్రవారం క్వాలిఫయర్-2 మ్యాచ్ జరగనుంది.

సన్‌రైజర్స్ ఈ సీజన్‌లో అద్భుత విజయాలతో ఏకంగా 2వ స్థానంలో నిలిచి ప్లే-ఆఫ్‌కు చేరినా.. ఫైనల్ బెర్త్‌కోసం జరిగిన పోటీలో కోల్‌కతా చేతిలో ఓడి నేడు మరోదఫా ఫైనల్ బెర్త్‌కోసం రాజస్థాన్‌తో పోటీ పడనుంది. ఇక రాజస్తాన్ రాయల్స్ ఈ సీజన్ ప్రారంభంలో వరుస విజయాలతో మెరిసింది. ఆ తర్వాత వరుసగా నాలుగు మ్యాచుల్లో ఓడింది. అయినా మూడోస్థానంలో నిలిచి ప్లే-ఆఫ్స్‌కు చేరింది. బుధవారం జరిగిన ఎలిమినేటర్-1లో రాజస్థాన్ జట్టు బెంగళూరును నాలుగు వికెట్ల తేడాతో ఓడించి క్వాలిఫయర్-2కు అర్హత సాధించింది. సన్‌రైజర్స్-రాజస్థాన్ జట్లు ఈ సీజన్‌లో ఒక్కసారి మాత్రమే తలపడగా.. ఆ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ జట్టు ఒక్క పరుగు తేడాతో రాజస్థాన్‌పై సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. ఇక రాజస్థాన్ 2008 తొలిసారి టైటిల్‌ను కైవసం చేసుకొని 2022లో రన్నరప్‌గా నిలిచింది. మరోవైపు సన్‌రైజర్స్ 2016లో టైటిల్‌ను చేజిక్కించుకొని 2018లో రన్నరప్‌గా నిలిచింఇ.

సన్‌రైజర్స్ టాపార్డర్ రాణిస్తేనే...

సన్‌రైజర్స్ టాపార్డర్ బ్యాటర్లు ట్రివిస్ హెడ్-అభిషేక్ శర్మ దుర్భేధ్య ఫామ్‌లో ఉన్నారు. వీరిద్దరూ తొలి 10ఓవర్లు క్రీజ్‌లో నిలదొక్కుకుంటే స్కోర్‌బోర్డు పరుగు తీయడం ఖాయం. వీరి బ్యాట్‌నుంచి పరుగుల వరద పారడమూ ఖాయమే. హెడ్ 13మ్యాచుల్లో ఒక సెంచరీ, 4అర్ధసెంచరీల సాయంతో 533పరుగులు చేయగా.. అభిషేక్ శర్మ 14మ్యాచుల్లో 75పరుగుల అత్యధిక స్కోర్‌తో 470పరుగులు చేశాడు. ఇందులో మూడు అర్ధసెంచరీలు ఉన్నాయి. ఆ తర్వాత క్లాసెన్, త్రిపాఠి, షాబాజ్ భారీస్కోర్లు చేయగల సమర్థులే.

రాజస్థాన్ తక్కువగా అంచనావేయొద్దు: అంబటి

మరోవైపు రాజస్థాన్ రాయల్స్‌ను ఏమాత్రం తక్కువ అంచనా వేయొద్దని చెన్నై సూపర్‌కింగ్ మాజీ ఆటగాడు అంబటి రాయుడు అభిప్రాయపడ్డాడు. బ్యాటింగ్, బౌలింగ్, స్పిన్ విభాగాల్లో ఆ జట్టు పటిష్టంగా ఉందని, ఈ మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ ఫేవరెట్‌గా కనిపిస్తోందని చెప్పుకొచ్చాడు. వాళ్లు క్వాలిఫయర్-2కు చేరుకున్న తీరు అద్భుతం. చెన్నై పిచ్ స్పిన్నర్లకు అనుకూలమని, ఈ పిచ్‌పై పరుగులు రాబట్టేందుకు కష్టపడాల్సి వస్తుందన్నాడు. అందుకే బ్యాటింగ్‌పై దృష్టి సారించాలని అంబటి రాయుడు అభిప్రాయపడ్డాడు.

జట్లు(అంచనా)...

సన్‌రైజర్స్ : కమిన్స్(కెప్టెన్), హెడ్, అభిషేక్ శర్మ, త్రిపాఠి, నితీశ్ రెడ్డి, షాబాజ్ అహ్మద్, క్లాసెన్(వికెట్ కీపర్), అబ్దుల్ సమద్, సన్వీర్ సింగ్, భువనేశ్వర్, వి.వ్యాషక్/నటరాజన్.

రాజస్థాన్ : సంజు శాంసన్(కెప్టెన్, వికెట్ కీపర్), జైస్వాల్, టామ్ కోహ్లెర్, రియాన్ పరాగ్, ధృవ్ జురెల్, హెట్‌మైర్, రువాన్ పావెల్, అశ్విన్, బౌల్ట్, ఆవేశ్ ఖాన్, సందీప్ శర్మ/చాహల్.

క్వార్టర్స్‌కు అస్మిత, సింధు

మలేషియా బ్యాడ్మింటన్ టోర్నీ



కౌలాలంపూర్: మలేషియా మాస్టర్స్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి పివి సింధు, సంచలనాల అస్మిత చాలీహా ప్రవేశించారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 15వ స్థానంలో ఉన్న పివి సింధు గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీలో 21-13, 12-21, 21-14తో మాజీ ఛాంపియన్ సిమ్-యు-జిన్(కొరియా)ను చిత్తుచేసింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో సిమ్ 34వ ర్యాంక్ క్రీడాకారిణి. ఇక యువ సంచలనం అస్మిత చాలీహా ఏకంగా 3వ సీడ్ బివెన్ జంగ్(అమెరికా)ను ఓడించి పెను సంచలనాన్ని నమోదు చేసింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 53వ స్థానంలో ఉన్న 24ఏళ్ల అస్మిత హోరాహోరీ పోరులో 21-19, 16-21, 21-12తో బివెన్ జంగ్‌ను ఓడించింది. సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో అస్మిత క్వార్టర్స్‌కు చేరడం ఇది రెండోసారి. క్వార్టర్‌ఫైనల్లో అస్మిత 16వ ర్యాంక్ క్రీడాకారిణి, చైనాకు చెందిన జెంగ్-హి-మన్‌తో తలపడనుంది. ఇక పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జి 13-21, 18-21తో 5వ సీడ్ జి-జియా(చైనా) చేతిలో, మహిళల డబుల్స్‌లో త్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ జంట 18-21, 22-20, 14-21తో కొరియా జంట చేతిలో ఓటమిపాలయ్యారు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో బి.సుమిత్‌రెడ్డి-సిక్కిరెడ్డి జంట 9-21, 15-21తో టాప్‌సీడ్, మలేషియాకు చెందిన చెన్-టాంగ్, టో-ఇ-వుయ్ చేతిలో వరుససెట్లలో పరాజయాన్ని చవిచూశారు. మరో పోటీలో సిమ్రన్ సింఘ్వీ-రితికా ఠక్కర్ జంట 17-21, 11-21తో 2వ సీడ్ మలేషియా జోడీ చేతిలో ఓటమిపాలయ్యారు.

110మీ. హార్డిల్స్‌లో తేజస్ జాతీయ రికార్డు బ్రేక్



జీవస్కైలా(ఫిన్లాండ్): తేజస్ షిర్సే 110మీ. హార్డిల్స్‌లో జాతీయ రికార్డును బ్రేక్ చేశాడు. ఫిన్లాండ్ వేదికగా జరుగుతున్న అథ్లెటిక్ కాంటినెంటల్ టూర్‌లో భాగంగా గురువారం జరిగిన 110మీ. హార్డిల్స్‌లో తేజస్ 13.41సెకన్లలో గమ్యానికి చేరాడు. ఈ క్రమంలో 2017లో సిద్ధార్థ్ తింగలయ నెలకొల్పిన 13.48సెకన్ల రికార్డును బ్రేక్ చేశాడు. కానీ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత మార్క్ 13.27సెకన్లను అందుకోలేకపోయాడు. ఇక మహిళల 100మీ. హార్డిల్స్‌లో జ్యోతి యర్రాజి జాతీయ రికార్డును 12.78సెకన్ల రికార్డును చేరుకోవడంలో విఫలమైంది. ఇక 100మీ. పరుగును 10.39సెకన్లలో గమ్యానికి చేరి అమ్లాన్ 4వ స్థానంలో నిలిచి పారిస్ ఒలింపిక్స్ అర్హత మార్క్‌ను చేరుకోలేకపోయాడు. అలాగే మహ్మద్ అఫసల్ 800మీ. పరుగును ఒక నిమిషం 48.91సెకన్లు, లాంగ్‌జంప్‌లో పవన నాగరాజ్ 6.06మీ. దూకి 4వ స్థానంలో నిలిచారు. ఇక నార్వేకు చెందిన బెర్జన్ 6.12మీ. రెండోస్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68